


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

కొండ ప్రాంతాల్లో చిక్కుకున్న పర్యాటకులు

కటక్‌లో హింస

05

ఆసుపత్రిలో భారీ అగ్నిప్రమాదం : ఆరుగురు రోగులు మృతి

సంపుటి 28, సంచిక: 107 | మంగళవారం | 07-10-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

## నేరుగా సుప్రీంకోర్టుకు ఎందుకొచ్చారు?



- బిసి రిజర్వేషన్ వ్యతిరేక పిటిషన్ తిరస్కరించిన అత్యున్నత న్యాయస్థానం
- 42శాతం కోటా ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు నిలిపివేతకు నిరాకరణ

03

**న్యూఢిల్లీ:** వెనుకబడిన తరగతుల(బిసి)కు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వు సవాలు చేస్తూ దాఖలైన ఒక పిటిషన్‌ను విచారణకు తీసుకునేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ప్రభుత్వ ఉత్వర్వును నిలిపివేయాలని పిటిషనర్ చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. "మీరు నేరుగా ఎందుకు సుప్రీంకోర్టు వచ్చారు?" అని పిటిషనర్ తరపు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించే 32వ అధికరణ ప్రకారం సుప్రీంకోర్టులో పిటిషనర్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం విచారణకు తీసుకునేందుకు తిరస్కరిస్తూ, హైకోర్టును ఆశ్రయించేందుకు స్వేచ్ఛ ఇస్తున్నట్లు తెలియజేసింది. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లను 67 శాతానికి పెంచుతూ, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబరు 26వ తేదీన ఉత్తర్వు జారీ చేసింది. దీంతో యాభై శాతానికి రిజర్వేషన్లను పరిమితం చేస్తూ న్యాయస్థానాలు ఇచ్చిన వివిధ తీర్పులను ఈ ఉత్తర్వు ఉల్లంఘించిందంటూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగపరమైన ఉల్లంఘనలకు సంబంధించిన పరిష్కారాలు సాధించడానికి స్థానిక న్యాయస్థానాలనే ఆశ్రయించాలని పిటిషనర్‌కు సుప్రీంకోర్టు తెలియజేసింది."రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద హైకోర్టు తరువాయి 12లో

### బిసి రిజర్వేషన్ పిటిషన్‌పై సుప్రీం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- 42 శాతం కోటా అమలుకు అన్ని రాజకీయపార్టీలు సహకరించాలని రాష్ట్ర మంత్రులు విజ్ఞప్తి

## భారత ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నం



**కోర్టు విచారణ సమయంలో బూటు విసిరేందుకు యత్నించిన న్యాయవాది**

- వెంటనే అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 'సనాతన ధర్మానికి అవమానాలు తలెత్తితే సహించబోం' అంటూ నిందితుడు నినాదాలు
- 'ఇలాంటి చర్యలు ఏవీ నన్ను ప్రభావితం చేయలేవు' అని ఘటనపై స్పందించిన గవాయ్

**న్యూఢిల్లీ:** భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై 71ఏళ్ల న్యాయవాది బూటు విసిరేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటన సుప్రీం కోర్టు లో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. అ యితే అతడు విసిరిన ఆ బూటు ధర్మాసనం వద్ద కు చేరలేదు. వెంటనే అతడిని పోలీసులు కస్టడీలో కి తీసుకున్నారు. కోర్టుగదిలో ఊహించని రీతిలో జరిగిన ఈ హఠాత్ పరిణామానికి అందరూ నివ్వెరపోయారు.ప్రత్యక్షసాక్షుల ప్రకారం... ప్రధాన న్యాయమూర్తి సోమవారం ఉదయం మొదటి కోర్టులో విచారణను ప్రారంభించారు. అంతలోనే ఓ న్యాయవాది హఠాత్తుగా నినాదాలు లేవనెత్తుతూ సిజెఐ ధర్మాసనం వైపునకు బూటు విసిరే యత్నం చేయగా అడ్డుకున్నారు. 'భారతదేశం సనాతన ధర్మానికి అవమానాన్ని సహించదు' తరువాయి 12లో

### న్యాయవ్యవస్థపై ప్రత్యక్ష దాడి : సిపిఐ

భారత సుప్రీం కోర్టు ప్రధానన్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై సుప్రీంకోర్టులోనే బూటు విసిరిన దిగ్భ్రాంతికర ఘటనను సిపిఐ ప్ర ధాన కార్యదర్శి డి.రాజా తీవ్రంగా ఖండించారు. ఇది న్యాయవ్యవస్థ గౌరవంపై ప్రత్యక్ష దాడి అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది కేవలం న్యాయమూర్తిపై నే వ్యక్తిగత దాడి కాదని, భారత రాజ్యాం గం కాకుండా మితవాదుల నిబంధనావళిని అమలు చేయాలని మొత్తం న్యాయవ్యవస్థకు సవాలువిసరడం లాంటిదని రాజా వ్యాఖ్యానించారు. మితవాదులు వెదజల్లుతున్న మతతత్వ, కులతత్వ విషం చివరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న దళిత న్యాయమూర్తిపైనే బహిరంగంగా లక్ష్యంగా చేసుకునే స్థాయికి చేరుకున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

## రెండు దశల్లో బిహార్ ఎన్నికలు





**నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్, 14న కౌంటింగ్**

- ఈనెల 10న తొలి విడతకు, 13న రెండో విడతకు నోటిఫికేషన్
- 7 రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు 11న ఉపఎన్నికలు
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- బిహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి 17 నూతన సంస్కరణలు అమలు చేయనున్నట్లు సిఇసి జ్ఞానేశ్ కుమార్ వెల్లడి

**న్యూఢిల్లీ:** బిహార్ శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది. రెండు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. వచ్చే నెల 6, 11న పోలింగ్ జరగనుండగా 14న ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి 17 నూతన సంస్కరణలు అమలు చేయనున్నట్లు తెలిపిన ఇసి ఇవిఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు వినియోగిస్తున్నట్లు వివరించింది. 250 పోలింగ్ స్టేషన్ల పరిధిలో అశ్వికదళాలతో గస్తీ నిర్వహించనున్నట్లు పేర్కొంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం 90,712 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వివరించారు. గరిష్ఠంగా 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ కేటాయించామని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్‌క్యాస్టింగ్ చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, తరువాయి 2లో

### ఏ ఒక్క ఓటరునూ విస్మరించొద్దు : సిపిఐ



బిహార్‌లో అర్హులైన ఏ ఒక్క ఓటరును విస్మరించకుండా ఎన్నికల సంఘం తన యత్నాలు తీవ్రతరం చేయాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. బిహార్ ఎన్నికల షెడ్యూలును ప్రకటించినప్పటికీ ఓటర్ల నమోదు ప్రక్రియపై ఇప్పటికీ గంభీరమైన ఆందోళనలు అలాగే ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక ఓట్ల సవరణ ప్రక్రియపై అనేక ప్రశ్నలు వ్యక్తమయ్యాయని, సుప్రీంకోర్టు ఆధార్, ఇతర పత్రాలతో ఓటరుగా నమోదు చేసుకోవచ్చనేంత వరకు అవి కొనసాగాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికీ అనేక మంది అర్హులైన ఓటర్లు ప్రత్యేకించి అణగారిన వర్గాలు, వరద ప్రభావిత ప్రాంతాలకు చెందిన వారి పేర్లు నమోదు కాలేదన్నారు.





## నవంబరు 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

**ఈ నెల 13న నోటిఫికేషన్ జారీ : వచ్చే నెల 14న ఓట్ల లెక్కింపు**

**న్యూఢిల్లీ :** తెలంగాణ రాష్ట్రంలో ఉత్కంఠ రేపుతున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కేంద్రం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. వచ్చే నెల 11న జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ జరగనుంది. వచ్చే నెల 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నెల 13న జూ బ్లిహిల్స్ ఉపఎన్నికకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసి అదే రోజు నుం చి నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 21 నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేదీ. ఈ నెల 22న నామినేషన్లను అధికారులు పరిశీలిస్తారు. 24వ తేదీ వరకు నామినేషన్ల ఉపసం హరణకు అవకాశం ఉంటుంది. వచ్చే నెల 11న పోలింగ్ జరగనుండగా 14న ఓట్ల లె క్కింపు చేపడతారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీ నాథ్ మృతితో జూబ్లీహిల్స్ ని యోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. కాగా, జూబ్లీహిల్స్‌తో పాటు దేశవ్యాప్తం గా ఏడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలైన జమ్ముకశ్మీర్, రాజస్థాన్, జార్ఖండ్, పంజాబ్, మిజోరం, ఒడిశా రాష్ట్రాల్లో ఖాళీ అయిన అసెంబ్లీ తరువాయి 2లో

## హైదరాబాద్‌లో 'ఎలి లిల్లీ' మాన్యుఫ్యాక్చరింగ్ హబ్

- దేశంలోనే తొలిసారిగా భాగ్యనగరంలో నెలకొల్పేందుకు ముందుకొచ్చిన ఫార్మా దిగ్గజ కంపెనీ
- రూ.9 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత
- ఇక్కడి నుంచే ప్రపంచ స్థాయి ఔషధాల తయారీ, సేవల విస్తరణ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కంపెనీ ప్రతినిధుల కీలక చర్చలు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ప్రపంచంలో పేరొందిన ఫార్మా దిగ్గజ కంపెనీ ఎలి లిల్లీ కంపెనీ దేశంలోనే మొదటి సారిగా తమ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. అందుకు అవసరమయ్యే ఒక బిలియన్ డాలర్ల (సుమారు రూ. 9000 కోట్లు) భారీ పెట్టుబడులకు కంపెనీ ముందుకొచ్చింది. ఈ నిర్ణయంతో ఎలి లిల్లీ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా తమ ఔషధాల సరఫరా సామర్థ్యాన్ని విస్తరించనుంది. హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం ఎలి లిల్లీ కంపెనీ ప్రతినిధులు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎలి లిల్లీ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, లిల్లీ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సిఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ చర్చల అనంతరం ఎలి లిల్లీ కంపెనీ తమ విస్తరణ ప్రణాళికలు, తెలంగాణలో భారీ పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర తరువాయి 2లో

## వివిధ శాఖలకు కేటాయించిన భూముల లెక్కలు తీయండి

- వాటి వినియోగం, ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర నివేదిక రూపొందించండి
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో గత 30 నుంచి 40 సంవత్సరాల నుంచి రెవెన్యూ శాఖ తరపున వివిధ అవసరాల నిమ్మితం వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల వివరాలను, వాటి వినియోగాన్ని, ప్రస్తుతం వాటి పరిస్థితులపైన సమగ్ర నివేదికను రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. రెవెన్యూశాఖకు సంబంధించిన భూముల విషయమై సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాజెక్టుల కోసం రెవెన్యూ విభాగం వేలాది ఎకరాల భూములను పలు విభాగాలకు ముఖ్యంగా నీటిపారుదల,అటవీ శాఖలకు కేటాయించిందని, తెలంగాణ రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్ట్‌లో మార్పులు,చేర్పుల కారణంగా కొన్ని రద్దయిందని వివరించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని లెక్కలు తేల్చాలని మంత్రి పొంగులేటి అధికారులకు సూచించారు. గడచిన 30 సంవత్సరాలలో అటవీ, శాఖకు రెవెన్యూ శాఖ కేటాయించిన భూమి ఎంత, అందుకు రెవెన్యూ శాఖకు అటవీ శాఖ కేటాయించిన భూమి ఎంత అనే వివరాలను ఈ రెండు శాఖలు సమన్వయంతో ఒక నివేదికను తయారుచేయాలని సూచించారు. సీతారామ ఎత్తిపోతలకు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1138 ఎకరాల తరువాయి 2లో

## రెండు మూడు రోజుల్లో జూబ్లీహిల్స్ అభ్యర్థి ఖరారు

- బిసి అభ్యర్థికే వచ్చే అవకాశం
- త్వరలోనే కామారెడ్డిలో కాంగ్రెస్ బహిరంగ సభ
- మీడియా 'చిట్‌చాట్'లో టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) లోని పదవులన్నింటినీ డిసెంబర్ చివరి నాటికి భర్తీ చేస్తామని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఇటీవల వాయిదా పడిన కామారెడ్డిలో కాంగ్రెస్ బహిరంగ సభ త్వరలోనే నిర్వహిస్తామని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మహేష్‌కుమార్ గౌడ్ ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టు నిర్ణయాన్ని తాము ముందే ఊహించామన్నారు. అలాగే స్థానిక పరిస్థితులను బట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ, సిపిఐ (ఎం), తెలంగాణ జన సమితి అభ్యర్థులకు అవకా శం ఇస్తామని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక టికెట్ బిసి అభ్యర్థికే వచ్చే అవకాశం ఉందని టిపిసిసి అధ్యక్షుడు అన్నారు. పార్టీ అధిష్టానం రెండు మూడు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేసే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం టిపిసిసి నాలుగైదు పేర్లతో అభ్యర్థుల జాబితా సిద్ధం చేసిందని, మంగళవారం సిఎం రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాత అభ్యర్థుల లిస్ట్ ఎఐసిసికి పంపిస్తామని ఆయన తెలిపారు. ఈ ఉప ఎన్నిక కోసం తరువాయి 2లో

## ఎకరం రూ.177 కోట్లు




- రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీలో గరిష్ఠ ధరలు పలికిన భూములు
- హౌసింగ్ బోర్డు ప్లాట్ల విక్రయాలలోనూ రికార్డులు
- కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో చదరపు గజం రూ.1.14 లక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక,మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టిజిఐఐసి) ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో రాయదుర్గం భూమికి రికార్డ్ స్థాయిలో ఎకరా రూ.177 కోట్ల ధర పలికింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరం భూమిని రూ.177 కోట్ల చొప్పున 7.6 ఎకరాల స్థలాన్ని ఎంఎస్‌ఎన్ రియాలిటీ సంస్థ దక్కించుకున్నది. ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని టిజిఐఐసి సోమవారం వేలం పాట నిర్వహించింది. ఈ వేలం పాటలో ఎంఎస్‌ఎన్ రియాలిటీ సంస్థ అత్యధిక ధరతో 7.6 ఎకరాల భూమిని వేలం పాటలో దక్కించుకున్నది. ఎకరాకు రూ. 177 కోట్ల చొప్పున మొత్తం రూ.1357.59 కోట్ల ధర పలికింది. ఈ వేలానికి జెఎల్‌ఎల్ ఇండియా, ఎంఎస్‌టిసి భాగస్వామ్యంగా వ్యవహరించింది. 2017 సంవత్సరంలో రాయదుర్గ పార్‌సెల్స్‌లో ఎకరాకురూ. రూ 42.59 కోట్లు( మొత్తం 2.84 ఎకరాలు), ఆ తర్వాత 2022 సంవత్సరంలో నియోపోలీస్ కోకాపేటలో హెచ్‌ఎండిఏ నిర్వహించిన వేలం పాటలో ఎకరాకు భూమి రూ 100.75 కోట్లు ( మొత్తం 3.60 ఎకరాల స్థలం) పలికింది. కాగా రాయదుర్గం వేలం అద్భు త విజయాన్ని సాధించిందని, ఎకరాకు రూ. 177 కోట్ల ధర తెలంగాణ రాష్ట్రంపైన పెట్టుబడిదారుల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని టిజిఐఐసి వైస్ చైర్మన్, ఎండి తరువాయి 2లో

## వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్


- రోగనిరోధకశక్తి ప్రతికూల ప్రభావాలపై పరిశోధనలకుగాను బహుమతి



**స్టాక్‌హోం:** వైద్యశాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి–2025 లభించింది. మానవశరీరంలో ఉన్న రోగనిరోధకశక్తి కారకాల పనితీరును అదుపుచేసే వ్యవస్థపై పరిశోధనలు చేసినందుకుగాను అమెరికాకు చెందిన ఇద్దరికి, జపాన్‌కు చెందిన ఒక శాస్త్రవేత్తకు ఉమ్మడిగా ఈ నోబెల్ బహుమతి ప్రకటించారు. అమెరికా మహిళా శాస్త్రవేత్త ఇ.బ్రంకో (64), మరో అమెరికన్ శాస్త్రవేత్త డాక్టర్ రామ్స్‌డెల్ (64), జపాన్ ఒసాకా యూనివర్సిటీలో ఫ్రాంటైర్ రీసెర్చ్ సెంటర్ ఇమ్యునోల జీ ప్రొఫెసర్ షిమన్ సకగుచి (74) లను ఉమ్మ డిగా ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఆటో ఇమ్యూన్ వ్యాధులు, కేన్సర్ వ్యాధుల చికిత్సలకు వీరి పరిశోధనలు ఎంతగానో వైద్య రంగానికి ఉపయోగపడతాయని నోబెల్ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. "మానవశరీరంలో రోగనిరోధక వ్యవస్థ ఎలా పనిచేస్తుందో మనందరిలో ఒక నిర్ణయాత్మకమైన అవగాహన పెంపొందించడానికిఈ పరిశోధనలు ఉపయోగపడతాయి. మన తరువాయి 12లో

## బంగారం ధరలకు బడా రెక్కలు

**సోమవారం ఒక్కరోజే రూ. రూ.9,700కు పైగా పెంపు**
**రూ.1.30 లక్షలు దాటిన 10 గ్రాముల పసిడి ధర**



**న్యూఢిల్లీ :** దేశంలో బంగారం ధరలకు రెక్కలు వచ్చాయి. సోమవారం ఒక్కరోజే 10 గ్రాముల బంగారం ధర రూ.9,700కు పైగా పెరిగింది. దీంతో ఢిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1.30 లక్షలు దాటింది. మరోవైపు వెండి ధరలు కూడా ఆల్‌టైమ్ రికార్డు స్థాయిలో పెరిగాయి. కిలో వెండి ధర ఏకంగా రూ.7,400 పెరిగి రూ.1,57,400కు చేరింది. అమెరికా షట్‌డౌన్ కావడం సహా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉందనే అంచనాలే ఇందుకు కారణం. వీటికి తోడు అంతర్జాతీయ రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, ట్రంప్ టారిఫ్‌లు, కేంద్రీయ బ్యాంకుల బంగారం కొనుగోళ్లు కలగలిసి బంగారం ధరలు ఆకాశమే హద్దుగా పెరుగుతున్నాయి. నగరాల తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## 63కు పెరిగిన ఇండోనేసియా స్కూలు మృతులు

**జకర్తా:** ఇండోనేసియాలో కుప్పకూలిపోయిన స్కూలు భవన శిథిలాల నుండి విద్యార్థుల మృతదేహాలను ఒక్కొక్కటిగా వెలికితీస్తున్నారు. సోమవారంనాటికి మొత్తం మృతుల సంఖ్య 63కు పెరిగింది. సహాయ కార్యక్రమాలు ఇంకా కొనసాగుతున్నాయి. మృతులసంఖ్య ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇండోనేసియా తూర్పు జావా ద్వీపంలోని బహుళ అంతస్తుల స్కూలు భవనం గత సోమవారంలో కుప్పకూలిపోయింది. ఆ సమయంలో వందలమంది బాలికలు గ్రౌండ్‌లో ప్రార్థనలు చేస్తున్నందువల్ల ఇంకా పెద్ద ప్రమాదం తొలగిపోయింది. కానీ అప్పటికే తరగతి గదుల్లో విద్యార్థులు ఉన్నారు. ఇంకా దాదాపు 15 మంది విద్యార్థుల జాడ తెలియడంలేదు. వారి మృతదేహాలకోసం శిథిలాల్లో గాలిస్తున్నారు.

## మంచు తుఫానులో చిక్కుకున్న వెయ్యిమంది పర్వతారోహకులు



### ఒకరు మృతి... 350 మంది సురక్షితం

**బీజింగ్ :** ఎవరెస్టు శిఖరం తూర్పువైపు నుండి పైకి వెళ్ళిన పర్వతారోహకులు 1000 మంది మంచు తుఫానులో చిక్కుకున్నారు. వీరిలో 137 మందిని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు చేర్చినట్లు చైనా మీడియా తెలియజేసింది. మరో 200 మందితో అనుసంధానం కొనసాగిస్తూ వారిని కూడా సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకు రక్షక సిబ్బంది ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం వారు కూడా సురక్షితంగానే ఉన్నారు. ఇప్పటివరకూ మొత్తం 350 మందిని రక్షించారు. టిబెట్ పర్వత సమీపంలోని మారుమూల వాలులో సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. దురదృష్టవశాత్తూ ఒక పర్వతారోహకుడు మరణించారు. దాదాపు 16 వేల అడుగుల ఎత్తుకు వెళ్ళడంవల్ల అనారోగ్యానికి గురై ఈ పర్వతారోహకుడు మరణించారు. 4,600 మీటర్ల ఎత్తులో చిక్కుకున్న పర్వతారోహకులను చేరుకోవడానికి అడ్డంగా ఉన్న మంచును తొలగించే పనులు జరుగుతున్నాయి. టిబెట్‌లోని ఎవరెస్టు తూర్పువాలులో గడచిన శుక్రవారం తీవ్రమైన మంచుతుఫాను ప్రారంభమైంది. మరోవైపు నేపాల్‌లో వరదలు, కొండచరియలు విరిగిపడి మరణించినవారిసంఖ్య 80కి చేరుకుంది. నదులు పొంగి పొర్లుతున్నాయి. ఇంకోవైపు చైనాలో ఈ ఏడాది 21వ భారీ తుఫాను తూర్పు తీర గ్జుయెన్ కౌంటీని తాకింది. గాంగ్‌డాంగ్ రాష్ట్రంలో ప్రజలు ఇబ్బంది పడకుండా 1.51 లక్షలమంది పల్లపు నివాసితులను శనివారంనాడే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వారికి సకల సదుపాయాలూ సమకూర్చేందుకు అన్ని ఏర్పాట్లూ చేశారు.

## ట్రంప్ వలస ప్రజల అణచివేత చర్యలను అడ్డుకున్న ఫెడరల్ జడ్జి

**శాక్రమెంటో:** టెక్సాస్, కాలిఫోర్నియాల నుండి పోర్ట్‌లాండ్, ఓరెగాన్‌లకు నేషనల్ గార్డులను పంపేందుకు ట్రంప్ తీసుకున్న చర్యలను ఫెడరల్ కోర్టు జడ్జి అడ్డుకున్నారు. ఈ మేరకు ట్రంప్ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేశారు. పోర్ట్‌లాండ్‌లో నేరాలకు అడ్డూ అదుపూ లేకుండాపోయిందని, అక్రమంగా వలస వచ్చిన ప్రజలే ఈ నేరాలకు పాల్పడుతున్నారని, ఈ వలస ప్రజల నేరాలను అణచివేయాలని ట్రంప్ గట్టి నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా డెమోక్రాట్‌ల పాలనలో ఉన్న పోర్ట్‌లాండ్ నగరానికి నేషనల్ గార్డులను పంపాలని ట్రంప్ ఉత్తర్వులు ఇవ్వగా ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి ఈ ఉత్తర్వులను నిలిపివేశారు. చికాగో, ఇల్లినోయిస్ రాష్ట్రాల నుండి కూడా నేషనల్ గార్డ్స్‌ను ఈ ప్రాంతానికి పంపేందుకు ఇంతకుముందే ట్రంప్ ఉత్తర్వులు ఇచ్చారు. 200 మంది నేషనల్ గార్డులను పోర్ట్‌లాండ్‌కు పంపుతున్నట్లు పెంటగాన్ సైనిక వర్గాలు తొలుత ధృవీకరించిన తర్వాత కోర్టు ఉత్తర్వులు వచ్చాయి.

# ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం

### 27 రోజుల్లో మరో ప్రధానమంత్రి రాజీనామా
### అసెంబ్లీ రద్దు, మేక్రాన్ అభిశంసనకు లెఫ్ట్ డిమాండ్

**పారిస్:** నెలరోజులు కూడా పూర్తికాకముందే ఫ్రాన్స్ కొత్త ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకార్ను (39) రాజీనామా చేశారు. కొత్త మంత్రివర్గం ఏర్పాటు చేసిన తీరుపై సొంతపార్టీసహా ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేయడంతో ఆయన రాజీనామా చేశారు. అసలే పీకలోతు ఆర్థిక సమస్యల్లో ఉన్న ఫ్రాన్స్‌లో ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ప్రభుత్వం రాజకీయ సంక్షోభంలోనూ కూరుకుపోయింది. ఈ రాజీనామాతో స్టాక్ ఎక్స్ఛేంజ్ రెండూ శాతం క్షీణించింది. 2020, 2021 సంవత్సరాలలో కరోనా మహమ్మారి విజృంభించినప్పుడు ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు చేసిన ప్రభుత్వ అప్పు దేశ స్థూల జాతీయోత్పత్తిలో 113.9 శాతానికి పెరిగింది. 2022లో మేక్రాన్ దేశాధ్యక్షుడుగా తిరిగి ఎన్నికైనప్పటినుండీ ఫ్రాన్స్ రాజకీయాల్లో అస్థిరత, ఆర్థిక సంక్షోభం కొనసాగుతున్నాయి. గత ఏడాది ఆయన తీసుకున్న ఆకస్మిక సార్వత్రిక ఎన్నికల నిర్ణయం దేశాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టింది.

అధ్యక్షుడు మేక్రాన్‌ను అభిశంసించాలని, జాతీయ అసెంబ్లీ (దేశ ఉన్నత చట్టసభ)ని రద్దుచేయాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. వామపక్షాలు లేకుండా ప్రభుత్వాన్ని నడపడం సాధ్యంకాదని ఫార్ లెఫ్ట్ వర్గాలు తెగేసి చెప్పాయి. ఇంతకుముందు వామపక్షాలను దూరంగా పెట్టి మేక్రాన్ పరిపాలన సాగించవచ్చునని భావించి విఫలమయ్యారు. చట్టసభను రద్దుచేయకుండా, తిరిగి ఎన్నికలు నిర్వహించకుండా దేశంలో స్థిరత్వం సాధించడం సాధ్యంకాదని నేషనల్ ర్యాలీపార్టీ అధ్యక్షుడు జోర్డాన్ బార్డెల్లా వ్యాఖ్యానించారు. 2024 జులైలో దేశ అత్యున్నత చట్టసభకు జరిగిన ఆకస్మిక ఎన్నికల్లో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాలేదు. ఇక అప్పటి నుండీ మేక్రాన్ పాలనలో ఇప్పటివరకూ నలుగురు ప్రధానమంత్రులు రాజీనామాలు చేశారు. గాబ్రియేల్ అట్టల్ గత ఏడాది సెప్టెంబరులో రాజీనామా చేయగా, తర్వాత మేఖేల్ బార్నియర్ 99 రోజులు అధికారంలో కొనసాగారు. ఆ తర్వాత బేరౌ చట్టసభ విశ్వాసం కోల్పోవడంతో రాజీనామా చేశారు. లెకార్ను ఇప్పుడు రాజీనామా సమర్పించారు.

ప్రభుత్వ పాలనలో అత్యంత ముఖ్యమైన పదవులను నిర్వహించడానికి 18 మంది అగ్రశ్రేణి పాత మొఖాలనే తిరిగి ఎంపిక చేసిన తర్వాత లెకార్ను విమర్శలకు గురై పదవి కోల్పోయారు. మొత్తం 18 మంత్రిత్వ శాఖల్లో ఐదు కీలకమైన శాఖలు లెకార్నుకు చెందిన లెస్ రిపబ్లికన్స్ (ఎల్ఆర్ పార్టీ) గుప్పెట్లోనే ఉంచుకున్నారు. చేసిన వాగ్దానాలను ఈ మంత్రివర్గం కూర్పు ప్రతిబింబించడంలేదని ఎల్ఆర్‌పార్టీ అధ్యక్షుడు బ్రూనో రిటైల్లూ ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో ఎక్స్ వేదికగా విమర్శలు చేసిన కొద్ది గంటల్లోనే లెకార్ను రాజనామాకు దారితీయడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. రాజీనామా ప్రకటనవల్ల ఏర్పడిన రాజకీయ పరిస్థితి దృష్ట్యా తాను ఎల్ఆర్ పార్టీ రిపబ్లికన్స్ వ్యూహాత్మక కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు బ్రూనో రిటైల్లూ చెప్పారు. ఈ మేరకు సోమవారం ఉదయం రిపబ్లికన్స్ ముఖ్యుల సమావేశం జరగాల్సి ఉంది. లెకార్ను తన రాజీనామాను



మేక్రాన్‌కు సమర్పించారనీ, దానిని ఆయన ఆమోదించారనీ అధ్యక్ష భవనం ఎలైసీ ప్యాలెస్ వర్గాలు సోమవారం వెల్లడించాయి. పక్షపాత ధోరణే తన రాజీనామాకు కారణమని సెబాస్టియన్ లెకార్ను ప్రకటించారు. 27 రోజులు అతి తక్కువ కాలం బాధ్యతలు నిర్వహించిన ప్రధానమంత్రిగా ఆయన చరిత్రలో నమోదయ్యారు. సెప్టెంబరు తొమ్మిదో తేదీన లెకార్ను పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ''బ్లాక్ ఎవ్విర్‌థింగ్'' పేరుతో దేశమంతటా నిరసన ప్రదర్శనలు, వ్యవస్థల మూసివేతలు జరుగుతున్న తరుణంలో అధ్యక్షుడు మేక్రాన్ సన్నిహితుడైన లెకార్ను, మునుపటి పాలనలోని సమస్యలు పరిష్కరిస్తానన్న హామీతో ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారు. సామాజిక, ఆర్థిక సంక్షోభం నుండి దేశాన్ని బయట పడేసేందుకే ఈ మంత్రివర్గం ఏర్పాటు చేశానని ఆయన అన్నారు. 2014లో వెర్నోన్ నగర మేయర్‌గా ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు.

# మూవ్ ఫాస్ట్.. మూవ్ ఫాస్ట్..

### గాజా ఒప్పందంపై వెంటపడి తరుముతున్న ట్రంప్

**వాషింగ్టన్:** గాజాలో శాంతి స్థాపనకు ఉద్దేశించిన ఒప్పందంలో మొదటి దశను వారం రోజుల్లో పూర్తిచేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందాన్ని సత్వరం అమలు చేయాలంటూ ''మూవ్ ఫాస్ట్...మూవ్ ఫాస్ట్...'' అని ట్రంప్ అందరివెంటాపడి తరుముతున్నారు. వేగంగా చర్యలు తీసుకోకపోతే మరింత రక్తపాతం జరుగుతుందని ఆయన అన్నారు. ఒకవైపు గాజాలో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండగా మరోవైపు ట్రంప్ అందరినీ తరుముతున్నారు. దాడులు ఆపేయాలని ట్రంప్ కోరినప్పటికీ ఆత్మరక్షణ చర్యల పేరుతో ఐడిఎఫ్ దాడులు కొనసాగిస్తోంది. గడచిన ఇరవైనాలుగు గంటల్లో గాజాలో 24 మంది మరణించారు. అమెరికా విదేశాంగమంత్రి రుబియో కూడా 'మూవ్ ఫాస్ట్ అంటూ ట్రంప్ మంత్రాన్నే జపిస్తున్నారు. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసి కూడా ట్రంప్ ప్రణాళికకు తాను పూర్తి మద్దతు తెలియజేస్తున్నానన్నారు. పాలస్తినాలో హమాస్ ఉగ్రవాద సంస్థకు ప్రోత్సాహకర్తగా ఉన్న ఇరాన్‌ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నది. గాజా విషయంలో పాలస్తినా ప్రజలదే తుది నిర్ణయమని వ్యాఖ్యానించింది. కాగా రెడ్ క్రాస్ కూడా బందీల విడుదల ప్రక్రియలో సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది.

శరవేగంగా జరుగుతున్న గాజా పరిణామాలపట్ల అంతేవేగంగా ప్రతిస్పందించి నిర్ణయాలు తీసుకోవాలని, నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూను ట్రంప్ కోరారు. కేవలం ఇజ్రాయెల్ మాత్రమే కాదు, దీనికి సంబంధించిన అందరూ త్వర త్వరగా ముందుకు కదలాలి, ఆచరణాత్మక చర్యలకు పూనుకోవాలి అని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టింగ్‌లో పేర్కొన్నారు. సెప్టెంబరు 29వ తేదీన ట్రంప్, నెతన్యాహూ వాషింగ్టన్‌లో సమావేశమయ్యారు. ట్రంప్ 20 అంశాల ప్రణాళికను నెతన్యాహూ అంగీకరించారు. ఈ ప్రణాళికను అంగీకరించేందుకు ఆ మరునాడు 30వ తేదీన ట్రంప్ హమాస్‌కు నాలుగు రోజులు గడువు ఇచ్చారు. అక్టోబరు 3వ తేదీన ట్రంప్ ప్రణాళికకు హమాస్ అంగీకారం తెలియజేసింది. పూర్తిగా ఈ ప్రణాళికను అంగీకరించలేదు. మౌలిక అంశాలకు సమ్మతించింది. ఈ ప్రణాళికపై తదుపరి చర్చలు జరగాలని షరతు విధించింది. హమాస్ సత్వరం ముందుకు సాగాలని ఐదో తేదీన ట్రంప్ హెచ్చరించారు. ఆరోతేదీ సోమవారంనాడు ట్రంప్ మరోసారి ఈ సమస్యతో ముడిపడినవారం తా శరవేగంగా చర్యలు తీసుకోవాలని పిలుపు ఇచ్చారు. కైరోలో చర్చలు ఫలవంతమైతే బందీలు త్వరలో విడుదలవుతారని నెతన్యాహూ ఆశాభావం వ్యక్తం చేశారు.

**చర్చల్లో హమాస్‌కు ఖలీల్ హయ్యా నాయకత్వం**

ఇదిలా ఉండగా ఈజిప్టు రాజధాని కైరోలో సోమవారం మధ్యాహ్నం హమాస్, ఇజ్రాయెల్, అమెరికా ప్రతినిధుల సమక్షంలో ట్రంప్ ప్రతిపాదించిన 20 అంశాల శాంతి ప్రణాళికపై మధ్యవర్తుల చర్చలు ప్రారంభమయ్యాయి. అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ పరోక్ష చర్చలకు హమాస్ తరపున వారి నాయకుడు ఖలీల్ హయ్యా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతనెల దోహాలో ఖలీల్ హయ్యాను హత్య చేసేందుకే ఇజ్రాయెల్ సైన్యం బాంబుల వర్షం కురిపించడంతో నెతన్యాహూ తీవ్ర విమర్శలకు గురయ్యారు. ఏ నాయకుడినైతే ఇజ్రాయెల్ చంపాలనుకుందో ఆ నాయకుడే ఈజిప్టులో చర్చలకు ప్రాతినిధ్యం వహించడం నెతన్యాహూకు మింగుడు పడటంలేదు. ఖలీల్ హయ్యా సహా హమాస్ అగ్రనాయకత్వం ఎక్కడ ఉన్నా వెతికి వెతికి మరీ చంపుతామని నెతన్యాహూ ప్రతిజ్ఞ చేశారు. హమాస్ అగ్రనాయకుడు యాహ్యా సిమ్మర్‌ను 2024లో ఇజ్రాయెలీ సైనికులు హతమార్చారు. ఆయన దగ్గర ఖలీల్ హయ్యా డిప్యూటీగా పనిచేశారు. దోహాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఖలీల్ హయ్యా తప్పించుకున్నప్పటికీ ఆయన కుమారుడు హుమమ్ మాత్రం మరణించాడు. ఈ ప్రణాళికను పూర్తిగా సమ్మతించకపోయినప్పటికీ మౌలిక అంశాలను హమాస్ అంగీకరించడంతో ఇటు ఇజ్రాయెల్ బందీలు, అటు పాలస్తినా ఖైదీల విడుదలకు సంబంధించిన ప్రక్రియను సజావుగా పూర్తిచేసేందుకు ఈ చర్చలు జరుగుతున్నాయి.

## డిజిపికి ఐఎన్‌టియుసి ఉపాధ్యక్షుడు శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపి బి.శివధర్ రెడ్డికి ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. డిజిపి శివధర్ రెడ్డిని ఆయన నివాసంలో సోమవారం మొగుళ్ళ రాజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా డిజిపికి ఆయన దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## బడా రెక్కలు (మొదటి పేజీ తరువాయి)

వారీగా బంగారం ధరలు పరిశీలిస్తే... హైదరాబాద్‌లో 10 గ్రాముల (24 క్యారెట్స్) స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,26,674గా ఉంది. 10 గ్రాముల (22 క్యారెట్స్) బంగారం ధర రూ.1,16,117గా ఉంది. ముంబయిలో 10 గ్రాముల (24 క్యారెట్స్) స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,20,770గా ఉంది. 10గ్రాముల (22క్యారెట్స్) బంగారం ధర రూ.1,10,770గా ఉంది. కొనుగోలుదారులు జిఎస్‌టి, మేకింగ్ ఛార్జెస్ అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

**అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ రేట్లు**

ఇంటర్నేషనల్ మార్కెట్‌లో సోమవారం ఔన్స్ బంగారం ధర 3,900 డాలర్లు దాటింది. యుఎస్‌లో స్పాట్ గోల్డ్ ధర ఆల్‌టైమ్ రికార్డ్ హై 3,924.39 డాలర్లకు పెరిగి, తరువాత 3,922 డాలర్ల వద్ద స్థిరపడింది. మొత్తంగా చూసుకుంటే, గత కొన్ని నెలలో బంగారం ధర 50 శాతం మేర పెరిగింది. అంతేకాదు ఇకపై కూడా పసిడి ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఔన్స్ బంగారం ధర ప్రస్తుత స్థాయి నుంచి ఏకంగా 4,800 డాలర్లకు పెరిగే అవకాశం ఉందంటున్నారు. అంటే బంగారం ధర 26 శాతానికిపైగా పెరిగే ఛాన్స్ ఉందని బ్రోకరేజ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. కాగా, బంగారం ధరలు ప్రతిరోజు రికార్డు స్థాయిలో పెరుగుతుండడంతో సామాన్యులు బంగారం కొనేందుకు వెనుకాడుతున్నారని, ఫలితంగా క్రయవిక్రయాలు బాగా తగ్గున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. పసిడి రేట్లు పెరుగుతుండడంతో మహిళలు ఇతర ఆభరణాల వైపు మళ్లుతున్నారని వారు చెబుతున్నారు.

## జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక
(మొదటి పేజీ తరువాయి)

స్థానాలకు నవంబర్ 11న ఉప ఎన్నికలు జరుగనున్నాయి. జమ్ముకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా రెండో స్థానంలో పోటీ చేసి గెలిచిన తర్వాత రాజీనామా చేసిన బుద్గామ్, ఎమ్మెల్యే దేవేందర్ సింగ్ రాణా మరణంతో ఖాళీ అయిన నగ్రోటా స్థానాలకు బై ఎలక్షన్స్ జరుగనున్నాయి. మరోవైపు రాజస్థాన్‌లోని అంటా ఎమ్మెల్యే కన్వర్‌లాల్ మీనా దోషిగా తేలి అనర్హత వేటు పడటంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. జార్ఖండ్‌లోని ఘట్సిలా నియోజకవర్గం ఎమ్మెల్యే రాందాస్ సోరెన్, పంజాబ్‌లోని తర్న్ తరణ్ ఎమ్మెల్యే కశ్మీర్ సింగ్ సోహల్, మిజోరాంలోని డంపా నియోజకవర్గం ఎమ్మెల్యే లాల్రింట్లుంగా సైలా, ఒడిశాలోని నువాపాడ ఎమ్మెల్యే రాజేంద్ర ధోలాకియా మరణించిన నేపథ్యంలో ఆయా స్థానాలు ఖాళీ అయ్యాయి. దీంతో ఈ 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల కోసం ఇసి షెడ్యూల్ జారీ చేసింది.

## అభ్యర్థి ఖరారు
(మొదటి పేజీ తరువాయి)

ముగ్గురు ఇంచార్జి మంత్రులు ఇచ్చిన నివేదిక ఆధారంగా అభ్యర్థి ఎంపిక ఉంటుందని ఆయన వివరించారు. రెండు మూడు రోజుల్లో ఐసిసి తెలంగాణ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, ఇంచార్జి మంత్రులతో కలిసి జూబ్లీ హిల్స్‌లో బస్తీ బాట చేపడుతున్నానని మహేష్‌కుమార్ గౌడ్ ప్రకటించారు. ఈ ఉప ఎన్నికలో ఎంఐఎం మద్దతు తీసుకునే విషయం కూాడా పార్టీ దృష్టిలో ఉందని ఆయన వెల్లడించారు. కంటోన్‌మెంట్ ఉప ఎన్నిక మాదిరిగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కూడా కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా పాలనకు స్పష్టమైన తేడా ఉందన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ (మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో అధునాతన తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

**హైదరాబాద్ మాన్యుఫ్యాక్షరింగ్, క్వాలిటీ హబ్ తమకు అత్యంత కీలకం**

హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే మాన్యుఫ్యాక్షరింగ్, క్వాలిటీ హబ్ తమకు అత్యంత కీలకమైందని కంపెనీ ప్రకటించింది. ఇక్కడి నుంచే దేశంలో ఉన్న ఎలి లిల్లీ కాంట్రాక్ మాన్యుఫ్యాక్షరింగ్ నెట్‌వర్క్, సాంకేతిక పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, అధునాతన సాంకేతిక సామర్థ్యాలను అందించనుంది. కొత్త హబ్ ఏర్పాటుతో మన రాష్ట్రంతో పాటు దేశంలో ఫార్మా రంగంలో పనిచేస్తున్న వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీలైనంత తొందరలోనే కెమిస్టులు, అనలిటికల్ సైంటిస్టులు, క్వాలిటీ కంట్రోల్, మేనేజ్‌మెంట్ నిపుణులు, ఇంజనీర్ల నియామకాలు చేపట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అమెరికాకు చెందిన ఎలి లిల్లీ కంపెనీకి 150 ఏళ్లుగా ప్రపంచ వ్యాపంగా ఔషధాల తయారీ రంగంలో విశేషమైన వైద్య సేవలను అందిస్తున్నది. మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న ఈ అధునాతన యూనిట్ తెలంగాణను అత్యాధునిక ఆరోగ్య పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టనుంది.



ప్రధానంగా డయాబెటిస్, ఓబెసిటీ, అల్జీమర్, క్యాన్సర్, ఇమ్యూన్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పనిచేస్తుంది. ఇండియాలో ఇప్పటికే గురుగామ్, బెంగుళూరులో ఎలి లిల్లీ కంపెనీ కార్యకలాపాలున్నాయి. హైదరాబాద్‌లో ఈ ఏడాది ఆగస్ట్‌లోనే గ్లోబల్ కెపాబులిటీ సెంటర్‌ను ప్రారంభించిందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

**తెలంగాణకు ఇదొక గర్వ కారణం**

విస్తరణలో భాగంగా ఎలి లిల్లీ కంపెనీ భారీ పెట్టుబడులకు ముందుకు రావటం ఆనందంగా ఉందని, తెలంగాణకు ఇదొక గర్వ కారణమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచినందుకు కంపెనీ ప్రతినిధులను అభినందించారు. పెట్టుబడులతో వచ్చే కంపెనీలు, పరిశ్రమలకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా మద్ధతు ఇస్తుందని సిఎం స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే దేశంలోనే ఫార్మా హబ్‌గా పేరొందిందని, ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. 1961లో ఐడిపిఎల్ స్థాపించినప్పటి నుంచే హైదరాబాద్ దిగ్గజ ఫార్మా కంపెనీలకు చిరునామాగా మారిందని, ప్రస్తుతం 40 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని గుర్తు చేశారు. కోవిడ్ వ్యాక్సిన్లను ఇక్కడే తయారు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఫార్మా కంపెనీలను ప్రోత్సహించే ఫార్మా పాలసీని ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఎటిసి సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జీనోమ్ వ్యాలీకి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో ఎలి లిల్లీ కంపెనీ విస్తరణ తెలంగాణలో పరిశ్రమల విస్తరణ తీరును ప్రతిబింబిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిభావంతులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుస్తుందని అన్నారు. ఎలి లిల్లీ విస్తరణ ఫార్మా రంగానికి కొత్త ఉత్తేజం అందిస్తుందని, ఇప్పటికే లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ వేగవంతమైన వృద్ధి సాధిస్తోందని అన్నారు.

కె.శశాంక తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న పారదర్శక, వ్యాపార స్నేహపూర్వక విధానాల ఫలితంగానే సాధ్యమైందని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి,రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు నాయకత్వంలో 'తెలంగాణ రైజింగ్2047'దిశగా ముందుకెళ్తుందని తెలిపారు.

## ఎకరం రూ.177 కోట్లు (మొదటి పేజీ తరువాయి)

**చదరపు గజం భూమి రూ.1.14 లక్షలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:**హైదరాబాద్ శివారులోని చింతల్‌లో నివాస భూముల ప్లాట్ల విక్రయాల్లో హౌసింగ్ బోర్డ్‌కు రికార్డ్ స్థాయి ధరలకు విక్రయించింది. చదరపు గజం భూమిని రూ. 1.14 లక్షలకు విక్రయించింది. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో నివాస భూముల విక్రయాలకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో చదరపు గజం భూమి ధర రూ.1,14,000లు పలికింది. 513 గజాల విస్తీర్ణంలోని హెచ్ ఐజి ఓపెన్ ప్లాట్ కు ఆఫ్‌సెట్ ప్రైజ్‌గా రూ.80 వేలు నిర్ధారించగా, బహిరంగ వేలంలో చదరపు గజం రూ.1.14 లక్షలకు కొనుగోలు చేసినట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి.గౌతం వెల్లడించారు.

హెచ్‌ఐజిలోనే మరో 389 చదరపు గజాల విస్తీర్ణంలోని ఓపెన్ ప్లాట్ ను చదరపు గజానికి లక్ష రూపాయల ధర పలికిందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 18 ఓపెన్ ప్లాట్లు, నాలుగు ఫ్లాట్ల విక్రయానికి బహిరంగ వేలం వేయగా, హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.44.24 కోట్ల మేర ఆదా యం వచ్చింది. 27 మంది బిడ్డర్లు పాల్గొన్న ఈ వేలం పాటలో చదరపు గజానికి సగటున రూ.91,947 ధరకు కొనుగోలు చేశారని హౌజింగ్ వైస్ ఛైర్మన్ గౌతం తెలిపారు.

కెబిహెచ్ బి,గచ్చిబౌలి పరిసరాల్లోని భూములకే అధిక ధరలు పలుకుతున్న నేపథ్యంలో చింతల్ ప్రాంతంలో కూడా చదరపు గజం ధర లక్ష రూపాయలు దాటింది. అన్ని ప్రాంతాల్లోని నివాస భూములకు మంచి డిమాండ్ ఉందనేందుకు ఇదొక నిదర్శనమని గౌతం తెలిపారు.

85 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 10న తొలి విడత నోటిఫికేషన్, 13న రెండో విడత నోటిఫికేషన్ వెలువడుతుందని చెప్పారు. 7 రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 11న ఉపఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించింది. 'బిహా ర్ ఎన్నికలు రెండు విడతల్లో జరుగుతాయి. తొలి దశ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ ఈ నెల 10న, రెండో దశ ఎన్నికల నోటిఫికేషన్ 13వ తేదీన రానుంది. తొలిదశ ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీ 17 కాగా, రెండో దశ ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీ ఈ నెల 20. నామినేషన్ల పరిశీలన 18, 21 తేదీల్లో జరుగుతా యి.

నామినేషన్ల ఉపసంహరణకు తొలి విడతకు చివరి తేదీ 20 అక్టోబర్, రెండో విడతకు 23 అక్టోబర్. తొలి విడత ఎన్నికలు నవంబర్ 6న గురువారం జరగనుండగా, రెండో విడత నవంబ ర్ 11న జరుగుతాయి. కౌంటింగ్ నవంబర్ 14న ఉం టుంది. మొత్తం ఎన్నికల

## బిహార్ ఎన్నికలు (మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియ నవంబర్ 16 వరకు ముగుస్తుంది' అని కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ తెలిపారు. బిహార్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలు ఉన్నాయి. అందులో ఎస్‌డి రిజర్వ్‌డ్ సీట్లు 38, ఎస్‌టి రిజర్వ్‌డ్ సీట్లు 2 ఉన్నాయి. బిహార్‌లో 7.42 కోట్ల మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. పురుష ఓటర్లు 3.92 కోట్లు, మహిళా ఓటర్లు 3.50 కోట్లు ఉన్నారు. బిహార్ అసెంబ్లీ గడువు నవంబర్ 22లోపు ముగియనుంది. ఆ లోపే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నట్టు ఇసి ఇంతకుముందు తెలిపింది.

ఎస్ఐఆర్‌తో ఓటర్ల జాబితా 'శుద్ధీకరణ' జరిగిందని పేర్కొంది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతను సమీక్షించేందుకు ఇప్పటికే సిఇసి బృందం రెండు రోజుల పాటు బిహార్‌లో పర్యటించింది. ప్రస్తుతం బిహార్‌లో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలో ఉంది. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం లభించకపోవడంతో జెడియు, బిజెపి కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. నీతీశ్‌కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. కానీ, రెండేళ్లకే నీతీశ్ ఎన్‌డిఎను వీడి ఆర్‌జెడి, కాంగ్రెస్‌తో కూడిన మహాఘట్‌బంధన్‌లో చేరి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఈ బంధం కూడా ఎంతోకాలం నిలవలేదు.

2024 జనవరిలో మహా కూటమిని వీడిన జెడియు మళ్లీ ఎనడిఎతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో మరోసారి నీతీశ్ సిఎంగా బాధ్యతలు చేపట్టారు.

అయితే, ఈ సారి ఎన్నికల్లో ఎన్‌డిఎ, ఇండియా కూటమల మధ్యే ప్రధానంగా పోటీ ఉండనుంది. బిహార్‌లోని అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రకటించింది.

## రైతుల ఆమోదంతోనే భూములు సేకరించాలి

### జాన్‌వెస్లీ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)భూసేకరణకు సంబంధించి గ్రామసభలను నిర్వహించి రైతుల ఆమోదంతోనే భూములను సేకరించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. బలవంతంగా భూములను లాక్కుంటే ప్రతిఘటిస్తామని, ముఖ్యమంత్రి ఇంటిని సైతం ముట్టడిస్తామని హెచ్చరించారు. సోమవా రం హైదరాబాద్‌లోని హెచ్‌ఎండిఎ కార్యాలయం వద్ద సిపిఐ (ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాజకీయ నాయకులు, వ్యాపారులు, ధనికులు భూమి కోల్పోకుండా చిన్న రైతులు, పేదల భూములను మాత్రమే తీసుకునేలా అలైన్‌మెంట్ మారుస్తున్నారని విమర్శించారు. 2013 చట్టం ప్రకారం మార్కెట్ ధరకు నాలుగు రెట్లు పరిహారం ఇవ్వాల్సి ఉన్నా అమలు చేయడం లేదని చెప్పారు. ఎకరాకు రూ 5 కోట్లు, రూ.10 కోట్లు ఉంటే ప్రభుత్వం రూ.10 లక్షలు, రూ.15 లక్షలు, రూ.20లక్షలు పరిహారం ఇవ్వడం సరికాదన్నారు. రైతుల ఆమోదం లేకుండా సెంటు భూమి తీసుకున్నా సహించేది లేదన్నారు. దీంతో హెచ్‌ఎండిఎ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి స్పందిస్తూఆర్‌ఆర్‌ఆర్‌కు సంబంధించి భూసేకరణ వరకు ఇంకా వెళ్లలేదని, గ్రామసభలను నిర్వహించి, రైతుల అభిప్రాయంతోనే భూములను సేకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్, ఎండి జహంగీర్,రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, సిద్ధిపేట జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్రాములు, సీనియర్ నాయకులు డిజి నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## భూముల లెక్కలు తీయండి (మొదటి పేజీ తరువాయి)

అటవీ భూమి కేటాయించేందుకు ప్రతిపాదించారని,ఈ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కేశవపురం తాగునీటి పథకం కోసం రెవెన్యూ శాఖ గతంలో అటవీశాఖకు 1030 ఎకరాల భూమిని కేటాయించిందని, ఈ ప్రాజెక్ట్ రద్దయినందున సదరు భూమిని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు బదలాయింపునకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, అటవీ శాఖ, హైదరాబాద్ మెట్రోవాటర్ బోర్డ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మార్వాడి గో బ్యాక్ జెఎసి చైర్మన్‌గా పిడమర్తి రవి

ప్రజాపక్షం/హైదరాబాద్: 'మార్వాడి గో బ్యాక్' జెఎసి చైర్మన్‌గా డాక్టర్ పిడమర్తి రవి ఎన్నికయ్యారు. కో చైర్మన్ కరాటే శ్రీహరి,రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బోరెల్లి సురేష్‌ను ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో సోమవారం 'మార్వాడి గోబ్యాక్' జెఎసి కమిటీ సమవేశం జరిగింది. ఈ సందర్భంగా 11సంఘాల నాయకులు జెఎసి కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. జెఎసి కమిటీ ఇదే: ఛైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, కో చైర్మన్: కరాటే శ్రీహరి, కోఆర్డినేటర్లు డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బోరెల్లి సురేష్, ఉపాధ్యక్షులు అందే కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్ సన్నీ, పి.రాములు నేత, డాక్టర్ మీసాల మల్లేష్

**వైస్ చైర్మన్:** గజ్జల మల్లికార్జున్, మాదుగుల నరసింహ, గుర్రం కోటేష్, కార్యదర్శి మాదుగుల శివ, నక్క రమేష్ , జోగు గణేష్ , శ్రీనివాస్ గౌడ్, సూర్యారావు, యువజన అధ్యక్షులు నక్క మహేష్, మహిళ అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి, మహిళ కన్వీనర్ వరలక్ష్మి తో పాటు జిల్లాలకు అధ్యక్షులు నియమితులయ్యారు.

## పత్తి కొనుగోళ్లపై తొలగిన ప్రతిష్ఠంభన

సిసిఐ అధికారులు, జిన్నింగ్ మిల్లర్లతో మంత్రి తుమ్మల సమావేశం

వారం రోజుల్లో కొనుగోళ్లు ప్రారంభం



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎట్టకేలకు పత్తి కొనుగోళ్లకు సంబంధించి ప్రతిష్టంభన తొలగింది. వారం రోజుల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తామని సిసిఐ అధికారులు జిన్నింగ్ మిల్లర్ల ప్రతినిధులు ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం సిసిఐఅధికారులు, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు, జిన్నింగ్ మిల్లర్లతో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సిసిఐ విడుదల చేసిన టెండర్ లో లింట్ శాతం ఎల్1, ఎల్2 అలాట్మెంట్ స్లాట్ బుకింగ్ ఏరియా మ్యాపింగ్ నియమ నిబంధనలు జిన్నింగ్ మిల్లర్ల అభ్యంతరాలను అధికారులతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పత్తి రైతులకు ఇబ్బంది కల్గకుండ వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సిసిఐ అధికారులను జిన్నింగ్ మిల్లర్స్‌ను ఆదేశించారు. అదే సమయంలో జిన్నింగ్ మిల్లర్లు నష్టపోకుండా సిసిఐఅధికారులు కూడా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిసిఐ ప్రతి వారం పత్తి కొనుగోళ్లను సమీక్షించుకుని కొనుగోళ్లు సవ్యంగా జరిగేటట్లు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల హితాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లర్లు వెంటనే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని సిసిఐ కొనుగోళ్ల ప్రక్రియ కోసం వెంటనే తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రైతు ప్రయోజనాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఎంత దూరమైనా వెళుతుందని మంత్రి స్పష్టం చేశారు. దీంతో కొనుగోళ్లకు సంబంధించి అన్ని ప్రక్రియలు వెంటనే పూర్తి చేసి రానున్న వారం రోజుల్లో రైతుల నుంచి పత్తి సేకరిస్తామని సిసిఐ, జిన్నింగ్ మిల్లర్లు మంత్రికి తెలిపారు. అంతలోపు వ్యవసాయ శాఖ అధికారులు మొబైల్ యాప్, స్లాట్ బుకింగ్ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ సిసిఐతో సమన్వయం చేసుకుంటూ రైతులకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టోల్ ఫ్రీ నంబర్ గూర్చి కూడా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఇప్పటికే మండలాల వారీగా రైతు వేదికల ద్వారా ఈ యాప్, స్లాట్ బుకింగ్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు మంత్రి వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి, సిసిఐ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ లలిత్ కుమార్ గుప్తా , టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ (ఫైబర్) పూర్ణేష్ గురునాని, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మి భాయి, రాష్ట్రంలోని సిసిఐ బ్రాంచ్ మేనేజర్లు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఉన్నత అధికారులు, రాష్ట్ర కాటన్ జిన్నింగ్ మిల్లుల సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# సిజెఐపై దాడి హేయమైన చర్య





అత్యంత దిగ్భ్రాంతికరం : కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై నిండు కోర్టులో ఒక న్యాయవాది దాడికి పాల్పడడం హేయమైన చర్య అని, ఇది అత్యంత దిగ్భ్రాంతికరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇది కేవలం గవాయ్‌పై జరిగిన దాడి మాత్రం కాదని, భారత సర్వోన్నత న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా భావించాలని ఆయన వ్యాఖ్యానించారు. సనాతన ధర్మం పేరిట ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరివేసే ప్రయత్నం న్యాయవ్యవస్థ తమకు అనుకూలంగా వ్యవహరించాలనే బెదిరింపు ధోరణి, అరాచకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. కేవలం న్యాయవాది చేసిన దాడిగానే చూడవద్దని గత కొన్నేళ్లగా దేశంలో మత, మితవాద శక్తుల ఆధిపత్య వైఖరి చివరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి దారి తీయడం ప్రజాస్వామ్య విలువల పతనానికి పరాకాష్ట అని అన్నారు. ఈ దాడిపై లోతుగా విచారించి కఠిన చర్యలు తీసుకొని న్యాయవ్యవస్థ స్వతంత్రతను, దేశ లౌకిక, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవశ్యకత ఉందన్నారు.

**దాడికి ఐఎఎల్ ఖండన**

భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గవాయ్‌పై రాకేష్ కిషోర్ అనే న్యాయవాది కోర్టు హాలులోనే దాడికి ప్రయత్నించడాన్ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఇది భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై దాడి అని ఆయన పేర్కొన్నారు. న్యాయమూర్తుల మనో స్థైర్యాన్ని దెబ్బతీయటం ద్వారా తీర్పులను ప్రభావితం చేయాలని అనుకోవడం అత్యంత ప్రమాదకరం అని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఘటనలకు దేశంలో వాతావరణం ప్రేరేపించబడడం ఆందోళన కరమన్నారు. న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని, స్వతంత్రతను పరిరక్షించేందుకు ప్రభుత్వం, అన్ని రాజకీయ పార్టీలు, న్యాయవాదులు, పౌరులు తమ వంతు అని కర్తవ్యంగా నిలబడాల్సిన అవశ్యకతను ఈ ఘటన సూచిస్తున్నది ప్రభాకర్ పేర్కొన్నారు.

**ప్రణాళిక ప్రకారమే దాడి : నారాయణ**

సుప్రీంకోర్టు ప్రాంగణంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టి బిఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి యత్నించిన సంఘటనను సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందని కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడటానికి, ద్వేషం, బెదిరింపుల రాజకీయాలను ఎదుర్కోవడానికి, సామ్యవాది, ప్రజాస్వామ్య శక్తులందరూ ఐక్యంగా ముందుకు రావాలి అని సిపిఐ పిలుపునిస్తోందన్నారు. ఈ ఘటన ఒక వ్యక్తి తప్పుడు ప్రవర్తన మాత్రమే కాదు, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు చెందిన కుడిపక్ష శక్తులు పెంచిపోషిస్తున్న అసహన సంస్కృతికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలను అవమానపరచడం, న్యాయవ్యవస్థను బెదిరించడం లక్ష్యంగా చేసిన పూర్వ ప్రణాళికతో కూడిన దాడి ప్రయత్నం ఇదని నారాయణ పేర్కొన్నారు. సిపిఐ అభిప్రాయం ప్రకారం, న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యానికి ఒక స్వతంత్ర స్తంభం. న్యాయమూర్తులపై దాడి చేయడం అంటే రాజ్యాంగంపై దాడి చేయడమేనన్నారు. ప్రజాస్వామ్య శక్తులందరూ న్యాయవ్యవస్థ గౌరవం, స్వతంత్రతను కాపాడాల్సిన బాధ్యత అని అన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని, దీని వెనుక ఉన్న ఉద్దేశ్యం, సంస్థాగత ప్రోత్సాహం వెలికి తీయాలని నారాయణ డిమాండ్ చేశారు. బాధ్యులపై క్రిమినల్, కాంటెంప్ట్ చట్టాల కింద కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

**నేడు నిరసనలకు డిహెచ్‌పిఎస్ పిలుపు**

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాదుల దాడి గర్హనీయమని, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. ఇది రాజ్యాంగంపై, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. సిజెఐ జస్టిస్ గవాయ్‌పై ఆర్ఎస్ఎస్ ముసుగులో ఉన్న రాచక న్యాయవాది చేసిన భౌతిక దాడిని నిరసిస్తూ నేడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ ఘటన భారత రాజ్యాంగాన్ని కాపాడే ప్రతి పౌరుడి మనసును కలచివేస్తున్న పరిణామం మన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై ఆర్ఎస్ఎస్ ముసుగులో ఉన్న అరాచక న్యాయవాది రాకేష్ కిషోర్ పథకం ప్రకారం చేసిన ఈ దాడిని ఆర్ఎస్ఎస్ డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సమితి దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ దాడికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

**దాడి దిగ్భ్రాంతికరం : సిపిఐ(ఎం)**

భారత న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై న్యాయవాది కిషోర్ దాస్ దాడి చేయడాన్ని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దాడికి పాల్పడిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. రాజ్యాంగ పరిధిలో రాజ్యాంగానికి అనుగుణంగా న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులు తీర్పులిస్తారని, కానీ మనువాద, మతోన్మాద, ఆధిపత్య ధోరణులకు, సనాతన ధర్మానికి, ఇతర మతాలకు అనుకూలమైన రీతిలో తీర్పులుండాలనే రెచ్చగొట్టే వైఖరి సరైందికాదని పేర్కొంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అనుసరిస్తున్న వైఖరి వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపింది. కుల, మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నీ, సామాజిక న్యాయం కోరే, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడే శక్తులన్నీ ఐక్యంగా నిలబడి పోరాడాల్సిన అవసరం ఉందని, రాష్ట్ర ప్రజలు కూడా ఇలాంటి దాడులను సంఘటితంగా వ్యతిరేకించాలని సిపిఐ(ఎం) విజ్ఞప్తి చేసింది.

## బిసి రిజర్వేషన్ పిటిషన్‌పై 'సుప్రీం' నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

42 శాతం కోటా అమలుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని

రాష్ట్ర మంత్రులు విజ్ఞప్తి







ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలును ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టి వేయడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ స్వాగతించాయి. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బిసిలకు రిజర్వేషన్లు ఇచ్చే విశయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తుందని కాంగ్రెస్ తెలిపింది. బిసిలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం అన్ని వర్గాలు, అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని కాంగ్రెస్ కోరింది. ఈ మేరకు రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, ఎంపి డాక్టర్ మల్లు రవి, మాజీ ఎంపి వి.హనుమంతరావు సోమవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని భట్టి ఢిల్లీలో మీడియాతో చెప్పారు. బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వ జిఓపై కొందరు సుప్రీంకోర్టులో కేసు వేశారని, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వేసిన కేసును కోర్టు డిస్మిస్ చేసినందుకు సంతోషిస్తున్నామన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని డిప్యూటి సిఎం స్పష్టం చేశారు.

ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జిఓ ఇచ్చి బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేసిందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌లు బిసి రిజర్వేషన్ల అమలు కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. బిసిలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం అన్ని వర్గాలు, అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 8వ తేదీన హైకోర్టులో కూడా బిసి రిజర్వేషన్ల అంశంలో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు.

**అన్ని రకాల రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం: మంత్రి పొన్నం**

తెలంగాణలో బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ అంశంలో అసెంబ్లీలో చట్టబద్ధంగా ఆమోదించుకుని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. తెలంగాణలో బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిందన్నారు. 'వాస్తవంగా బిజెపి అన్ని రకాల రిజర్వేషన్లకు వ్యతిరేకం. బిసి రిజర్వేషన్లపై చట్టసవరణ బిల్లు, ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటున్నదే బిజెపి నేతలు. రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో బిజెపి నేతలు ఆమోదించి ఇప్పుడు మాట మారుస్తున్నారు. ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లులను ఆమోదింపచేయాలి. బిజెపి ప్యూడలిస్టు పార్టీ. ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకం. గతంలో రామచందర్‌రావు హెచ్‌సియులో ఎస్‌సిలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. శాసనసభలో మద్దతు ఇచ్చిన బిజెపి, బిఆర్ఎస్ నేతలు న్యాయ ప్రక్రియలోనూ సహకరించాలి' అని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.


బిసి రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు పిటిషన్‌లో తాను ఇంప్లీడ్ అయినట్లు మాజీ ఎంపి వి. హనుమంత రావు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. రిజర్వేషన్లను అడ్డుకుని బిసిల పొట్ట కొట్టొద్దని హనుమంతరావు విజ్ఞపి చేశారు.

## పోలీసుల అదుపులో మల్లోజుల ఉన్నాడా..?

మల్లోజుల మరో లేఖ

లేఖలపై భిన్నాభిప్రాయాలు





ప్రజాపక్షం/ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల అంతం చూస్తామంటూ చేస్తున్న ప్రకటనలు ఒక పక్క మరో పక్క మావోయిస్టు పార్టీలో అంతర్గత భిన్నాభిప్రాయాలు బహిర్గతం కావడం ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. అన్నింటికి మించి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అత్యంత కీలకంగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్ వరుస లేఖలు అటు పార్టీలోనూ, ఇటు రాజకీయ, పోలీస్ వర్గాల్లోనూ చర్చనీయాంశమవుతున్నాయి. మల్లోజుల వేణుగోపాల్ పోలీసుల అదుపులో ఉన్నాడని పోలీసుల సూచన మేరకే ఇటువంటి లేఖలను విడుదల చేస్తున్నారని మావోయిస్టు పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి. ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నప్పుడే ఆయుధాలతో లొంగిపోవాలని మావోయిస్టు పార్టీ నిర్ణయించిందన్న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను ప్రకటన వెనక పోలీసులు ఉన్నారని అభిప్రాయపడుతున్నారు. ఇటీవల లొంగిపోయిన మల్లోజుల కోటేశ్వరరావు సతీమణి సుజాత ఎక్కడున్నారు. అనే దానిపైన పార్టీలో చర్చ సాగుతుంది. హైదరాబాద్‌లో పోలీసుల ఎదుట లొంగిపోయిన సుజాత ఆచూకీ ఆ తర్వాత కనిపించడం లేదు. ఒకవేళ అనారోగ్యానికి గురై వైద్య సాయం పొందుతున్నారా అనేది కూడా చర్చనీయాంశమైంది. మొత్తంగా మరో లేఖ విడుదల చేసిన మల్లోజుల పార్టీని విడుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీలో కొనసాగ లేనని పార్టీ ప్రస్తుత పద్ధతుల్లో పోరాడి మరింత ఉద్యమ నష్టాన్ని చవి చూసేలా వ్యవహరించలేనని వేణుగోపాల్ తన 22 పేజీల లేఖలో పేర్కొన్నాడు. పార్టీ చేసిన కొన్ని తప్పుల వల్ల ఉద్యమం తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని ఉద్యమాన్ని కాపాడలేకపోయినందుకు లేఖ ద్వారా క్షమాపణలు కోరారు. పార్టీ క్యాడర్‌ను కాపాడుకోలేని అనవసర త్యాగాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని సూచించారు. ఇప్పటి వరకు మావోయిస్టు పార్టీ కొనసాగించిన పంథా పూర్తిగా తప్పిదమేనని ఆ తప్పిదం నుంచి గుణపాఠం నేర్చుకోవడం టీకా లాంటిదని మల్లోజుల క్యాడర్‌కు సూచించారు. వర్తమాన ఫాసిస్టు పద్ధతుల్లో మన లక్ష్యాన్ని నెరవేర్చలేమని సరైన సమయంలో క్యాడర్ సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. పార్టీలో అంతర్గతంగా చర్చించిన తర్వాతే ఆయుధాలు విడాలని నిర్ణయించినట్లు మల్లోజుల లేఖలో తెలిపారు. ఈ లేఖకు సంబంధించి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక పక్క మార్చి చివరి నాటికి ఈ దేశంలో మావోయిస్టు కదలికలు లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించిన నేపథ్యంలో పోలీసులు ఒక పక్క యుద్ధ తంత్రాన్ని కొనసాగిస్తూనే మరో పక్క వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఉద్యమాభిమానులను మావోయిస్టు పార్టీ క్యాడర్‌ను నిరాశ, నిస్పృహలకు గురి చేసి తద్వారా దారి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. గతంలో మావోయిస్టు పార్టీ నాయకత్వం ఎదురుపడినప్పుడు ఎన్‌కౌంటర్ల పేరుతో హతమార్చేవారు కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా వారి నుంచి సమాచారాన్ని రాబట్టి తదనుగుణంగా చర్యలు చేపడుతున్నారు. మావోయిస్టు పార్టీలో అనేక మందిని తమ కోవర్టులుగా మార్చుకోవడంలో సఫలీకృతం కావడం వల్ల మావోయిస్టులు భారీగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మల్లోజుల లేఖ మొత్తంగా మావోయిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మల్లోజుల వేణుగోపాల్‌కు కౌంటర్ ఇచ్చిన సత్యనారాయణ రెడ్డి, రాంచంద్రారెడ్డి ఆ తర్వాత ఎన్‌కౌంటర్‌లో మరణించిన విషయం విధితమే. విటన్నింటి పూర్వ పరాల్లో మావోయిస్టుల ఎత్తుగడల కంటే పోలీసులు చాలా ముందున్నారని అవగతమవుతుంది. పోలీసుల త్రిముఖ వ్యూహంలో చిక్కుకని ప్రస్తుతానికి మావోయిస్టు పార్టీ విలవిలలాడుతుంది. నిన్న మొన్నటి వరకు పోలీసులు మావోయిస్టులను భౌతికంగా మాత్రమే ఇబ్బందిపెట్టారు. ఇప్పుడు అంతర్గతంగా కూడా ఇబ్బందులు పెట్టే ప్రయత్నంలో కొంత మేర సఫలీకృతులైనట్లు ప్రస్తుత పరిస్థితులను బట్టి అవగతమవుతుంది.

# పట్టణాల విస్తీర్ణంలో హైదరాబాద్

నారెడ్కో అధ్యక్షుడు విజయసాయి...

నారెడ్కో బిగ్ ప్రాపర్టీ షో..

10 నుంచి 12 వరకు హైటెక్స్‌లో




ప్రజాపక్షం/హైదరాబాద్: పట్టణాలు విస్తరించడంలో ముంబాయి నగరం కంటే హైదరాబాద్ ముందుందని తెలంగాణ నారెడ్కో అధ్యక్షులు విజయసాయి మేక తెలిపారు. హైదరాబాద్ నగరం 1,26,915 ఎకరాలకు విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయసాయి మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు సైతం అందుబాటులో ఉండే విధంగా రియల్‌ఎస్టేట్ రంగాన్ని తీర్చిదిద్దుతున్నామని ఇందులో భాగంగా హైటెక్స్‌లో ఈ నెల 10 నుంచి 12 వరకు మూడు రోజుల పాటు 15వ 'నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో2025' నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ప్రాపర్టీ షోలో మొత్తం 95 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో 74 స్టాల్స్ డెవలపర్స్, బిల్డర్స్‌వికాగా 6 స్టాల్స్ వివిధ బ్యాంక్‌లకు చెందినవి, మరో ఐదు స్టాల్స్ మెటీరియల్ సప్లై చేసే వారివి, రెండు స్టాల్స్ టూరిజం సంస్థకు చెందినవి, ఇతర విభాగాలకు చెందినవి మరో ఎనిమిది స్టాల్స్ ఉన్నాయని విజయసాయి తెలిపారు. భారతదేశంలో అత్యంత డైనమిక్, వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఒకటిగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారమని ఆయన తెలిపారు. ఈ ప్రాపర్టీ షోలో బిల్డర్లు, ప్రమోటర్లు ఉంటారని, కొనుగోలు దారులు, విక్రేతలు పరస్పరం సంభాషించుకోవడానికి విస్తృత ఏర్పాటు చేశామన్నారు. మధ్య తరగతి ప్రజలకు ధరలు అందుబాటులో ఉండేందుకు రూ.40 లక్షల నుంచి రూ.కోట్లకుపైగా విలువైన ఫ్లాట్స్, ఇండ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇల్లు, ఫ్లాట్స్ ఖరీదు చేయాలని ఆసక్తి కలిగిన వినియోగదారులు ఈ ప్రాపర్టీ షోను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ ఎప్పటికప్పుడు మౌళిక సదుపాయాలతో పాటు పట్టణం అభివృద్ధి చెందుతుందని, త్వరలో ఆర్ఆర్ఆర్ రోడ్డు కూడా ఏర్పాటు అవుతుందని దీంతో హైదరాబాద్ రూపురేఖలు మారబోతున్నాయన్నారు. హైదరాబాద్ దేశ స్థాయిలోనే కాక ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగిందన్నారు. ఇలాంటి తరుణంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులందర్ని ఒక్కతాటిపైకి తీసుకువచ్చి నారెడ్కో ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నామన్నారు. ఈ షోకు హాజరైతే హైదరాబాద్ చుట్టుపక్కల కొత్తగా తాము నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల వివరాలు సులభంగా ఒకే చోట లభ్యమవుతాయని నార్కెడ్కో జనరల్ సెక్రటరీ కె.శ్రీధర్‌రెడ్డి తెలిపారు.హైదరాబాద్ చుట్టుపక్కల తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తుందన్నారు. ప్రాపర్టీ షోకు ఉచిత ప్రవేశం కల్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో నారెడ్కో ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కాలి ప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు నారెడ్కో ప్రతినిధులు పాల్గొన్నారు.

## రూ.180 కోట్ల పాఠశాలల బకాయిలను విడుదల చేయాలి

ఎఐఎస్ఎఫ్ డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివే 25వేలకు పైగా విద్యార్థులకు సంబంధించిన రూ.180 కోట్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం గత రెండేళ్లుగా బకాయిలను విడుదల చేయకపోవడంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు పాఠశాలలకు రావద్దంటూ వారికి లెటర్లు రాశారన్నారు. దీంతో 25వేలకు పైగా ఎస్‌సి, ఎస్‌టి,విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండ ఇంటి వద్దే ఉండే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందాల పోటీలకు, పక్క రాష్ట్రాల్లో ప్రకటనలకు ఉన్న నిధులు పేద విద్యార్థుల చదువులకు లేవా అని వారు ప్రశ్నించారు. రాష్ట్రంలో 238 బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఉన్నాయని, వాటిలో సుమారు 7వేల మంది ఎస్‌టి, 23 వేల మంది ఎస్‌సి విద్యార్థులు చదువుకుంటున్నారు. డే స్కాలర్స్ స్టూడెంట్స్‌కి ఏటా రూ.28 వేలు, రెసిడెన్షియల్ విద్యార్థులకు రూ.42 వేల చొప్పున ఆయా స్కూల్స్‌కు ఫీజులు చెల్లిస్తున్న ప్రభుత్వం 2023–24నుంచి చెల్లించపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రూ.180 కోట్ల బకాయిలు పేరుకు పోయినట్లు ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్య కమిటీ వెల్లడించాయన్నారు. దీంతో ఫీజులు చెల్లించేంతవరకు విద్యార్థులు పాఠశాలలకు పంపించ రాదంటూ అన్ని స్కూల్స్ తరపున ఒకేసారి పేరెంట్స్‌కి లెటర్స్ పంపించాయని దీంతో పేద విద్యార్థులు వారి తల్లితండ్రులు అయోమయానికి గురి అవుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖ పెట్టుకొని కనీసం విద్యార్థుల ఫీజులు కూడా చెల్లించలేకపోవడం దుర్మార్గమన్నారు. పేద విద్యార్థుల చదువులతో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు మొత్తం విడుదల చేయాలని మణికంఠ రెడ్డి ,పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

**శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి నిత్యాన్నదాన చారిటబుల్ ట్రస్టు, ధర్మపురి**
(శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానము, ధర్మపురి,జగిత్యాల జిల్లా.)

**నిత్యాన్నదాన కార్యక్రమము**

భక్తులతో మనవి చేయునది ఏమనగా! "అన్ని దానములలో కెల్ల అన్నదానము మిన్న" శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానములో భక్తులు, శాశ్వత సభ్యుల విరాళాలతో సోమ, బుధ, గురు, శుక్రవారములలో 300 మందికి, శని, ఆది, మంగళవారము రోజులలో 500 మందికి ఉచిత అన్నదానము జరుగుచున్నది. ఇంకను ప్రతిరోజు 1000 మందికి అన్నదానము చేయుటకు సంకల్పం గలదు. ఇందుకు విరివిగా విరాళములు అవసరమైయున్నవి.

-: నిత్యాన్నదానము శాశ్వతనిధి వివరములు :-

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రత్యేక దాతలు | (సం॥రమునకు ఒక రోజు 25 మందికి అన్నదానము) | రూ. 1,00,000/-లు ఆ పైన |
| 2. | మహారాజ పోషకులు | (సం॥రమునకు ఒక రోజు 15 మందికి అన్నదానము) | రూ. 50,116/- |
| 3. | రాజ పోషకులు | (సం॥రమునకు ఒక రోజు 8 మందికి అన్నదానము) | రూ. 25,116/- |
| 4. | ప్రత్యేక సభ్యులు | (సం॥రమునకు ఒక రోజు నలుగురికి అన్నదానము) | రూ. 10,116/- |
| 5. | పోషకులు | (సం॥రమునకు ఒక రోజు ఇద్దరికి అన్నదానము) | రూ. 5,116/- |
| 6. | సాధారణ సభ్యులు | | రూ. 1,116/- |

పైన తెల్పిన శాశ్వత విరాళములు కాకుండా తాత్కలికముగా విరాళములు రూ.101/- నుండి ఎంతైన చెల్లించవచ్చును.
కావున దయతలచి భక్తులు ఇట్టి పవిత్ర క్షేత్రములో జరుగు నిత్యాన్నదాన కార్యక్రమములో తమరు భాగస్వాములై శ్రీస్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నాము. నేరుగా చెల్లించలేని వారు డి.డి./యమ్.ఓ. ద్వారా గాని శ్రీయుత కార్యనిర్వహణాధికారి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము ధర్మపురి గారి పేరున ఎస్.బి.ఐ., యూనియన్ బ్యాంక్, ధర్మపురి బ్రాంచిలో చెల్లుబాటు అగునట్లు పంపించగలరు.

నిత్యాన్నదానమునకు విరాళములు సమర్పించు దాతలకు ఆదాయపు పన్ను 80 (జి) మినహాయింపు కలదు.
కుజదోషం కలవారు ధర్మపురి క్షేత్రములో శ్రీస్వామి వారికి అభిషేకము, నృసింహహోమం, కళ్యాణం జరిపించుకొన్నచో దోషం తొలగిపోవును,
రూ.1000/- శ్రీస్వామి వారి కళ్యాణం రూ.1000/- శ్రీస్వామి వారి నృసింహహోమము

అధ్యక్షులు & ధర్మకర్తల మండలి | అర్చకులు & సిబ్బంది | సహాయ కమీషనర్ & కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 8849-PP/CL/ADVT/1/2025-26, Date: 06-10-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: హైదరాబాద్** GHMC
డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, జిహెచ్ఎంసి, హైదరాబాద్.

జిహెచ్ఎంసిలోని యుబిడి, చార్మినార్ జోన్, సర్కిల్-11 లోని ఆరాంఘర్ నుండి మీర్-ఆలం ట్యాంక్ వెళ్ళే ఫ్లైఓవర్ కింద (పిల్లర్ నం. P3 నుండి P5 వరకు) 2 స్పాన్ల థీమాటిక్ శిల్పాలు సెకండరీ కలెక్షన్ అందిరిచడానికి రిజిస్టర్డ్ ఏజెన్సీ నుండి కొటేషన్‌లను ఆహ్వానించడమైనది - నోటిఫికేషన్ ప్రచురణ.

| క్ర.సం. | ఐటమ్స్ | వివరాలు |
|---|---|---|
| 1. | పని పేరు | జిహెచ్ఎంసిలోని యుబిడి, చార్మినార్ జోన్, సర్కిల్-11 లోని ఆరాంఘర్ నుండి మీర్-ఆలం ట్యాంక్ వెళ్ళే ఫ్లైఓవర్ కింద (పిల్లర్ నం. P3 నుండి P5 వరకు) 2 స్పాన్ల థీమాటిక్ శిల్పాలు సెకండరీ కలెక్షన్ అందించడానికి కొటేషన్లు. |
| 2. | నోటిఫికేషన్ జారీ చేసిన అధికారి చిరునామాతో కూడిన కార్యాలయం పేరు | డిప్యూటీ డైరెక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ కార్యాలయం. |
| 3. | నోటిఫికేషన్ నంబర్ & తేదీ | నం.102/UBD/CRZ/GHMC/2025-26; తేదీ: 06.10.2025. |
| 4. | నోటిఫికేషన్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం | ప్రారంభ తేదీ: 08.10.2025 మధ్యాహ్నం 01.00 నుండి. |
| 5. | నోటిఫికేషన్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ | తేదీ:14.10.2025 మధ్యాహ్నం 03.00 వరకు. |
| 6. | కొటేషన్లు సమర్పించే చివరి తేదీ & సమయం | తేదీ:14.10.2025 మధ్యాహ్నం 3:30 వరకు |
| 7. | కొటేషన్లు తెరవడం | తేదీ:14.10.2025 సాయంత్రం 4.00 గంటలకు |
| 8. | కొటేషన్లు సమర్పించే స్థలం | డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, జిహెచ్ఎంసి, 2వ అంతస్తు, పూల్‌బాగ్, హైదరాబాద్. |
| 9. | కొటేషన్లు తెరవడం | 14-10-2025. |
| 10. | చిరునామా/ఇ-మెయిల్ ఐడి | ddparkssz.ghmc@gmail.com |
| 11. | సంప్రదింపు వివరాలు | 8309645723 |

సం/- డిప్యూటీ డైరెక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 8856-PP/CL/ADVT/1/2025-26, Date: 06-10-2025



# జనరల్

STATE & REGIONAL NEWS

## పెంచిన బస్సు చార్జీలను విరమించుకోవాలి: చంద్రమోహన్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ పరిధిలో పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను తక్షణమే విరమించుకోవాలని హైదరాబాద్ జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇప్పటికే అదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర ధరలతో కొట్టుమిట్టాడుతున్నారని, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పేద, మధ్య తరగతి ప్రయాణికులపై మరింత పెనుభారంగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సర్కార్ చారాన ఇస్తూ.. భారాన గుంజినట్టూ.. మహిళలకు ఉచిత అంటూ.. పురుషుల వద్ద అధిక ఛార్జీలు వసూలు చేయడం సరికాదని అన్నారు. ఇప్పటికే విద్యార్థుల బస్సుపాస్ ఛార్జీలు పెంచిన ఆర్టీసీ ఇప్పుడు బస్సు ఛార్జీలను పెంచుతూ సామాన్య ప్రయాణికుల నడ్డి విరుచడమే అని విమర్శించారు. సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చి మౌలిక సదుపాయాల సాకుతో ప్రయాణికులపై భారం వేయడం సబబు కాదని అన్నారు. అదే విధంగా ఆర్టీసీలో కార్గో సేవల్ని ప్రైవేటీకరించే ఆలోచనను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెంచిన ధరలను పునః పరిశీలన చేసి ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు.

## స్వేచ్ఛాయుతంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప ఎన్నికలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు(ఈవిఎం)లు, వివిప్యాట్ యంత్రాలను వినియోగించనున్నట్లు తెలిపారు. అవసరమైన యంత్రాలు ఇప్పటికే పరీక్షించి, సిద్ధం చేశామన్నారు. పోలింగ్ సాఫీగా జరిగేందుకు అన్ని సాంకేతిక, భద్రత చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఓటర్లు తమ ఓటరు గుర్తింపు కార్డుతో పాటు ఆధార్, డ్రైవింగ్, పాస్‌పోర్ట్, ప్యాన్ కార్డు, పెన్షన్ పత్రం గుర్తింపు పత్రాలతో ఓటు వేయవచ్చని ఎన్నికల అధికారులు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు తమకు ఉన్న క్రిమినల్ నేపథ్య వివరాలను పత్రికలు, టివి, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటించాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. ఓటరు జాబితాలో తమ పేర్లను ధృవీకరించుకొని, ఎన్నికల్లో ప్రక్రియలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## హైకోర్టులో తీర్పు పెండింగ్ ఉండగా సుప్రీం జోక్యం చేసుకోదు

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పబ్లిసిటీ కోసమే కాంగ్రెస్ మంత్రులు ఢిల్లీ వెళ్లారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. తాము ఏదోసాధించామని గొప్పలు చెబుతున్నారని అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హైకోర్టులో తీర్పు పెండింగ్ ఉండగా సుప్రీం కోర్టు జోక్యం చేసుకోదని స్పష్టంచేశారు. బిసి రిజర్వేషన్లకు తాము మద్దతు ఇస్తున్నామన్నారు. బిసి కోటాపై సుప్రీంకోర్టులో ఎవరో పిటిషన్ వేశారని, రిజర్వేషన్ల మీద ఏదో సాధిస్తామని మంత్రులు ఢిల్లీకి వెళ్లారన్నారు. మంత్రులు రాష్ట్రాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హైకోర్ట్ లోనూ వాదనలు వినిపించాలన్నారు. బిసిలకు రిజర్వేషన్లు ఇచ్చి తీరాలన్నారు. ఉచిత బస్సుతో ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. ఒక చేత్తో ఫ్రీ అంటూ మరో చేత్తో గుంజుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బేషరతుగా పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపికపై త్రిసభ్య కమిటీ వేశామని, రిపోర్ట్ ఆధారంగా రెండు, మూడు రోజుల్లో అభ్యర్థిని ప్రకటిస్తామని రాంచందర్ రావు చెప్పారు. బిజెపి రాష్ట్ర ఎలక్షన్ కమిటీతో సమావేశం తర్వాత అభ్యర్థిని ప్రకటిస్తామని చెప్పారు.

## పలువురికి నోటీసులు జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిల్లా మత్స్యకారుల సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్/పర్సన్ ఇన్‌ఛార్జిల నియామకాలు తామిచ్చే తీర్పుకు లోబడి ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పశుసంవర్ధక, మత్స్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య లిమిటెడ్ ఎండి సహా పలువురికి నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది. జిల్లా మత్స్యకారుల సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్లు లేదా పర్సన్ ఇన్‌చార్జిల నియామకం నేరుగా ప్రభుత్వం చేసేలా సెప్టెంబర్ 3న తెచ్చిన జీవో 60 చట్ట వ్యతిరేకమంటూ హన్మకొండ జిల్లా మత్స్యకారుల సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్ బుస్స మల్లేశం ఇతరులు వేసిన పిటిషన్‌ను జస్టిస్ టి.మాధవీదేవి విచారించారు. ప్రతివాదులు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. తీర్పుకు లోబడి జిఒ 60 అమలు ఉంటుందన్నారు.

# ప్రశాంత వాతావరణంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

నిర్వహణ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేశాం

హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఉత్కంఠ రేపుతున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కేంద్రం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో ఈ మేరకు జిహెచ్‌ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ జిహెచ్ ఎంసి ప్రధాన కార్యాలయం పన్వార్‌హాల్‌లో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదల చేయడంతో హైదరాబాద్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా పరిధిలోని రాజకీయ ప్రకటనల సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లు, హోర్డింగ్‌లు తొలగిస్తున్నామని చెప్పారు. సజావుగా శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని కర్ణన్ తెలిపారు. నవంబర్ 11న జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం మొత్తం 407 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు.

**జూబ్లీహిల్స్ ఓటర్లు 3,99,000**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,99,000 కాగా, జూలై 1, 2025ను అర్హత తేదీగా తీసుకుని సవరించిన జాబితాలో 2,07,382 మంది పురుషులు, 1,91,593 మంది మహిళలు, 25 మంది ట్రాన్స్ జెండర్ ఓటర్లు ఉన్నారు. లింగ నిష్పత్తి ప్రతి వెయ్యి పురుషులకు 924 మహిళలుగా ఉంది. ఈ జాబితాలో 6,106 మంది యువ ఓటర్లు (1819 సంవత్సరాలు), 2,613 మంది వృద్ధులు (80 ఏళ్ల పైబడిన వారు), అలాగే 1,891 మంది వికలాంగులు ఉన్నారు. వీరిలో 519 మంది చూపు కోల్పోయిన వారు, 667 మంది కదలికల లోపం ఉన్న వారు, 311 మంది వినికిడి, మాట లోపం కలిగిన వారు, మిగతా 722 మంది ఇతర కేటగిరీలకు చెందినవారు. విదేశీ ఓటర్లు 95 మంది ఉన్నారు. సెప్టెంబర్ 2న విడుదలైన ప్రాథమిక జాబితాలో 3,92,669 ఓటర్లు ఉన్నా నిరంతర సవరణల తరువాత 6,976 మంది కొత్తగా చేర్చబడ్డారు, 663 మంది తొలగించబడ్డారు. దీంతో మొత్తం సంఖ్య 3,98,982కి చేరింది. సేవా ఓటర్లను కలుపుకుని తుది సంఖ్య 3,99,000గా నమోదైంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉపఎన్నిక నిర్వహణకు 139 కేంద్రాల్లో 407 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ వివరించారు. ఓటరు జాబితాను మరోసారి పరిశీలన చేసుకొని, జాబితాలో పేరు లేకపోతే మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరో 10 రోజుల వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉందని చెప్పారు.

**రూ.6 కోట్ల ఖర్చు..**

ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నిర్వహణకు రూ.6 కోట్ల ఖర్చు అవుతుందని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో మొత్తం 4 లక్షల ఓటర్లు ఉన్నారని, కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన గుర్తింపు కార్డులతో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. 2025, నవంబర్ 14న యూసఫ్‌గూడలోని కోట్ల విజయ్ భాస్కర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడతామన్నారు. ఎన్నికకు సంబంధించి తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరిపడా ఈవిఎంలు అందుబాటులో ఉన్నాయని, మొదటి దశ ఈవిఎంల పరిశీలన పూర్తయిందన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్ తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. మీడియా కూడా ఎలాంటి ఫేక్ న్యూస్ టెలికాస్ట్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు తప్పకుండా తమపై ఉన్న కేసుల వివరాలను న్యూస్ పేపర్లు, న్యూస్ చానెల్స్‌లో ప్రచురించాలని సూచించారు.

**లైసెన్స్ కలిగిన ఆయుధాలను వెంటనే డిపాజిట్ చేయాలి : నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున ఏర్పాట్లు చేశామని నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ అన్నారు. లైసెన్స్ కలిగిన వారందరూ తమ ఆయుధాలను వెంటనే డిపాజిట్ చేయాలని స్పష్టం చేశారు. ఎంసిసి ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లను త్వరలోనే గుర్తిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎన్నికల ఉల్లంఘనలపై డయల్ 100కు ఫిర్యాదు చేయాలని కోరారు.

# ఎన్నికల విధులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ హెచ్చరిక



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ పర్సన్‌లుగా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, వారి పాత్ర చాలా కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్పష్టం చేశారు. ఎన్నికల విధులను నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జిహెచ్ ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి సంబంధించిన సెక్టార్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సెక్టార్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలన్నింటినీ తనిఖీ చేసి, భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) మార్గదర్శకాల ప్రకారం కనీస వసతులైన తాగునీరు, లైటింగ్, ఫ్యాన్‌లు, మరుగుదొడ్లు, సరైన విద్యుత్ ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. గత ఎన్నికల ఘటనల ఆధారంగా స్థానిక తహసీల్దార్‌లు, స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌లు, బూత్ లెవెల్ అధికారుల సహకారంతో 'వల్నరబుల్ మ్యాపింగ్' చేసుకోవాలని ఆయన సూచించారు.

**నోడల్ అధికారులు సజావుగా ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించాలి**

అనంతరం వ్యయ పర్యవేక్షణ బృందాలు, ఎఫ్ఎస్టీ (ఎఫ్ఎస్‌టి), ఎస్ఎస్‌టీ (ఎస్ఎస్‌టి), వివిఎస్‌టి (వివిఎస్‌టి), వివిటి (వివిటి), ఎంసిసి (ఎంపిసి), ఎంసిఎంసి (ఎంసిఎంసి) టీమ్‌లకు కూడా శిక్షణ ఇచ్చారు. ఈ బృందాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిక్కచ్చిగా విధులు నిర్వర్తించాలని కమిషనర్ కర్ణన్ ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో పన్వర్ హాల్‌లో ఎన్నికల నోడల్ అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా జరిగేలా నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, హేమంత్ సహదేవరావు, ఎన్. రవి కిరణ్, ఎంసిసి నోడల్ అధికారి నరసింహ రెడ్డి, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద, ఈఈ ఎలక్ట్రిసిటీ మమత పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతలు ఓటర్ కార్డులు పంచుతున్నారు!

ఇసికి ఎంపి రఘునందన్ ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ నాయకులు ఓటర్ గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్నారని బిజెపి ఎంపి రఘునందన్ రావు విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేతలు ఏకంగా ఓ దుకాణం పెట్టి మరీ ఓటర్ కార్డులు పంచుతున్నారని, ఈ విషయంపై తాను ఎన్నికల కమిషన్‌కు (ఈసి) ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వాస్తవానికి ఎన్నికల కమిషన్ అధికారుల ద్వారా ప్రజలకు చేరాల్సిన ఓటర్ కార్డులు, కాంగ్రెస్ నాయకుల చేతుల్లోకి ఎలా వెళ్లాయని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఇంత బహిరంగంగా నిబంధనలకు విరుద్ధంగా ఓటర్ కార్డుల పంపిణీ జరుగుతున్నా ఎన్నికల కమిషన్, జిహెచ్‌ఎంసి కమిషనర్లు ఎందుకు మౌనంగా ఉన్నారని అన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్‌లో ఓటర్ కార్డులు పంచుతున్న కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్, ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ఎలా అర్హుడవుతారని రఘునందన్ రావు ప్రశ్నించారు. 'నవీన్ యాదవ్‌కు ఆ ఓటర్ ఐడి కార్డులు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇచ్చారా? లేక ఎన్నికల కమిషన్ అందించిందా?' అని ఆయన ప్రశ్నించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేపడతామంటే ఓట్ల చోరీ అంటూ గగ్గోలు పెట్టే మేధావులు, ఇప్పుడు జరుగుతున్న ఈ ఐడి కార్డుల చోరీపై ఎందుకు స్పందించడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


# విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం విద్య రంగానికి అత్యంత ప్రాధాన్యతిస్తుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నిమ్స్ ఆసుపత్రి విస్తరణలో భాగంగా నూతన బ్లాక్స్ నిర్మిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ నియోజకవర్గంలో గల ఎర్రమంజిల్ ప్రభుత్వ నూతన పాఠశాలకు కూడా నూతన భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. అందులో భాగంగా 40 గదులతో రెండు అంతస్తులలో నూతన భవనాన్ని ఎంఈఐఎల్ నిర్మించింది. ఈ పాఠశాల నూతన భవనాన్ని స్థానిక శాసనసభ్యులు దానం నాగేందర్, ఎంఎల్‌సి రియాజుల్ హాసన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరితో కలసి సోమవారం మంత్రి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎర్రమంజిల్‌లో కార్పొరేట్ స్థాయికి దీటుగా రూ. 7.7 కోట్లతో నూతన పాఠశాల నిర్మించి ప్రారంభించుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఇంత గొప్ప పాఠశాలల ఎర్రమంజిల్‌లో అనుకున్న సమయానికి పూర్తిచేయడంలో కృషి చేసిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్, మెగా సంస్థ యాజమాన్యం కృష్ణారెడ్డిని, నిర్వాహకులను మంత్రి అభినందించారు. పాఠశాలలోని అన్ని గదులను ఏసి క్లాస్ రూమ్స్‌గా మార్చేందుకు, స్మార్ట్ డిజిటల్ క్లాస్ రూమ్‌లుగా మార్చేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతోపాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని, ఆ దిశగా పాఠశాల ఆవరణలో ఉన్న ఖాళీ స్థలాన్ని క్రీడా ప్రాంగణంగా సిద్ధం చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. పేద పిల్లలకు ఉన్నతమైన విద్యా బోధన అందించే దిశగా ప్రభుత్వం ఒక లక్ష్యంతో ప్రతి నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను చేపట్టనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఎంపి ఎం.అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించుకున్న పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎంపి నిధుల నుండి రూ. 25 లక్షలు కేటాయించనున్నట్లు ప్రకటించారు. నూతన పాఠశాల కార్పొరేట్ స్థాయికి దీటుగా చేపట్టటంతో విద్యార్థి పోటీతత్వంతో చదివి ప్రతి ఒక్కరూ అత్యున్నత మార్కులు సాధించాలన్నారు. ఎంఎల్‌ఏ దానం నాగేందర్ మాట్లాడుతూ నూతనంగా చేపట్టిన పాఠశాల భవనం ప్రారంభించుకోవడం తో హైదరాబాద్ నగరంలోని ఒక మోడల్ స్కూల్ గా నిలుస్తుందని అలాగే వేగవంతంగా చేపట్టినటువంటి పనులలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ప్రత్యేక కృషి ఎంతో ఉందని ఈ పాఠశాలలోని అన్ని తరగతి గదులను డిజిటల్ క్లాసులుగా మార్చాలని జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు విద్యుత్ తో పాటు క్రీడల్లో రాణించే విధంగా అసలు ఆవరణలో క్రీడా ప్రాంగణాన్ని త్వరలో చేపట్టడం జరుగుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో అన్ని పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచే దిశా గా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, డిజిటల్ క్లాసుల ద్వారా మెరుగైన విద్యాబోధన అందిస్తున్నామని అన్నారు.అలాగే అన్ని పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధనతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహార పదార్థాలు అందించటం అన్ని పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయ రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ లింగారెడ్డి, చీఫ్ ఇంజనీర్ బిల్డింగ్స్ రాజారెడ్డి, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఎంఈఐఎల్ ప్రాజెక్ట్స్ విభాగం అధ్యక్షులు కె.గోవర్ధనరెడ్డి, ఎంఈఐఎల్ ప్రాజెక్ట్స్ మేనేజర్ బాలబొమ్ము నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక తెలంగాణ' సాధనకు పాటుపడాలి : కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమ కారులంతా కలిసి 'సామాజిక తెలంగాణ' సాధనకు పాటుపడాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నంగవత్ రాజేష్ నాయక్ హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో 'తెలంగాణ జాగృతి'లో సోమవారం చేరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ జాగృతి బలోపేతానికి కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ నాయక్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, నాయకులు ఇస్మాయిల్, సంపత్ గౌడ్, కోళ్ల శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9, 10వ తరగతి విద్యార్థులకు మినహాయింపు ఇచ్చినందున

## మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని పాఠశాలల్లో దశలవారీగా తెలుగును ద్వితీయ భాషగా అమలు చేయడానికి సర్కార్ తీసుకున్న చర్యలను సవాల్ చేసిన పిల్‌లో మధ్యంతర ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. ఒక్క విద్యార్థి కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేయలేదని గుర్తు చేసింది. ప్రభుత్వం 2025–26 విద్యా సంవత్సరానికి 9, 10వ తరగతి విద్యార్థులకు మినహాయింపు ఇచ్చినందున మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదని చెప్పింది. పలు ప్రైవేట్ స్కూల్‌లకు చెందిన కొందరు విద్యార్థులు వేసిన రిట్ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపింది. స్టే కూడా ఉందని తెలియజేసింది. విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సహా అన్ని పాఠశాలల్లో తెలుగును ద్వితీయ భాషగా తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన ప్రమీలా పాఠక్ వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ విచారించింది.

## హెచ్ఎండిఏకు రెండు వారాలు గడువు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలింపు నిర్ణయాన్ని సవాల్ చేసిన పిల్‌లో కౌంటర్ దాఖలు చేసేందుకు హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ)కి హైకోర్టు ఆఖరి అవకాశం ఇచ్చింది. రెండు వారాలు గడువు ఇస్తున్నామని ప్రకటించింది. ఈసారి కౌంటర్ దాఖలు చేయనిపక్షంలో తాము జరిమానా విధిస్తామని హెచ్ఎండీఏకు హెచ్చరిక చేసింది. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ స్టేడియం స్థలంలో నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం గత జనవరి 30న ఇచ్చిన జీవోను జి.రాము అనే హైదరాబాదీ హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మోహియుద్దీన్ డివిజన్ బెంచ్ సోమవారం విచారణ జరిపిన సందర్భంగా కౌంటర్ వేసేందకు 2 వారాల గడువు కావాలని హెచ్ఎండీఏ కోరింది. ఇందుకు పిటిషనర్ లాయర్ అభ్యంతరం చెప్పారు. రెండు వారాల సమయం ఇస్తూ హెచ్ఎండీఏను హైకోర్టు హెచ్చరించింది.

## వైద్యం వికటించి బాలుడి మృతి

జ్వరంతో బాధపడుతున్న చిన్నారికి ఆర్ఎంపి ఇంజెక్షన్

తీవ్ర అస్వస్థతకు గురై చనిపోయిన బాలుడు

**ప్రజాపక్షం/జడ్చర్ల :** ఆర్ఎంపి వైద్యం వికటించి ఒక బాలుడు మృతి చెందారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండల పరిధిలోని కురువపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన కురుమయ్య కొడుకు వరుణ్ తేజ్ (11) కు జ్వరం రావడంతో ఆదివారం సాయంత్రం లింగంపేటలో ఆర్ఎంపి శశికిరణ్ వద్దకు తీసుకెళ్లారు. పరీక్షించిన ఆర్ఎంపి బాలుడికి ఇంజెక్షన్ చేసిన తర్వాత ఇంటికి తీసుకెళ్లారు. కానీ ఇంటికి వెళ్లిన తర్వాత బాలుడు మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవర్తించారు. దీంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ఇంజెక్షన్ వికటించి బ్రెయిన్ ఎఫెక్ట్ అయినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గ మధ్యలోనే బాలుడు మృతి చెందాడు. దీంతో శవాన్ని ఆర్ఎంపి ఇంటి ముందు పెట్టి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు.







## బిసి రిజర్వేషన్లపై రేపు హైకోర్టులో విచారణ

తాజాగా పిటిషన్లు దాఖలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ 9 ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు ఈ నెల 8న విచారణ చేయనుంది. సోమవారం కూడా రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. జిఒ 9 మేరకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సబబేనంటూ బిసి సంఘాలు, కాంగ్రెస్ నాయకులు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. తమ వాదనలు వినాలని కోరారు. ఇదిలా ఉండగా, అనంతరామన్ కమిషన్ రిపోర్టు ప్రకారం బిసిలను ఎబిసిడిలుగా వర్గీకరణ చేశాకే బిసి రిజర్వేషన్లను అమలుకు ఉత్తర్వులు ఇవ్వాలని ఒక పిటిషన్‌లో కోరారు. బిసిల్లో వర్గీకరణ లేకుండా ప్రకటించిన స్థానిక సంస్థల రిజర్వేషన్‌లు చెల్లవని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన జీవో 9ను రద్దు చేయాలంటూ వికారాబాద్ జిల్లా ధరూర్ గ్రామస్తుడు మడివాల మచ్చదేవ రజకుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.లక్ష్మయ్య పిటిషన్ వేశారు. జిఒ 9ని రద్దు చేయాలని కోరుతూ హైదరాబాద్ బాగ్‌లింగంపల్లికి చెందిన అడ్వకేట్ శాంతప్ప మరో పిటిషన్ వేశారు. పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 9(4) ప్రకారం బిసిల్లో ఏబిసిడీలుగా వర్గీకరణ చేపట్టాలని లక్ష్మయ్య కోరారు. వర్గీకరణ మేరకు రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. అనంతరామన్ కమిషన్ మేరకు రిజర్వేషన్లు ఉండాలన్నారు. ఆదివాసీ తెగలు, సంచారజాతులు ఇతరులకు 7 శాతం, సంచార వృత్తుల వారికి 10 శాతం, మతం మారిన క్రైస్తవులకు 1 శాతం, ఇతరులకు 7 శాతం రిజర్వేషన్‌ల కల్పన ఉండాలని అనంతరామన్ కమిషన్ చెబుతోందన్నారు. బిసిల వర్గీకరణ ప్రస్తావన లేకుండా జీవో 9 ఉందన్నారు. ఏబిసిడీలుగా బిసి రిజర్వేషన్లను కేటాయించి ఎన్నికలు జరపాలన్నారు. ఈలోగా జీవో అమలును నిలిపివేయాలన్నారు. బిసి రిజర్వేషన్ల జీవో 9కి చట్టబద్ధత ఉందంటూ కాంగ్రెస్ నేతలు వి. హనుమంతరావు, సాయికుమార్ ఇతరులు ఇంప్లీడ్‌పిటిషన్లు వేశారు. సుప్రీం కోర్టు ఇందిరా సహాని కేసులో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్నది విద్య, ఉపాధి రంగాలకేనన్నారు. .ఆ తీర్పు రాజకీయ రిజర్వేషన్‌లకు వర్తించదన్నారు. జిఒ 9ని, 42 శాతం రిజ ర్వేషన్లను సవాల్ చేసిన పిటిషన్లల్లో తమ వాదనలు విన్నాకే తుది ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. 42 శాతం బిసి రిజర్వేషన్ల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టు ధర్మాసనం ఈ నెల 8వతేదీన విచారణ చేసే అవకాశాలు ఉన్నాయి.



# జాతీయం


NATIONAL & GENERAL NEWS

## శబరిమల బంగారం చోరీపై సిట్ దర్యాప్తుకు కేరళ హైకోర్టు ఆదేశం

**కొచ్చి:** శబరిమల అయ్యప్ప ఆలయ ద్వార పాలకుల బంగారు తాపడం నుంచి బంగారం చోరీ జరిగిందన్న ఆరోపణలపై ప్రాథమికంగా విచారించిన కేరళ హైకోర్టు, దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేసింది. అయితే, ఈదర్యాప్తు గోప్యంగా ఉండాలని, ఎటువంటి సమాచారం లీక్ కాకూడదని ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తుకు మాజీ పోలీసు సూపరింటెండెంట్ ఎస్.శశిధరన్ నేతృత్వం వహిస్తారు. క్రైమ్‌బ్రాంచ్ చీఫ్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హెచ్.వెంకటేష్ పర్యవేక్షిస్తారు. ఈదర్యాప్తు బృందంలో సైబర్ నిపుణులు సహా ముగ్గురు ఇన్స్పెక్టర్లు ఉంటారు. శబరిమల ఆలయానికి చెందిన బంగారు పూతతో కూడిన రాగి పలకలను ట్రావెన్కోర్ దేవస్వం బోర్డు (టిడిబి) తొలగించిన 2019 నుండి దీనిపై ద ర్యాప్తు జరుగనుంది. కాగా, 2019లో ఆలయానికి విరాళంగా ఇచ్చిన రెండు బంగారు పూత పూసిన ఫలకాలు టీడీబీ ప్రాయోజిత, 'గ్లోబల్ అయ్యప్ప సంగమం' కార్యక్రమానికి ముందు స్ట్రాంగ్‌రూమ్ నుండి కనిపించకుండా పోయాయని ఉన్నికృష్ణన్ పొట్టి పేర్కొనడంతో దీనిపై వివాదం రేగిన సంగతి తెలిసిందే.

# కొండ ప్రాంతాల్లో చిక్కుకున్న పర్యాటకులు

### డార్జిలింగ్ జిల్లాలో వర్ష బీభత్సానికి పలువురు గల్లంతు
### 28కి చేరిన మృతుల సంఖ్య
### వర్షం తెరిపినివ్వకపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం



**డార్జిలింగ్ :** పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి బీభత్సం జరిగిన విషయం విదితమే. ఈ ఘటనలో మరణించిన వారి సంఖ్య 28కి పెరిగింది. పలు ఇళ్లు కొట్టుకుపోయాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అనేక మంది గల్లంతయ్యారని, వేలాది మంది పర్యాటకులు కొండ ప్రాంతాల్లో చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి మరో ఐదుగురి మృతదేహం వెలికితీసిన తర్వాత మృతుల సంఖ్య పెరిగినట్లు ఉత్తర బెంగాల్ అభివృద్ధి మంత్రి ఉదయన్ గుహ ధృవీకరించారు. పరిస్థితి చాలా సవాల్‌గా మారిందని, పలువురు గల్లంతు కావడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. నిరంతర వర్షపాతం సహాయక చర్యలకు ఆటంకం కలిగిస్తుందని ఆయన పిటిఐకి తెలిపారు. కేవలం 12 గంటల్లో 300 మి.మీ.లకు పైగా వర్షం కురిసిన కారణంగా, డార్జిలింగ్ కొండలు, పర్వత ప్రాంతంలోని దూయర్స్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయని అధికారులు తెలిపారు. డార్జిలింగ్ జిల్లాలోని మిరిక్, సుఖియాపోఖ్రి, జోర్‌బంగ్లో, జల్‌పైగురిలోని నాగరకత అత్యంత ప్రభావిత ప్రాంతాలలో ఉన్నాయి. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్) నేతృత్వంలో అనేక ప్రాంతాలలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న వ్యక్తులను కనుగొనడానికి భారీ యంత్రాలను మోహరించారు. 40కి పైగా కొండచరియలు విరిగిపడిన ప్రదేశాలలో తొలగింపు కార్యకలాపాలు జరుగుతున్నాయి. మిరిక్–డార్జిలింగ్‌ష సుఖియాపోఖ్రి రోడ్లను తిరిగి తెరవడానికి తమ బృందాలు 24 గంటలూ పనిచేస్తున్నాయి అని ఒక అధికారి తెలిపారు. గూర్ఖాలాండ్ టెరిటోరియల్ అడ్మినిస్ట్రేషన్ (జిటిఎ), స్థానిక ఎన్‌జిఒలతో సమన్వయం చేసుకుంటూ జిల్లా యంత్రాంగం సహాయ శిబిరాలను ఏర్పాటు చేసింది. నిర్వాసితులైన కుటుంబాలకు ఆహారం, దుప్పట్లు, మందులు, తాగునీరు అందిస్తున్నట్లు ఓ అధికారి ధృవీకరించారు. విపత్తు జరిగిన 24 గంటల తర్వాత కూడా అనేక గ్రామాలకు రోడ్డు అనుసంధానం తెగిపోయిందని జిటిఎ అధికారి ఒకరు పేర్కొన్నారు. మొత్తం వాలులు మునిగిపోయాయని, వంతెనలు కొట్టుకుపోయాయని, పెద్ద సంఖ్యలో రోడ్లు బురదలో మునిగిపోయాయని, కొన్ని మారుమూల గ్రామాలకు చేరుకోవడానికి హెలికాప్టర్, విమానాలు అవసరం కావచ్చు అని ఆయన చెప్పారు. దుర్గా పూజ సెలవుల్లో కొండ ప్రాంతాలకు వెళ్లిన వందలాది మంది పర్యాటకులు చిక్కుకుపోయారు. కొండచరియలు విరిగిపడంతో పర్వతాల దిగువన సిలిగురికి వెళ్లే ప్రధాన రహదారులు మూసుకుపోయాయి. చిక్కుకున్న వారిని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వారు సిలిగురికి చేరుకునేందుకు సహాయం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మరొక అధికారి తెలిపారు. భారత వాతావరణ శాఖ (ఐఎండి) మంగళవారం ఉదయం వరకు ఈ ప్రాంతంలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. డార్జిలింగ్, కాలింపాంగ్, జల్‌పైగురి, కూచ్‌బెహార్ జిల్లాలకు హెచ్చరిక జారీ చేసింది. కొనసాగుతున్న వర్షాల దృష్ట్యా, కొత్తగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఎక్కువగా ఉందని ఐఎండి అధికారులు పేర్కొన్నారు.

### 11 మంది భారత జాలర్లపై

# శ్రీలంక జాతీయులు దాడి

### పడవల సామాగ్రి స్వాధీనం



**నాగపట్టణం:** నాగపట్నంలోని నంబియార్ నగర్‌కు చెందిన 11 మంది మత్స్యకారులు ఆదివారం కోడియక్కరై తూర్పున చేపలు పడుతుండగా శ్రీలంక జాతీయులు వారిపై కొడవళ్లతో దాడి చేశారు. ఫైబర్ పడవల పరికరాలను లాక్కున్నారు. శివశంకర్ అనే మత్స్యకారుడికి ఎడమ మణికట్టులో నరాలు తెగిపోవడంతో అతడి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో అతన్ని తంజావూరు ఆసుపత్రికి తరలించారు. శ్రీలంక నుండి ఎనిమిది మంది వ్యక్తులు రెండు పడవల్లో వచ్చి, మత్స్యకారుల పడవలోకి ఎక్కి, ఇనుప రాడ్లు, చెక్క కర్రలు, కత్తులు వంటి ఆయుధాలతో వారిపై దాడి చేసి, బయలుదేరే ముందు వారి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు కోస్టల్ సెక్యూరిటీ గ్రూప్ వెల్లడించింది. శ్రీలంక వాసులు ఎస్ చంద్రబోస్, ఎం శశికుమార్‌కు చెందిన రెండు ఫైబర్ పడవలపై దాడి చేసి, పడవ ఇంజిన్లు, జిపిఎస్ పరికరాలు, బంగారు గొలుసులు, వాకీటాకీలు, ఫిషింగ్ నెట్‌లు, వారు పట్టుకున్న చేపలను స్వాధీనం చేసుకున్నారు. గాయపడిన మత్స్యకారులు, సి విఘ్నేష్ (28), సి విమల్ (26), సి సుకుమార్ (31), వి తిరుమురుగన్ (31), వి మురుగన్ (38), బి అరుణ్ (27), ఎం శశికుమార్, ఎస్ ఉదయశంకర్ (28), ఎస్ శివశంకర్ (25), ఎం కిరుబ (29), ఆర్ కమలేష్ (19), ఇతర మత్స్యకారుల సహాయంతో ఒడ్డుకు చేరుకున్నారు. పది మంది మత్స్యకారులు నాగపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శివశంకర్ ఎడమ మణికట్టులో నరాలు తెగిపోవడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో తంజావూరు ఆసుపత్రికి తరలించారు. మత్స్యకారులు ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు నంబియార్ నగర్ ఫిషింగ్ హార్బర్ నుండి రెండు ఫైబర్ బోట్లలో ఫిషింగ్ కార్యకలాపాల కోసం బయలుదేరారు.

### తన భర్త వాంగ్‌చుక్‌ను నిర్బంధించడాన్ని సవాల్ చేస్తూ..
### ఆంగ్మో వేసిన పిటిషన్‌పై కేంద్రం, యుటికి

# 'సుప్రీం' నోటీసులు

### 14కు కేసు విచారణ వాయిదా



**న్యూఢిల్లీ :** ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రత చట్టం (ఎన్ఎస్ఎ) కింద నిర్బంధించడాన్ని సవాల్ చేస్తూ వెంటనే విడుదల చేసేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ ఆయన భార్య గీతాంజలి జె.ఆంగ్మో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు కేంద్రం, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతం నుంచి స్పందన కోరుతూ నోటీసులు జారీచేసింది. తనను నిర్బంధించడానికి గల కారణాలను అందజేయాలని ఆమె చేసిన విజ్ఞప్తిపై ఎలాంటి ఉత్తర్వులు జారీచేయడానికి న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి. అంజారియా లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసు విచారణను అక్టోబరు 14కు వాయిదా వేసింది. 'ప్రస్తుతానికి ఏదో జరిగింది' అని ధర్మాసనం చెప్పింది. సోనమ్ వాంగ్‌చుక్‌ను కఠినమైన జాతీయ భద్రత చట్టం కింద సెప్టెంబరు 26న నిర్బంధంలోకి తీసుకున్నారు. రెండు రోజుల తర్వాత రాష్ట్ర హోదానుమ రియు 6వ షెడ్యూల్ హోదాను డిమాండ్ చేస్తూ హింసాత్మక నిరసనలు చోటుచేసుకున్నాయి. ఈ నిరసనలో నలుగురు మరణించగా, కేంద్రపాలిత ప్రాంతం లడఖ్‌లో 90మంది క్షతగాత్రులయ్యారు. ఈ హింసకు కారణం సోనమ్ వాంగ్‌చుక్ అని ప్రభుత్వం ఆయనను నిందితుడిగా పేర్కొంది. భారతదేశ రక్షణకు పక్షపాతం చూపే విధంగా వ్యవహరించకుండా నిరోధించేందుకు వ్యక్తులను అదుపులోకి తీసుకునే అధికారాలను కేంద్రానికి, రాష్ట్రాలకు జాతీయ భద్రతా చట్టం సంక్రమింపచేసింది. గరిష్ఠ నిర్బంధ కాలం 12నెలలుగా ఉంది. కాగా సోనమ్ వాంగ్‌చుక్‌ను రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ జైలులో ఉంచారు. సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సోనమ్ వాంగ్‌చుక్ భార్య తరపున హాజరయ్యారు. ఆమెను నిర్బంధం నుండి రక్షించేలా ఆదేశాలు జారీచేయాలని సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె.ఆగ్మో తరపున కపిల్ సిబల్ ధర్మాసనం ముందు తన వాదనలు వినిపించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ నిర్బంధానికి గల కారణాలను నిర్బంధంలో ఉన్న వ్యక్తికి (వాంగ్‌చుక్‌కు) అందించారని సమాధానం ఇచ్చారు. సోనమ్‌వాంగ్‌చుక్ భార్యను నిర్బంధించడానికి ఎలాంటి చట్టపరమైన అవసరం లేదని తుషార్ మెహతా చెప్పారు. నిర్బంధ ఉత్తర్వు కాపీ లేకుండా సవాల్ చేయలేమని మధ్యంతర ఉత్తర్వుల కోసం ఆధారాలను సప్లయ్ చేయాలని కపిల్ సిబల్ నొక్కిచెప్పారు. 'ఈ దశలో, మేం ఏమీ చెప్పకూడదు' అని జస్టిస్ కుమార్ చెప్పారు. వాంగ్‌చుక్ భార్యతో సమావేశాలకు, వైద్య సహాయానికి నిరాకరించబడ్డారని పిటిషనర్ భావోద్వేగ సమస్యను సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఆరోపించారు. జైలు నిబంధనల ప్రకారం వాంగ్‌చుక్‌కు అవసరమైన వైద్య అవసరాలను తీర్చాలని అత్యున్నత న్యాయస్థానం అధికారులను ఆదేశించింది. సీనియర్ న్యాయవాది వివేక్ తంఖా, న్యాయవాది సర్వం రితమ్ ఖరే ల ద్వారా పిటిషన్లు దాఖలు చేసిన సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె.ఆంగ్మో వాంగ్‌చుక్‌ను ఎలాంటి విచారణ లేకుండానే 12నెలల వరకు నిర్బంధించేందుకు అనుమతించేలా జాతీయ భద్రతాచట్టాన్ని ప్రయోగించే నిర్ణయాన్ని కూడా ఆమె ప్రశ్నించారు. నిర్బంధితుడిని తక్షణమే సంప్రదించాలని, నివారణ నిర్బంధ ఉత్తర్వులను రద్దు చేయాలని కూడా ఆమె దాఖలు చేసిన పిటిషన్‌లో కోరారు. వాంగ్‌చుక్ నిర్బంధం 'చట్ట విరుద్ధం', 'ఏకపక్షం', 'రాజ్యాంగ విరుద్ధం' కూడా అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21 మరియు 22 కింద ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తుందని పిటిషనర్ ఆరోపించారు.



# కటక్‌లో హింస

### ఎనిమిది మంది అరెస్టు
### 12 గంటల పాటు బంద్ : అమలులో నిషేధాజ్ఞలు

**కటక్ :** ఒడిశాలోని కటక్‌లో సోమవారం హింసాత్మక పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి సంబంధించి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. నిషేధాజ్ఞలు అమలులో ఉండగా భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య 12 గంటల బంద్ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. పోలీస్ కమిషనర్ ఎస్ దేవ్ దత్తా సింగ్ విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం విహెచ్‌పి కార్యకర్తలు పోలీసులపై దాడి చేసిన కేసులో మూడు కేసులు నమోదు చేశామని, ఎనిమిది మందిని అరెస్టు చేశామని చెప్పారు. పరిస్థితి అదుపులో ఉందన్నారు. ఈ దాడిలో గాయపడిన 25 మందిలో సీనియర్ పోలీసు అధికారి అమరెంద పాండా, కటక్ డిసిపి ఖిలారి రిషికేశ్ ద్యాండియో ఉన్నారు. పాండాను ఎస్సిబి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ఐసియులో చేర్చినట్లు అధికారులు తెలిపారు. సిసిటివి ఫుటేజ్ ద్వారా కొంత మంది దుర్వినియోగదారులను గుర్తించిన తర్వాత నగరంలోని వివిధ ప్రాంతాల్లో దాడులు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. దారాఘబజార్ ప్రాంతంలోని హాతి పోఖారి సమీపంలో శనివారం తెల్లవారుజామున నిమజ్జన ఊరేగింపులలో బిగ్గరగా సంగీతం వినిపించడాన్ని స్థానికులు వ్యతిరేకించడంతో ఘర్షణలు చెలరేగాయి. త్వరలోనే వాదన పెరిగి, రాళ్ళు, గాజు సీసాలు విసిరేందుకు దారితీసింది. ఘర్షణల్లో ద్యాండియోతో సహా ఆరుగురు గాయపడ్డారు. ఊరేగింపులపై దాడిని ఆపడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపిస్తూ, విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి) సోమవారం 12 గంటల బంద్‌కు పిలుపునిచ్చింది. ఆదివారం, బంద్‌కు మద్దతుగా విహెచ్‌పి కార్యకర్తలు చేపట్టిన మోటార్ సైకిల్ ర్యాలీని పోలీసులు సమస్యాత్మక ప్రాంతానికి చేరుకున్నప్పుడు అడ్డుకున్నారు. ఇది మళ్ళీ హింసకు దారితీసింది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ షెల్స్, రబ్బరు బుల్లెట్లను ఉపయోగించారు. హింస సమయంలో గౌరీశంకర్ పార్క్ ప్రాంతంలోని అనేక దుకాణాలకు నిప్పు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన బంద్‌కు మిశ్రమ స్పందన వచ్చింది కానీ ఎటువంటి సంఘటనలు జరగలేదు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు తక్కువ మంది హాజరుతో పనిచేస్తున్నాయి. మార్కెట్లు, పెట్రోల్ పంపులు తెరిచి ఉన్నాయి. ప్రజా రవాణా రోడ్డుపై అందుబాటులో ఉంది, కానీ పోలీసులు విధించిన అనేక ఆంక్షల కారణంగా సాధారణం కంటే తక్కువగా ఉంది. నగరంలో కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సిఎపిఎఫ్), ఒడిశా స్విఫ్ట్ యాక్షన్ ఫోర్స్‌కు చెందిన దాదాపు 800 మంది సిబ్బందితో పాటు రాష్ట్ర పోలీసుల నుండి 1,800 మంది సిబ్బందిని మోహరించినట్లు ఎసిపి నరసింఘ భోల్ తెలిపారు. సున్నితమైన ప్రాంతాలలో పోలీసు గస్తీ కొనసాగుతోందని, నగరంలోకి ప్రవేశించడానికి కూడా ఆంక్షలు విధించామని ఆయన అన్నారు. 'ఇక్కడ పనిచేసేవారు, ఎస్‌సిబి మెడికల్ కాలేజీ, ఆసుపత్రికి ప్రయాణించే రోగులు తప్ప కటక్ నగరంలోకి ప్రవేశించడానికి బయటి వ్యక్తులకు అనుమతి లేదు. ప్రయాణికుల బస్సులను ఎంట్రీ పాయింట్ల వద్ద నిలిపివేస్తున్నారు. సామాజిక వ్యతిరేకుల కదలికలను తనిఖీ చేయడానికి నగరంలోని అన్ని ఎంట్రీ పాయింట్లను బ్లాక్ చేశారు'అని ఆయన అన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగినట్లు నివేదిక లేదని, అన్ని ఏజెన్సీలు హై అలర్ట్‌లో ఉన్నాయని ఎడిజి సంజయ్ కుమార్ అన్నారు. సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నట్లు తేలిన వారిపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన చెప్పారు. నగరంలోని 20 పోలీస్ స్టేషన్ పరిధిలోని 13 ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 గంటల వరకు 36 గంటల పాటు నిషేధాజ్ఞలు విధించినట్లు అధికారులు తెలిపారు. అల్లర్లు చెలరేగకుండా నిరోధించడానికి ఆదివారం సాయంత్రం 7 గంటల నుండి 24 గంటల పాటు ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేసినట్లు వారు తెలిపారు. సోషల్ మీడియాలో సమాచారాన్ని పంచుకునే ముందు దాన్ని ధృవీకరించాలని, తప్పుడు, రెచ్చగొట్టే కంటెంట్‌ను పోస్ట్ చేయకుండా ఉండాలని ఒడిశా పోలీసులు ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. 'కొంతమంది వ్యక్తులు నకిలీ వార్తలను సృష్టించడం, వ్యాప్తి చేయడం ద్వారా సమాజంలో అశాంతి వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. తప్పుడు లేదా తప్పుదారి పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేసే, వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు' అని పేర్కొన్నారు.

# ఆసుపత్రిలో భారీ అగ్నిప్రమాదం : ఆరుగురు రోగులు మృతి

### రాజస్థాన్ జైపూర్‌లోని సవాయి మాన్ సింగ్ ఆసుపత్రిలో ఘటన




**జైపూర్ :** రాజస్థాన్‌లోని ఓ ఆసుపత్రిలో ఘోరం జరిగింది. జైపూర్‌లోని సవాయి మాన్ సింగ్ (ఎస్ఎంఎస్) ఆసుపత్రిలోని ట్రామా సెంటర్‌లో ఉన్న ఐసియులో ఆదివారం రాత్రి జరిగిన భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు రోగులు మరణించారు. జైపూర్‌లోని అతి పెద్ద ప్రభుత్వ ఆసుపత్రి అయిన ఎస్ఎంఎస్‌లో రాత్రి పాంతంలో ట్రామా సెంటర్‌లోని ఐసియులో మంటలు చెలరేగాయి. ఆందులో ఇద్దరు మహిళలు సహా ఆరుగురు రోగులు ప్రాణాలు కోల్పోయారు. కాగితాలు, వైద్య పరికరాలు, రక్త నమూనా గొట్టాలను ఉంచిన ఐసియు వార్డులోని స్టోర్‌రూమ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ఘోర విషాదం జరిగిందని అధికారులు అనుమానిస్తున్నారు. మంటలు త్వరగా వార్డు మొత్తాన్ని చుట్టుముట్టగా, పొగ వ్యాపించి భయాందోళనలకు గురిచేశాయి. ఈ ఘటనలో మరణించిన ఎనిమిది మంది రోగులతో పాటు, ముగ్గురు రోగుల పరిస్థితి విషమంగా ఉంది. షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఘటన జరిగిన సమయంలో, మొత్తం 18 మంది రోగులు ఐసియు, సెమీఐసియులో ఉన్నారు. వారిలో 11 మంది మంటలు చెలరేగిన వార్డులో ఉన్నారు. అగ్నిమాపక శకటాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా, పెద్ద ఎత్తున మంటలు, విషపూరిత పొగ సహాయక చర్యలకు ఆటంకం కలిగించాయి. కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది సహాయంతో కిటికీలు, తలుపులు పగలగొట్టి చాలా మంది రోగులను రక్షించారు. రోగులను వెంటనే వీధిలోని పడకలపై ఉంచి ఆక్సిజన్, ప్రథమ చికిత్స అందించారు. మంటలు చెలరేగిన తర్వాత, ఆసుపత్రిలో గందరగోళం నెలకొంది. ఐసియులో చేరిన క్లిష్టమైన రోగులను తరలించడానికి సిబ్బంది చాలా కష్టపడ్డారు. మంటలను అదుపు చేయడానికి గంట నుండి గంటన్నర సమయం పట్టింది. అన్ని రోగులను వారి పడకలతో సహా బయటికి తరలించారు. ట్రామా సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అనురాగ్ ధకాద్ మాట్లాడుతూ ఐసియులో 11 మంది రోగులు ఉన్నారని చెప్పారు. వారిలో కొంతమందిని వెంటనే బయటకు తరలించామని, పక్కనే ఉన్న ఐసియులో 13 మంది రోగులు ఉండగా, మంటలు వ్యాపించడంతో ఆరుగురు లోపలే చిక్కుకుకుపోయారన్నారు.


**ఆసుపత్రి వెలుపల బాధిత కుటుంబాలు ధర్నా**

కాగా, ఘటనపై మృతుల కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎస్ఎంఎస్ ట్రామా సెంటర్ వెలుపల ధర్నాకు దిగాయి. ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న కుటుంబాలు ఆసుపత్రి వర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయని ఆరోపించారు. ఘటన గురించి సమాచారం అందిన వెంటనే, ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ రాత్రి ఆలస్యంగా ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వారికి చికిత్స కోసం అన్ని వనరులను వెంటనే అందించాలని ఆయన ఆదేశించారు. 'ఇది చాలా విచారకరమైన, ఆందోళనకరమైన ఘటన. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వైద్య, విద్య కార్యదర్శి అంబరీష్ కుమార్, పోలీసు కమిషనర్ బిజు జార్జ్ జోసెఫ్, జైపూర్ కలెక్టర్ జితేంద్ర సోని, ఎస్ఎంఎస్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ దీపక్ మహేశ్వరి నుండి ప్రభుత్వం వివరణాత్మక నివేదిక కోరింది. ఘటన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అగ్నిప్రమాదానికి ఎవరి నిర్లక్ష్యం కారణమైందో, ఆసుపత్రి అగ్నిమాపక పరికరాలు, భద్రతా చర్యలు సరిపోయాయా అనే దానిపై కమిటీ దర్యాప్తు చేస్తుంది. అగ్నిప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తు చేయాలని మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ డిమాండ్ చేశారు.

## నకిలీ మద్యం లీలలు

# ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

### ఇబ్రహీంపట్నంలో భారీగా స్పిరిట్, ఖాళీ సీసాలు బట్టబయలు
### జనార్ధనరావు గోడౌన్‌గా గుర్తింపు?
### అన్నమయ్య జిల్లాలోను దాడులు



**అమరావతి :** నకిలీ మద్యం తయారీపై ఎక్సైజ్ పోలీసులు డేగ కన్నువేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఒక బార్ దగ్గర గల గోడౌన్‌లో నకిలీ మద్యం తయారీకి ఉపయోగించే స్పిరిట్, ఖాళీ మద్యం సీసాలు బయటపడ్డాయి. ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో నాసిరకం మద్యం తయారీకి వాడిన స్పిరిట్ విక్రయించిన వారిపై ఎక్సైజ్ అధికారులు దృష్టి పెట్టారు. రెక్టిఫైడ్ స్పిరిట్ (ఆర్ఎస్), ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఈఎన్ఏ) మిక్స్ చేసిన నకిలా మద్యాన్ని గుర్తించారు. తయారు చేయడానికి అవసరమైన వందలాది ఖాళీ మద్యం సీసాలు ఉండటంపై అనేక అనుమానాలున్నాయి. తాజాగా నకిలీ మద్యం కేసుకు సంబంధించిన కీలక అంశాలు ఇబ్రహీంపట్నం మండలంలో వెలుగు చూశాయి. ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో నకిలీ మద్యానికి వాడిన స్పిరిట్ లభ్యమైంది. నకిలీ మద్యం తయారీలో ఈ స్పిరిట్ కీలకంగా అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న అద్దెపల్లి జనార్ధన్‌రావుకు సంబంధించిన గోడౌన్‌లో పెద్ద ఎత్తున మద్యం తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన స్పిరిట్ ఖాళీ సీసాలను పోలీసులు సీజ్ చేశారు. వాటితో పాటు కేరళ మార్ట్, ఓఎస్డీ బ్రాండ్లకు చెందిన స్టిక్కర్లను, 35 లీటర్ల సామర్థం కలిగిన 95 క్యాన్లలో క్యాన్లలో లభ్యమైన స్పిరిట్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇతర ప్రాంతాలకు మద్యం పంపిణీ చేసే క్రమంలో సంబంధిత మెటీరియల్ సిద్ధంగా ఉంచుకున్నట్లు అధికారులు గుర్తించారు. స్పిరిట్ విక్రయించిన వారిపై ఎక్సైజ్ అధికారులు దృష్టి పెట్టారు. నకిలీ మద్యం తయారీ కోసం ఆర్ఎస్, ఈఎన్ఏ స్పిరిట్‌లను వినియోగించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీంతో స్పిరిట్ విక్రయించిన వారిని గుర్తించి వారిపై కేసు నమోదుకు అధికారులు సిద్ధమయ్యారు. ఒక్కో బాటిల్ రూ.120 నుంచి రూ.130 ధరకు విక్రయించినట్లు సమాచారం. ఈ కేసులో ఏ1గా ఉన్న జనార్ధన్‌రావు ప్రస్తుతం ఆఫ్రికాలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆయన అనుచరుడు కట్టా రాజును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వంపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. పట్టుబడిన మద్యం స్పిరిట్ టీడీపీ నేత జనార్ధన్ రావు గోడౌన్ అని, ఆయన వెనుక ఎవరున్నారో నిగ్గుతేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. నకిలీ మద్యం పేరుతో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి తదితరులపై అక్రమ కేసులు పెట్టి, అన్యాయంగా జైళ్లకు పంపారని, ఇప్పుడు బయటపడిన మద్యం స్పిరిట్‌పై చంద్రబాబు ప్రభుత్వం ఏం చెబుతుందని నిలదీస్తున్నారు. ఎన్నికల ముందు రూ.99కే మద్యం విక్రయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి..అధికారంలోకి వచ్చాక నకిలీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్నారని మండిపడుతున్నారు. గోడౌన్‌లోని నకిలీ మద్యం స్వాధీనం చేసుకుని పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. అన్నమయ్యజిల్లా తంబళ్లపల్లెలోను ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పక్క జిల్లాలకు కల్తీ మద్యం సరఫరా చేసినట్లు గుర్తించారు. అదే జిల్లాలోని పీటీఎం మండలం సోంపల్లె గ్రామంలోని బెల్టుషాపులపై పోలీసులు దాడులు చేపట్టారు.

### పాస్‌పోర్టు విడుదల చేయండి : ఎంపి మిథున్‌రెడ్డి

సీజ్ చేసిన తన పాస్‌పోర్టును విడుదల చేయాలంటూ నకిలీ మద్యం కేసులో విడుదలైన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి ఏసీబీ న్యాయస్థానంలో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు న్యూయార్క్‌లో ఐరాస అసెంబ్లీ సమావేశాలకు పీఎంవో నుంచి మిథున్‌రెడ్డి ఎంపికయ్యారు. దీంతో సీజ్ చేసిన తన పాస్‌పోర్టును విడుదల చేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మద్యం కేసులో ఏ4గా మిథున్‌రెడ్డి ఉన్నారు. 71 రోజుల పాటు జైలులో రిమాండ్ ఖైదీగా కొనసాగారు. ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరైన విషయం తెలిసిందే.

### ఆప్ తొలి జాబితా

**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 11 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను ఆమ్ ఆద్మీ పార్టీ సోమవారంనాడు విడుదల చేసింది. బిహార్‌లో ఆప్ పోటీ చేస్తుండటం ఇదే మొదటిసారి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 'ఇండియా' కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ ఈసారి బిహార్ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల ప్రకటించారు. ఈ విషయాన్ని ఆప్ ఢిల్లీ విభాగం చీఫ్, సీనియర్ నేత సౌరభ్ భరద్వాజ్ కూడా ఆ తర్వాత ధ్రువీకరించారు.

**LOST PASSPORT**

I, **NIRATI CHINNANNA,** S/O. **RAJANNA**, H.No. 2-52, Ola Village of Kuntala Mandal, Dist: Nirmal. I lost my original Passport Bearing No. **K8255836**. While travelling from my house OLA village and went ot Kallur. If anybody found return to the above mentioned address.

**IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE AT BHUPALAPALLI**

**O.S.NO: 148 OF 2025**

Between:

**Afsari Begum and others.** ...Plaintiffs

AND

**The Tahsildar, Kataram and another** ...Defendants

TO

1). The Tahsildar, Kataram
2). To whomsoever it may concern

Smt. Afsari Begum and her sons i.e, plaintiffs have filed the above suit for declaration that they are the **legal heirs of late Smt.Mahabooba Bee who died on 3-10-1985 and the said suit stand posted on 14-10-2025** for your appearance and Written Statement.

Take notice that you sould before the said Court on **14-10-2025** at **10.30 hrs**. in person or through an advocate duly instructed and to submit your written statement if any. If you do not appear on the said date the matter will be decided in your absence

//By order of Court)

Sd/-

**SYED SABIR, K. SUDHA RANI ADVOCATES**
H.No. 6-3-248/2, Khanpura, Karimnagar - 505001 (T.S.)

ప్రజాపక్షం
మంగళవారం, 07 అక్టోబరు

# సందేహాల మధ్య – బిహార్ ఎన్నికలు

బిహార్ ఓటర్ల జాబితాల ప్రక్షాళన విషయంలో ప్రతిపక్షాలు లేవనెత్తిన అభ్యంతరాలు, సందేహాలకు సంతృప్తికరమైన సమాధానాలు లభించకమునుపే, ఈనెల 7న సుప్రీంకోర్టులో విచారణ జరగనుండగా, భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) సోమవారం సాయంత్రం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు ప్రకటించింది. ఈనెల 4, 5 తేదీల్లో పట్నాలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై రాజకీయ పార్టీలతో, ఉన్నతాధికారులతో ఎన్నికల కమిషన్ బృందం చర్చలు జరిపింది. పోలింగ్ దశలను తగ్గించాలని రాజకీయ పార్టీలు కోరాయి. 2020లో మూడు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించగా, ఇసిఐ ఈ పర్యాయం రెండు దశల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. 243 నియోజకవర్గాలు కలిగిన అసెంబ్లీకి నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరుగుతుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఢిల్లీలో మీడియా సమావేశంలో ప్రకటించారు. ఓట్ల లెక్కింపు నవంబర్ 14న చేబడతారు. ఈ ఎన్నికలతోపాటు 7 రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతాయి. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ స్థానం వాటిలో ఒకటి.

బిహార్‌లో ముమ్మర రివిజన్ (ఎస్ఐఆర్) ద్వారా ఇరవైఏళ్ల తర్వాత ఓటర్ల జాబితాల ప్రక్షాళన జరిగినట్లు జ్ఞానేశ్‌కుమార్ సంతృప్తివ్యక్తం చేశారు. నామినేషన్‌ల దాఖలుకు 10 రోజుల ముందువరకు ఓటు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నందున, అర్హులైన వ్యక్తులు ఎవరైనా ఓటరు జాబితాలో తమ పేరు లేకపోతే దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన చెప్పారు. రాజకీయ ఒత్తిళ్లకిందనో, ఉద్దేశపూర్వకంగానో, పొరపాటునో ఎన్నికల అధికారులు ఓటర్ల జాబితాలో తొలగింపులు, చేర్పుల్లో తప్పులు చేసి ఉంటే వాటిని సరిదిద్దుకునే అవకాశం వయోజనులకిస్తున్న ఈ నిబంధన మాటున ఇసిఐ దాక్కుంటున్నది. ఎస్ఐఆర్ నిర్వహణలో ఇసిఐ అనుసరించిన పద్ధతిలో ఏ దశలోనైనా చట్టవిరుద్ధత కనుగొనబడితే మొత్తం ప్రక్రియను రద్దు చేస్తామని గత విచారణ సందర్భంలో సుప్రీంకోర్టు ధర్మాసనం హెచ్చరిక చేసినప్పటికీ, రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఇసిఐ జూన్ 24న సుప్రీంకోర్టులో విచారణ మొదలైనప్పటి నుంచీ తన వైఖరుల విషయంలో దృఢంగా ఉంటున్న నేపథ్యంలో మంగళవారం విచారణ నుంచి ఏదో తలకిందులు జరుగుతుందని ఆశించలేము. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున తాము జోక్యం చేసుకోలేమనీ చెప్పవచ్చు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిహార్ ఓటర్ల సంఖ్య 7,89,69,844. ఇంటింటి సర్వే అనంతరం ప్రచురించిన ముసాయిదాలో 65లక్షల ఓట్లు తొలగించారు. అందుకు చెప్పిన కేటగిరీలు – మరణించినవారు 21.6లక్షలు; శాశ్వతంగా నివాసం మారినవారు 35లక్షలు; ఒకటికన్నా ఎక్కువచోట్ల నమోదు 7లక్షలు; జాడలేని వారు 1.2లక్షలు. సెప్టెంబర్ 30న ప్రకటించిన తుది జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 7,41,92,357. కొత్తగా 21.53 లక్షల ఓటర్లను చేర్చామని, వారిలో 14.01లక్షలు మొదటిసారి ఓటర్లని సిఇసి చెప్పారు. ఈ సంఖ్యల్లో చాలా గందరగోళాన్ని, అవకతవకలను ప్రతిపక్షాలు శంకిస్తున్నాయి. ఈ రివిజన్ వెల్లడిస్తున్నదానికంటే దాచిపెడుతున్నదే ఎక్కువగా ఉందన్న సిపిఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య వ్యాఖ్య గమనార్హం. ఎన్‌డిఎ మిత్ర ఓటర్ల జాబితా తయారీలో బిజెపి సఫలమైందని, దళితులు, శ్రామికులు, మైనారిటీలకు ఓటు హక్కు నిరాకరించకుండా చూడాలన్న ఇండి కూటమి ప్రయత్నాలు విఫలమైనాయని స్పష్టమవుతున్నది. అంతేగాక ఎన్‌డిఎ పార్టీలు ఎన్నికల్లో దౌర్జన్యాలకు పాల్పడతాయని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి.

మూడవ పెద్ద రాష్ట్రమైన బిహార్‌లో అధికారం నిలుపుకోవటం, అందులో కూడా మహారాష్ట్ర లాగా బిజెపి పెద్ద పార్టీగా ఇన్నేళ్లుగా తమకు దక్కని ముఖ్యమంత్రి పదవిని చేజిక్కించుకోవటం బిజెపికి, మోదీ ప్రతిష్టకు ఎంతో అవసరం. వచ్చే సంవత్సరంలో జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు బిహార్ ఫలితాన్ని ప్రభావవంతమైన నైతిక బలంగా వారు చూస్తున్నారు.

బిహార్ ప్రజల్లో ఎన్‌డిఎ ప్రభుత్వంపై నెలకొన్న తీవ్రమైన అసంతృప్తిని గ్రహించిన ప్రధాన మంత్రి, ఓటర్లకు గాలం వేసేందుకై ప్రకటించినన్ని పథకాలు వాటికవే సాటి. మహిళల ఓట్లకై కోటిమంది మహిళలకు 'ముఖ్యమంత్రి రోజ్‌గార్ యోజన' కింద రూ.10వేల చొప్పున రూ.10వేల కోట్లు వితరణ, నిరుద్యోగంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న విద్యార్థులు, యువకుల కోసం రూ.62వేల కోట్ల వివిధ పథకాలు ప్రత్యేక ప్రస్తావనాంశాలు. ఇక శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు పరిమితి లేదు. తమకు అధికారమిస్తే ఏటా 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి దేశయువతను దగా చేసిన నరేంద్రమోదీ నాయకత్వంలో బిహార్ ఎన్‌డిఎ వచ్చే 5సంవత్సరాల్లో (2025–2030) కోటి ఉద్యోగాలు కల్పిస్తామని యువతకు వాగ్దానం చేయటం అతిపెద్ద జుమ్లా. కాదంటారా?

# రాజ్యాంగ పరిధిలో భద్రత లద్దాఖ్ ఆకాంక్ష

**దీప్‌శిఖ త్రివేది, వినయ్‌కుమార్**



స్వతంత్ర భారత చరిత్రలో లద్దాఖ్ చాలా మేరకు శాంతి, సంయమనం, దేశభక్తికి ప్రతీకగా ఉంది. అది దేశ ఉత్తర సరిహద్దులో భౌగోళికంగా, భావజాలం రీత్యా దృఢంగా నిలబడింది. అయితే నేడు, ఆ ప్రాంతం కల్లోలంలో మునిగి ఉంది. రాజ్యాంగ రక్షణల కోసం శాంతియుత డిమాండ్‌గా ప్రారంభమైన ఆందోళన హింసాయుత ఘర్షణల స్థాయికి చేరింది. ఇది జాతీయ భద్రత, ప్రజాస్వామిక స్థిరత్వం పెనవేసుకుని ఉన్న సరిహద్దు ప్రాంతంలో ఆందోళనకర పరిణామం. లెహ్, కార్గిల్‌లో ఇటీవల నిరసనల్లో రాళ్లు విసరటం, పోలీసు కాల్పులు జరిగాయి. నాలుగు మరణాలు సంభవించాయి. వారిలో ఒకరు కార్గిల్ యుద్ధ వీరుడు, 70 మందికి పైగా గాయపడ్డారు. 1990 దశకం ఆరంభం నాటినుండీ ఇది అత్యంత తీవ్రమైన విస్తరణ. ఈ విషాదం రాజ్యాంగ హక్కుల వక్కాణింపు నుండి ప్రజల నిరాశానిస్పృహకు చేరటాన్ని తెలియజేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఇంకెంత మాత్రము వారి కోర్కెలను తేలిగ్గా తీసుకోకూడదు.

పరిపాలన స్థానంలో జరిగే ఈ అధికారుల కంట్రోలు పద్ధతిని 'ప్రజాస్వామిక లోటు' అంటారు రాజ్యాంగ పండితులు.

ప్రస్తుత ఉద్యమం ప్రధానంగా రెండు కోర్కెలపై కేంద్రీకరించింది. లద్దాఖ్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర ప్రతిపత్తి, దాన్ని భారత రాజ్యాంగం ఆరవ షెడ్యూలులో చేర్చటం. రాష్ట్ర ప్రతిపత్తి రాజకీయ ప్రాతినిధ్యానికి, స్వయం పాలనకు తప్పనిసరిగా చూడబడుతున్నది. ఆరవ షెడ్యూలు మరే చట్టం ఇవ్వలేని సాంస్కృతిక, ఆర్థిక రక్షణలు కల్పిస్తుంది. ఆర్టికల్స్ 244(2), 275, 279 కింద ఆరవ షెడ్యూలు గిరిజన మెజారిటీ ప్రాంతాలకు వర్తిస్తుంది. అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరంలలోని అట్టి ప్రాంతాలకు ప్రస్తుతం ఆ షెడ్యూలు కింద రక్షణ ఉంది. శాసన, ఆర్థిక, న్యాయ అథారిటీతో అటానమస్ జిల్లా కౌన్సిల్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తుంది. భూమి, అడవులు, వ్యవసాయం, స్థానిక ఆచారాలు, సాంప్రదాయాలపై చట్టాలు చేసే అధికారం ఆ కౌన్సిల్స్‌కు ఉంటుంది. గవర్నర్ స్పష్టంగా మార్పుచేస్తే తప్ప రాష్ట్ర చట్టాన్ని త్రోసిపుచ్చే అధికారాలు వాటికున్నాయి. ఇది ఆదిమ తెగలకు కొంత మేరకు వారి భూమి, సంస్కృతికి రక్షణను, ఉన్నచోటు నుంచి బేదఖల్ నుండి వారి ఆర్థిక ప్రయోజనాలకు రక్షణను కల్పిస్తుంది.




ప్రస్తుత సంక్షోభానికి మూలాలు 2019 నాటి జమ్మూ–కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఉన్నాయి. ఆర్టికల్ 370 రద్దు చేసి రాష్ట్రాన్ని రెండుగా విభజించిన ఆ చట్టం జమ్మూ–కశ్మీర్‌కు అసెంబ్లీని ఇచ్చి, లద్దాఖ్‌కు ఏమీ ఇవ్వలేదు. ఆనాడు లద్దాఖ్‌లోని చాలామంది ఆర్టికల్ 370 రద్దును హర్షించారు. కేంద్రంలో తమకు నేరుగా సంబంధం ఏర్పడుతుందని, కశ్మీర్ నుండి పనిచేసే ప్రభుత్వం నుండి నిర్లక్ష్యం తప్పుతుందని వారు భావించారు. ఇప్పుడు ప్రజల నిరసనకు ప్రధాన గొంతుకగా ఉన్న సోనం వాంగ్చున్ లాంటి ప్రముఖులు ఆరంభంలో జాగరూకతతో కూడిన ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఐదేళ్ల తర్వాత సమ్మిళిత ప్రభుత్వం ఏర్పడుతుందన్న అంచనాలు నెరవేరలేదు.

లద్దాఖ్‌కు నేడు శాసనసభ లేదు, చట్టాలు చేసే స్థానిక అథారిటీ లేదు. భూమి, ఉద్యోగాలు లేదా సంస్కృతికి సంబంధించిన రాజ్యాంగ రక్షణలు లేవు. లెఫ్టినెంట్ గవర్నర్ కింద ఉన్న అధికారులు ఆర్టికల్ 239 ఉపయోగించి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజాప్రాతినిధ్య

ఆరవ షెడ్యూల్‌లో చేర్చటానికి లద్దాఖ్‌కున్న అర్హత నిరాకరించలేనిది. షెడ్యూలు తెగల జాతీయ కమిషన్ 2019లో లద్దాఖ్ జనాభాలో 95శాతానికి షెడ్యూలు తెగల అర్హత ఉందని, కాబట్టి లద్దాఖ్‌ను తక్షణమే ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలని సిఫారసు చేసింది. అది ఇంతవరకు నెరవేర్చబడలేదు. లద్దాఖ్ ప్రజలకు ఆరవ షెడ్యూలు లీగల్ నిబంధన మాత్రమే కాదు, శాశ్వత నివాసానికి రాజ్యాంగ రక్షణ కూడా. రాష్ట్రప్రతిపత్తి, ఆరవ షెడ్యూలులో చేర్పుదల లేని లద్దాఖ్ భారత యూనియన్ లో నిజమైన యూనిట్‌గా కాకుండా అడ్మినిస్ట్రేటివ్ పోస్టు మాత్రమే అవుతుందన్నది వారి భావన.

లద్దాఖ్ వాసులు తమ కోర్కెల సాధనకై ఐదేళ్ళుగా శాంతియుత పద్ధతుల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ 2024 అక్టోబర్‌లో లెహ్ ఎపెక్స్ బాడీ బ్యానర్ కింద 100 మంది అనుయాయులతో ఢిల్లీ చలో పాదయాత్ర చేపట్టారు. అయితే సమావేశం కావడంపై నిషేధాజ్ఞలు ఉల్లంఘించారన్న నెపంతో ఢిల్లీ పోలీసులు వారిని నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆ తర్వాత కూడా లద్దాఖ్ వాసులు శాంతియుత పద్ధతిలో ఆందోళనలు సాగిస్తూ 2025 సెప్టెంబర్ 10న తాజాగా నిరాహార దీక్ష మొదలుపెట్టారు. చర్చలకు అక్టోబర్ 6వ తేదీని కేంద్రం ఇవ్వటంతో సెప్టెంబర్ 24న ప్రజల్లోని నిస్పృహ హింసకు దారి తీసింది. అసంతృప్తి ప్రజా సమీకరణకు దారితీసిన నేపాల్, బంగ్లాదేశ్ ఉదంతాలు యువతను ప్రేరేపించాయి.

లద్దాఖ్ ఆందోళనను కేవలం ప్రాంతీయ సమస్యగా పరిగణించడం పెద్ద తప్పు అవుతుంది. ఈ ప్రాంతానికి చైనా, పాకిస్తాన్‌లతో 1600 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. 2020లో గాల్వాన్ లోయ ఘటన తదుపరి సైనిక నియోగం పెచ్చు పెరిగింది. సరిహద్దు ప్రాంతాల జన సముదాయాలను దూరం చేసుకోవటం దేశ భద్రతకు సంకల్పాన్ని బలహీన పరుస్తుందని వ్యూహాత్మక విశ్లేషకులు అంటుంటారు. ప్రజాస్వామ్యం జాతీయ భద్రత నుంచి విడదీయరానిది.

లెహ్, కార్గిల్ ప్రతినిధులతో చర్చలకై హోం శాఖ కింద 2023లో ఉన్నతాధికార కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఆ చర్చల్లో హామీలు మాత్రమే ఇచ్చారు, వాగ్దానాలు కాదంటారు ఆ ప్రాంత నాయకులు.


స్థానికులను సంతృప్తిపరిచేందుకు రాజ్యాంగ మార్గాలు స్పష్టంగా ఉన్నాయి. గవర్నర్ సిఫారసుపై రాష్ట్రపతి ఉత్తర్వుద్వారా ఆరవ షెడ్యూల్‌లో చేర్చవచ్చు, పుదుచ్చేరి తరహా అసెంబ్లీ ఏర్పాటు చేయవచ్చు. ఆర్టికల్ 3,4కింద పార్లమెంటరీ శాసనం ద్వారా పూర్తిస్థాయి రాష్ట్రప్రతిపత్తి మంజూరు చేయవచ్చును. కావలసింది రాజకీయ సంకల్పం.

అలాకాకుండా, అసమ్మతిని అణిచేందుకు ముఖ్య నాయకుడు సోనం వాంగ్‌చుక్‌ను అరెస్టుచేసి జాతీయ భద్రత చట్టం కింద ఆరోపణలు మోపారు. ఆయన ఎన్‌జిఓపై స్వల్పమైన తప్పులకు విదేశీ విరాళాల స్వీకారం లైసెన్స్ రద్దుచేశారు. ఆర్థిక అవకతవకల పేరుతో ఆయన స్వచ్ఛంద సంస్థ హిమాల్ (HIMAL)పై సిబిఐ దర్యాప్తు ఆదేశించారు. గాంధేయవాది అయిన వాంగ్‌చుక్‌పై ఈ నిర్బంధ చర్యలు ప్రభుత్వానికి లద్దాఖ్ ప్రజలతో విశ్వాస నిర్మాణానికి తోడ్పడవు. ఆయన ప్రముఖ శాస్త్రవేత్త, పర్యావరణ ఉద్యమకారుడు కూడా. హింసను తక్షణమే విడనాడాలని యువతకు ఆయన విజ్ఞప్తి చేశారు. నిరసనకారులే కాదు, విధాన నిర్ణేతలు కూడా ఆయన హితవచనాలు చెవికెక్కించుకోవాలి. రాజ్యాంగ మౌనం దీర్ఘకాలం కొనసాగితే రాడికలైజేషన్ పెరిగే ప్రమాదం ఉంటుంది. లద్దాఖ్ ప్రజలు రాజ్యాంగ స్ఫూర్తికి విజ్ఞప్తి చేస్తున్నారుగాని వేర్పాటు వాదానికి కాదు. న్యూఢిల్లీ రాజ్యాంగ నైతికతతో ఇప్పుడు వ్యవహరించాలి.

(ఐపిఎ సర్వీస్)

# విషతుల్యమవుతున్న మధుర ఫలాలు

మన రోజువారీ జీవితంలో పండ్లు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమైనవి. ఇవి సహజంగా కాకుండా, రసాయనాలతో వేగంగా పండించినప్పుడు, మన ఆరోగ్యానికి శత్రువులుగా మారుతాయి. అందులో ముఖ్యంగా కాల్షియం కార్బైడ్ ఒకటి. భారత దేశంలో కృత్రిమంగా పండించే పండ్లు ప్రమాద స్థాయిలో విషం కుక్కుతున్నాయి. పండ్లు ప్రకృతి ప్రసాదించిన బహుమతి పోషకమైన అలాగే తేలికగా జీర్ణం అయి, రిఫ్రెష్ చేసేవి. ఒకప్పుడు రైతులు, వ్యాపారస్తులు సహజంగా పండించే పండ్లు అమ్మేవారు. ఇప్పుడు వ్యాపార దృక్పథం మారింది. ఎవరేమైతే మాకేమి మా సరకు అమ్ముడు పోవాలి. పండ్ల తోటల్లో డ్రమ్ముల కొద్దీ కార్బైడ్ లేదా పొడర్లు ఉంటున్నాయి. రోజు వేల టన్నుల కొద్దీ పండ్లు కార్బైడ్‌లో లేదా మాగడానికి వాడే రసాయనాలలో అద్ది మార్కెట్ కు తరలిస్తు న్నా పట్టించుకునే వాడు లేదు. ఇప్పుడు ప్రజారోగ్యం పట్ల పెరుగుతున్న ఆందోళనగా మారింది. మార్కెట్లలో, పండ్ల రూపాన్ని మెరుగుపరచడానికి, త్వరగా పండించడానికి రసాయన చికిత్సలకు గురవుతున్నారు, ఈ పద్ధతి వినియోగదారులకు తీవ్రమైన ప్రమాదాలను కలిగిస్తుంది. ఈ పద్ధతులు భారతీయ చట్టం ప్రకారం నిషేధించబడినప్పటికీ, కాల్షియం కార్బైడ్‌ని ఉపయోగించి కృత్రిమంగా పండించడం సాధారణమైంది. పండించడం అనేది పండ్లను తినదగినదిగా, రుచికరంగా, రుచి, పోషకాలతో సమృద్ధిగా చేసే సహజ శారీరక ప్రక్రియ. సహజంగా పండిన పండ్లు జీవరసాయన మార్పుల శ్రేణికి లోనవుతాయి. కణజాలాలను మృదువుగా చేయడం, రంగులో మార్పు, పులుపు తగ్గుదల, మంచి వాసన, తీపి అభివృద్ధి. ఈ ప్రక్రియ సహజ మొక్కల హార్మోన్ అయిన ఇథిలీన్ వాయువు ద్వారా నడపబడుతుంది. అయితే, ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి, మార్కెటింగ్ కోసం పండ్ల దృశ్య ఆకర్షణను మెరుగుపరచడానికి, వ్యాపారులు తరచుగా కృత్రిమంగా పండించే పద్ధతులను ఆశ్రయిస్తారు. కృత్రిమంగా మగ్గపెట్టడంవల్ల సాధారణంగా సహజ పండించే ప్రక్రియను అనుకరించడానికి ఎసిటిలీన్ లేదా ఇథిలీన్ వంటి హైడ్రోకార్బన్‌లను ఉపయోగించడం ఉంటుంది. ఇది పండ్లకు ఆకర్షణీయమైన రంగును ఇచ్చినప్పటికీ, వాటి అంతర్గత నాణ్యత, రుచిని దెబ్బతీస్తుంది. అత్యంత సాధారణమైన, ప్రమాదకరమైన పద్ధతి కాల్షియం కార్బైడ్ ను ఉపయోగించడం. పండ్ల మార్కెట్లలో 'మసాలా' అని కూడా పిలువబడే చౌకైన పారిశ్రామిక రసాయనం. ఆహార కల్తీ నివారణ నియమాలు, 1955, ఆహార భద్రత, ప్రమాణాలు నిబంధనలు, 2011 కింద నిషేధించబడినప్పటికీ, కాల్షియం కార్బైడ్ దాని సులభమైన లభ్యత, తక్కువ ధర కారణంగా విస్తృతంగా ఉపయోగించబడుతోంది. ప్రతి మార్కెట్ యార్డ్ మొదలుకొని సాధారణ తోపుడు బండి వర్తకుడి దగ్గర లభిస్తున్నాయి. కాల్షియం కార్బైడ్ నీటితో చర్య జరిపినప్పుడు, అది ఎసిటిలీన్ వాయువును ఉత్పత్తి చేస్తుంది, ఇది ఇథిలీన్‌కు అనలాగ్‌గా పనిచేస్తుంది, ఇది అకాల పక్వానికి కారణమవుతుంది. అయితే, ఎసిటిలీన్ చాలా తక్కువ ప్రభావవంతంగా ఉంటుంది, చాలా ప్రమాదకరమైనది. ఈ ప్రయోజనం కోసం ఉపయోగించే కాల్షియం కార్బైడ్ తరచుగా ఆర్సెనిక్, ఫాస్పరస్ హైడ్రైడ్ యొక్క జాడలను కలిగి ఉంటుంది, రెండూ అత్యంత విషపూరిత పదార్థాలు. ఈ రసాయనం క్యాన్సర్ కారక లక్షణాలను కలిగి ఉంటుంది. కాల్షియం కార్బైడ్‌తో పండిన పండ్లు బాహ్యంగా ఆకర్షణీయంగా కనిపించవచ్చు కానీ రుచి ఆకృతిలో తక్కువగా ఉంటాయి. అవి అతిగా మృదువుగా మారతాయి, లోపల అసమానంగా పండుతాయి, నిల్వ కాలం గణనీయంగా తగ్గుతుంది. వినియోగదారులు తరచుగా ఏకరీతి రంగు ద్వారా మోసపోతారు, పండ్ల లోపలి భాగం పచ్చిగా లేదా పండని విధంగా ఉండవ చ్చు. మామిడి, అరటిపండ్లు, బొప్పాయి, సపోటా, ఖర్జూరం, టమోటాలు ఎక్కువగా ప్రభావితమయ్యే పండ్లలో ఉన్నాయి. కార్బైడ్‌తో పండిన పండ్లను తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రభావాలు తీవ్రంగా ఉంటాయి. ఆర్సెనిక్, ఫాస్పరస్ హైడ్రైడ్‌కు గురికావడం వల్ల వాంతులు, విరేచనాలు, ఛాతీ నొప్పి, కడుపులో మంట, కళ్ళు చర్మంలో చికాకు శ్వాసకోశ ఇబ్బంది కూడా వస్తాయి. తరచుగా తినడం వల్ల తలనొప్పి, తలతిరగడం, గందరగోళం తీవ్రమైన సందర్భాల్లో మెదడు వాపు (సెరిబ్రల్ ఎడెమా) వంటి తీవ్రమైన నాడీ సంబంధిత ప్రభావాలకు దారితీస్తుంది. ఈ రసాయనం కడుపు, ప్రేగుల శ్లేష్మ పొరను కూడా క్షీణింపజేస్తుంది, ఇది జీర్ణ రుగ్మతలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది.




భయంకరమైన ప్రమాదాలను గుర్తించి, ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 పండ్లను పండించడానికి కార్బైడ్ వాయువును ఉపయోగించడాన్ని నిషేదించింది . ఆహార భద్రత ప్రమాణాల నిబంధనలలోని సెక్షన్ 2.3.5 ప్రకారం ఎసిటిలీన్ వాయువును ఉపయోగించి కృత్రిమంగా పండించిన ఏదైనా పండ్ల అమ్మకం లేదా బహిర్గతం చేయడం స్పష్టంగా నిషేధించబడింది. ఉల్లంఘించిన వారికి చట్టంలోని సెక్షన్ 50 కింద ₹5 లక్షల వరకు జరిమానాలు, సెక్షన్ 59 కింద తీవ్రమైన కేసులలో జీవితాంతం జైలు శిక్ష విధిస్తారు.

ముప్పును అరికట్టడంలో వినియోగదారులు కూడా కీలక పాత్ర పోషించాలి. పండ్లను తినే ముందు నీటిలో బాగా కడగడం, సాధ్యమైన చోట వాటిని తొక్క చర్మం నుండి నేరుగా తినకుండా ఉండటం, ముఖ్యంగా మామిడి మరియు ఆపిల్ విషయంలో. అవగాహన కీలకం వినియోగదారులు అనుమానాస్పద కేసులు లేదా అసురక్షిత ఆహార పద్ధతులను వారి సంబంధిత రాష్ట్రాల ఆహార భద్రతా కమిషనర్‌కు నివేదించవచ్చు. స్టాల్‌పై ప్రకాశవంతమైన, నిగనిగలాడే పండ్లు ఉత్సాహంగా అనిపించవచ్చు, కానీ అది దాగి ఉన్న ప్రమాదం కనిపించదు. కాల్షియం క్యాబైడ్‌తో కృత్రిమంగా పండించడం అనేది అనైతిక వాణిజ్య పద్ధతి మాత్రమే కాదు ఇది ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే నెమ్మదిగా విషపూరితం చేస్తుంది. సురక్షితంగా, సహజంగా పండిన పండ్లను నిర్ధారించుకోవడానికి అధికారులు, వ్యాపారులు మరియు వినియోగదారుల నుండి సమిష్టి అప్రమత్తత అవసరం.

**ఎం.సురేష్‌బాబు**

# ప్రాథమిక అవసరం 'పత్తి'

మనిషి కనీస అవసరాల జాబితాలో కూడు, గూడు, గుడ్డ ముందు వరుసలో వస్తాయి. ప్రపంచ మానవుడు ధరించే వస్త్రాల తయారీకి ప్రకృతి ప్రసాదించిన ఏకైక ముడి సరుకుగా కాటన్ లేదా పత్తికి ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా ఐదు ఖండాల్లోని దాదా పు 80 దేశాల్లో పత్తి ఉత్పత్తి కొనసాగుతూ, ప్రపంచ మానవాళి వస్త్ర అవసరాలను తీర్చుతున్నది. ఆహారేతర పంటల్లో పత్తి ప్రధానమైనది. పత్తి చేసేతున్న మేలును దృష్టిలో పెట్టుకొని ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐరాసల చొరవతో ప్రపంచ దేశాలు ఏటా 07 అక్టోబర్ రోజు ప్రపంచ పత్తి దినోత్సవం (వరల్డ్ కాటన్ డే) పాటించుట 2019 నుంచి ఆనవాయితీగా మారింది. పత్తిని పండిస్తున్న దేశాల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా పేద చిన్న సన్నకారు రైతుల కుటుంబాల, ముఖ్యంగా మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంలో ప్రముఖంగా పాత్రను పోషిస్తోంది. వస్త్రాల తయారీలో వాడుతున్న ముడి నూలు సరుకు ల్లో పత్తి అత్యంత ముఖ్యమైనది. కాటన్ వస్త్రా లు సౌకర్యవంతంగా, ఆరోగ్యవంతంగా, మన్నిక గా, ఎలర్జీ లేకుండా, చవకగా అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతూ ఆకట్టుకుంటున్నాయి. మిలియన్ల గ్రామీణ రైతులకు జీవనోపాధి, సామాజిక ఉన్నతి కల్పించడంలో పత్తి సాగు, పత్తి ఆధార పరిశ్రమలు దోహదపడుతున్నాయి. ప్రపంచ పత్తి దినోత్సవం–2025 ఇతివృత్తంగా మన జీవితాల్లో వస్త్రాలు (ది ఫ్యాబ్రిక్ ఆఫ్ అవర్ లైవ్స్) అనే అంశా న్ని తీసుకొని విస్తృతంగా అవగాహన కార్యక్రమా లు నిర్వహిస్తున్నారు. ప్రపంచ దేశాల ప్రభుత్వా లు, అధికారులు, పత్తి రైతులు, శాస్త్రవేత్తలు, స్కాలర్స్, రిటైల్ వ్యాపారులు, ప్రైవేట్ రంగాలు సంయుక్తంగా కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా నేడు ప్రపంచ మార్కెట్‌ను ముంచి వేస్తున్న కృత్రిమ నూలు పోగు వస్త్రాలతో పోల్చితే కాటన్ వస్త్రాలు అన్ని విధాలుగా మేలు చేస్తాయని సామాన్య ప్రజల్లో ప్రచారం చేయడం జరుగుతుంది.




ప్రపంచవ్యాప్తంగా 24 మిలియన్లకు పైగా కాటన్ ఉత్పత్తి చేసే రైతులు ఉండగా 80 దేశాలకు చెందిన 100 మిలియన్లకు పైగా కుటుంబాలు పత్తి సాగుతో జీవనోపాధులను పొందుతూ, ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. ప్రపంచ దేశాల్లో కాటన్ ఉత్పత్తిలో భారత్, చైనాలు అగ్రస్థానంలో ఉంటూ దాదాపు 50 శాతం పత్తిని పండించడం జరుగుతోంది. భారత్‌లో ముఖ్యంగా మహారాష్ట్రతో పాటు గుజరాత్, తెలంగాణ, ఆంధ్ర, రాజస్థాన్, ఎంపీ, కర్నాటక, హర్యానా, పంజాబ్, ఒడిసా రాష్ట్రాల్లో పత్తి పంట ప్రధానమైనదిగా మారింది. దేశవ్యాప్తంగా దాదాపు 50 మిలియన్ల భారతీయులు ఉపాధి పొందుతున్నారు. పత్తి ఉత్పత్తి శృంఖలంలో అనేక మందికి, ముఖ్యంగా మహిళలకు ఉపాధి లభిస్తున్నది.

పేదరిక నిర్మూలనలో కూడా పత్తి ప్రధాన భూమికను నిర్వహిస్తోంది. పత్తి రైతులు, పత్తి ఆధార శ్రామికుల కళ్లల్లో ఆనందం చూడడానికి ప్రభుత్వాలు, సంబంధిత శాఖలు నిరంతరం కృషి చేయాలని కోరుకుందాం.

# జపాన్ రాజకీయ సంక్షోభం.. ఐరన్ లేడీకి కఠిన ప్రయాణం

జపాన్ రాజకీయ వేదిక మరోసారి అస్థిరతలో మునిగిపోయింది. ప్రధాని పదవీకాలం మధ్యలోనే ముగియడంతో, పార్టీ అంతర్గత విభేదాలు, ఆర్థిక సమస్యలు, ప్రజా విశ్వాసం కోల్పోవడం వంటివి దేశాన్ని అనిశ్చితిలోకి నెట్టాయి. ఈ సంక్షోభం చివరికి ఒక చారిత్రక ఘట్టానికి దారి తీసింది. జపాన్ చరిత్రలో తొలి మహిళా ప్రధానిగా సనే తకాయచి అధికారంలోకి రానున్నారు. ఈ రాజకీయ సంక్షోభంలో పదవిని కోల్పోయిన తొలి వ్యక్తి మాజీ ప్రధాని షిగేరు ఇషిబా. 2024 అక్టోబర్‌లో పదవి చేపట్టిన ఆయన కేవలం ఏడాదికే రాజీనామా చేయాల్సి వచ్చింది. అవినీతి ఆరోపణలు, ఎన్నికల్లో ఓటములు, ప్రజల్లో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి)పట్ల పెరుగుతున్న అసంతృప్తి వంటి అంశాలు కలసి ఆయనను దారి తప్పించాయి. యెన్ విలువ పడిపోవడం, ధరల పెరుగుదల, జీలు పెరగకపోవడం వంటి అంశాల వల్ల ప్రజలు ఆగ్రహంతో ఓటేశారు.

ఇషిబా రాజీనామా చేసిన నేపథ్యంలో పార్టీలో కఠిన పోటీ మొదలైంది. ఆ పోటీలో సనే తకాయచి విజయం సాధించి, అక్టోబర్ మధ్య నాటికి పార్లమెంట్ ఆమెను ప్రధానిగా ఖరారు చేయనుంది. ఆమె గెలుపు చరిత్రాత్మకం. జపాన్ తొలి మహిళా ప్రధానమంత్రి అవ్వడం మాత్రమే కాదు, రాజకీయంగా కఠిన సంప్రదాయవాద వైఖరిని ప్రతిబింబించే వ్యక్తి అధికారంలోకి రావడం కూడా. ఆమె దివంగత ప్రధానమంత్రి షింజో అబేకు సన్నిహితురాలు, ఆయన జాతీయవాద భావజాలాన్ని కొనసాగించాలనే సంకల్పం కలిగిన వ్యక్తి. దేశం మార్పు కోరుకునే సమయంలో తకాయచి గెలుపు కఠినమైన రాజకీయ దిశకు సంకేతంగా నిలుస్తోం ది.

**సవాళ్లతో నిండిన కొత్త మార్గం:** అయితే ఈ కొత్త నాయకురాలి ముందున్న సవాళ్లు సాధారణమైనవి కావు. ఒకవైపు దేశీయంగా రాజకీయ స్థిరత్వాన్ని నెలకొల్పడం, మరోవైపు ఆర్థిక ఒత్తిడి, సామాజిక అసమతుల్యత వంటి సమస్యలను ఎదుర్కోవడం ఆమెకు పెద్ద పరీక్ష. జపాన్ రాజకీయ చరిత్రలో ప్రధానులు తక్కువకాలంలో పదవీ విరమణ చేయడం సాధారణం. ఇప్పుడు అదే దశ మళ్లీ వస్తుందేమోనని జపనీయులు ఆందోళన చెందుతున్నారు.

మొదటగా, పార్లమెంట్‌లో మెజారిటీ లేకపోవడం తకాయచికి పెద్ద సవాలు. ముఖ్యమైన చట్టాలు, బడ్జెట్ బిల్లులు ఆమోదం పొందాలంటే ప్రతిపక్షం మద్దతు తప్పనిసరి. ఆమె ప్రతిపక్షంతో సహకారం సాధించి, ప్రభుత్వాన్ని స్థిరంగా నడిపిస్తేనే ఆమె నాయకత్వం నిలబడగలదు. తరువాత, ఆర్థిక రంగం ఆమె ముందున్న ప్రధాన సవాలు. సంవత్సరాలుగా జపాన్ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండిపోయింది. ప్రజల నిజమైన అవసరం జీతాలు పెరగడం, జీవన నాణ్యత మెరుగుపడడం. ఆమె ఆ దిశగా మార్గం కనుగొనగలదా అన్నది ఒక ప్రశ్నే కాకుండా ఆమె నాయకత్వాన్ని నిర్ణయించే ఒక ప్రధాన అంశం. చివరగా ఎల్‌డిపిలో అంతర్గత విభేదాలను సద్దుమణిగించడం కూడా తకాయచికి తప్పనిసరిగా మారింది. ఎన్నికల్లో ఓటములు పార్టీ మూలవర్గం నమ్మకాన్ని దెబ్బతీశాయి. జపాన్ ఫస్ట్ అనే వారు తమ స్వరాన్ని పెంచుతున్నారు. వలసలు, భద్రత, సైనిక బలోపేతం వంటి అంశాల్లో తకాయచి కఠిన వైఖరి ఆ వర్గాలకు దోహదపడుతుంది. కానీ ప్రజల్లో ఎల్‌డిపి పట్ల విసుగు తగ్గించాలంటే, ఆమె సమన్వయానికి దోహదపడే మృదుత్వాన్ని చూపించాల్సిందే.

**విదేశాంగ దిశ – వాస్తవికతలో కఠినత్వం:**

దేశీయ సవాళ్లతో పాటు, విదేశాంగ విధానం కూడా తకాయచికి కీలకం కానుంది. ఆమె దృష్టిలో జపాన్ భద్రత అంటే బలమైన సైన్యం, స్పష్టమైన అమెరికా భాగస్వామ్యం, చైనాపై కఠిన వైఖరి. అమెరికాతో సంబంధాల పరంగా, ఆమె వాస్తవికతను కొనసాగించవచ్చు. కానీ మళ్లీ అధికారంలోకి వచ్చిన డొనాల్డ్ ట్రంప్ పాలన ఆమెకు కొత్త తలనొప్పిగా మారవచ్చు. ట్రంప్ జపాన్‌ను అధిక రక్షణ ఖర్చులు భరించాలని కోరుతున్నారు. జిడిపిలో 3.5% వరకు పెంచాలని ఆయన డిమాండ్.

**విదేశీ వ్యవహారాలు:**

ఆసియా పొరుగు దేశాలతో సంబంధాలు కూడా కొత్త దిశలో కదలవచ్చు. చైనా, దక్షిణ కొరియాతో తకాయచి వైఖరి కఠినంగా ఉండే అవకాశం ఉంది. అబే తరహా జాతీయవాదానికి ఆమె మద్దతు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 9లో మార్పు సూచనలు, యాసుకుని మందిర సందర్శన వంటి చర్యలు ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచవచ్చు. అయినప్పటికీ, చైనా జపాన్ ప్రధాన వ్యాపార భాగస్వామి కావడం వల్ల, తకాయచి తన మాటల్లో కొంత మృదుత్వాన్ని చూపించే అవకాశం ఉంది. ఆమె భారతదేశం, ఆస్ట్రేలియా వంటి దేశాలతో సన్నిహిత బంధాలను పెంచి, క్వాడ కూటమిలో జపాన్ పాత్రను బలపరచాలనుకుంటున్నారు.

ముగింపులో చెప్పాలంటే, సనే తకాయచి అధికారంలోకి రావడం ఒక రాజకీయ అనివార్యత. ఇది పాత సంప్రదాయవాద దృక్పథానికి కొత్త చరిత్రాత్మక మైలురాయిగా మారింది. లిబరల్ డెమోక్రటిక్ పార్టీ తన మూలవర్గాన్ని కాపాడుకునే ప్రయత్నంలో ఉంది. కానీ అదే సమయంలో ఒక మహిళా నాయకురాలిని ప్రోత్సహించడం జపాన్ రాజకీయ మార్పుకు సంకేతమూ కావచ్చు.

**తకాయచి ముందు ఉన్న పరీక్షలు కఠినమైనవే:** ప్రతిపక్షంతో సఖ్యత, ఆర్థిక స్థిరత్వం, విదేశాంగ సమతుల్యత. ఈ పరీక్షల ఫలితమే ఆమెను జపాన్ ఐరన్ లేడీగా నిలబెడుతుందా లేదా మరో తాత్కాలిక ప్రధానిగా చరిత్రలో మిగిలిపోతుందా అన్నది నిర్ణయిస్తుంది. జపాన్ యుద్ధానంతర రాజకీయ స్థిరత్వం ముగిసిన తర్వాత, ఇప్పుడు ప్రారంభమవుతున్న ఈ కొత్త అధ్యాయం ఎంత దూరం వెళ్తుందో చూడాలి.

**జనక మోహన రావు దుంగ**
8247045230

## శిక్షణ పొంది, నిబంధనల ప్రకారం పని చేయాలి

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు పట్టణంలో ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో పెబ్బేరు మండల ఎంపీడీఓ రోజా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంపీటీసీ , జడ్పీటీసీ ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని వనపర్తి ఆర్డీఓ సుబ్రహ్మణ్యం సందర్శించి పిఓ, ఏపిఓలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికలను ప్రజాస్వామ్య విధంగా, సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంలో పిఓలు, ఏపిఓల పాత్ర ముఖ్యమని, ప్రతి ఒక్కరు శిక్షణ కార్యక్రమంలో అన్ని అంశాలను తెలుసుకొని ఎన్నికల కోసం సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల తహసీల్దార్ మురళీగౌడ్, మండల



విద్యాధికారి జయరాములు, మాస్టర్ ట్రైనర్లు కె.చంద్రశేఖర్ రెడ్డి, బి.రవికుమార్, డి.చిన్నరాములు, ఎల్ల స్వామి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, వివిధ డిపార్ట్మెంట్ల అధికారులు పాల్గొన్నారు.

## తాగునీటికోసం రాస్తారోకో

**ప్రజాపక్షం/అచ్చంపేట :** శ్రీశైలం పక్కనే ఉన్న తాగునీటివనరులేక ఖాళీ బిందెలతో జాతీయరహదారిని సోమవారం దిగ్బంధం చేశారు. హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై వటువర్లపల్లి గ్రామం కలదు. ఈగ్రామంలో గ్రామపంచాయతీ అధికారులులేనందున తాగునీటికి తీవ్ర ఇబ్బందులై సమీపంలోని రాశులోని బావినుండి నీరు తీసుకొచ్చేవారు. ఇటీవల అటవీశాఖ అధికారులు రానివ్వకపోవడంతో గ్రామస్తులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. సంబంధిత అధికారులు, ఎమ్మెల్యేకు పలుమార్లు ఫిర్యాదు చేసిన



పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

## ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ



**ప్రజాపక్షం/మక్తల్ :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణ పై పోలింగ్ అధికార్లకు శిక్షణ ఇచ్చారు. మక్తల్ పట్టణంలోని బాలుర పాఠశాలలో సోమవారం ఎంపిడివో ఎంఈఓ ఆధ్వర్యంలో దాదాపు 160 మందికి ఎన్నికల నియమావళి ప్రకారం విధులు నిర్వహించే విధానం పై పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఎంపిటిసిలు, జడ్పిటిసిలకు పార్టీ గుర్తులపై ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నికలకు ప్రైవేట్ గుర్తులు ఉంటాయని ఆ గుర్తులతో పోలింగ్ ఉంటుందని తెలిపారు. వీటి నిర్వహణపై ఎన్నికల నిబంధనల ప్రకారం. కఠినమైన నిబంధనలతో విధులు నిర్వహించాలరని సూచించారు. సర్పంచ్ ఎన్నికలైయితే మధ్యాహ్నా వరకు పోలింగ్ ఉంటుందని తర్వాత కౌంటింగ్ ఉంటుందన్నారు. ఎంపిటిసి, జడ్పిటిసి కౌంటింగ్ ప్రభుత్వ ఎన్నికల అధికారులు చెప్పిన దాని ప్రకారం ఉంటుందని తెలిపారు.

## ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి




డీఎస్పీ ఎస్. లింగయ్య


**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా సోమవారం నారాయణపేట డీఎస్పీ కార్యాలయంలో డిఎస్పీ నల్లపు లింగయ్య జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ముగ్గురు అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదుల పై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం అందే విధంగా చూడడం జరుగుతోందని డిఎస్పీ తెలిపారు. పోలీస్ స్టేషన్‌కి, పై ఆఫీసులకి వచ్చే ఫిర్యాదుదారులు మధ్యవర్తులని తీసుకురావద్దని బాధితులు మాత్రమే నేరుగా వచ్చి ఫిర్యాదుకు సంబంధించిన విషయాలు తెలపాలని డీఎస్పీ తెలిపారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయున్ని సన్మానించిన మండల విద్యాశాఖ




**ప్రజాపక్షం/ కృష్ణ :** కృష్ణ మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ కృష్ణ పాఠశాలలో జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కున్సి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నరసింహను మండల విద్యాధికారి నిజాముద్దీన్, కాంప్లెక్స్ అధికారులు గణేష్ సింగ్, కిషోర్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి.విజయలక్ష్మి, పిఆర్‌టియూ కృష్ణ, మండల కార్యవర్గ సభ్యులు దండు శేఖర్, నల్లే శివరాజ్ యం.ఆర్. అజయ్, అనిల్ పాటిల్, వి.రామకృష్ణ, పి.రాఘవేంద్ర, పి.నరేందర్, నాగభూషణ్, ఈరన్న, శ్రీనివాసులు, అశప్ప, విరుపాక్షప్ప, గంగాధర్, హనుమదాస్, ఉమేశ్వర్, రమేష్, అఖిల్ మోహన్ తదితరులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయులు సిద్ధప్ప, (ఆర్ టీడీ) నరసింహులు, మహ్మద్, ఇస్మాయిల్, మాధవి, ఉష, శోభారాణి, సిఆర్‌పి అమీన్ రెడ్డి పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై శిక్షణ



**ప్రజాపక్షం/అమరచింత :** రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ ఆఫీసర్లు , ఏపిఓలకు సోమవారం అమరచింత మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పి డిప్యూటీ సిఈఓ రామేశ్వర్ హాజరై ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారులకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కు పై ఓటర్లకు అవగాహన ఇచ్చేటట్లు పోలింగ్ ఆఫీసర్లు విధులను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ భాస్కర్ సింగ్, పురపాలక కమిషనర్ సిహెచ్ నాగరాజు, పిఓ, ఏపిఓలు పాల్గొన్నారు.

## బిసిలకు న్యాయం జరగాలి

**ప్రజాపక్షం/జడ్చర్ల:** రాష్ట్రంలో జరుగు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ దామాషా ప్రకారం న్యాయం చేయాలని తెలంగాణ బీసీ జాగృతి సేన నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం నుండి జడ్చర్ల మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో ముఖ్య నాయకుల సమావేశంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్, రజక సంఘము జాతీయ అధ్యక్షులు నడిమింటి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 9 తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ మాధవరెడ్డి హైకోర్టులో వేసిన పిటిషన్ తీర్పు 8 తారీకు వాయిదా ఉండగానే ఈనెల 4 తారీకున సుప్రీంకోర్టులో గోపాల్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టి వేయడాన్ని బీసీ జాగృతి సేన తరపున స్వాగతిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం మెంబర్ జాతీయ అధ్యక్షులు నడిమింటి శ్రీనివాస్, ఫకీర్ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఫకీర్, జహంగీర్ పాషా, బీసీ జాగృతి సేన మండల అధ్యక్షులు గౌడుగు నర్సిములు, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి లింగంపేట్ శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, మండల సహాయ కార్యదర్శి చెన్నయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు భీమ్ రాజు, శివశంకర్, నాగేష్, బొంబాయి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజాపూర్‌లో కలెక్టర్ విస్తృత పర్యటన

### మండల కేంద్రంలో పిహెచ్‌సి, అంగన్‌వాడీ, చౌకధర దుకాణం, జడ్‌పి ఉన్నత పాఠశాల, తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** పిహెచ్‌సి డాక్టర్‌లు వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ రాజాపూర్ మండలంలో విస్తృతంగా పర్యటించి పలు ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేశారు. మండల కేంద్రంలో పిహెచ్‌సి, అంగన్‌వాడీ కేంద్రం, చౌకధర దుకాణం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తహశీల్దార్ కార్యాలయం ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. తొలుత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను తనిఖీ చేశారు. ఓపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిలో రికార్డు లను పరిశీలించారు. వైద్య సిబ్బంది వివరాలు గురించి తెలుసుకున్నారు. ల్యాబ్ టెక్నీషియన్స్ లేరని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు పౌష్టిక ఆహారం అందించాలని ఆదేశించారు. పర్యటనలో భాగంగా చౌకధర దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ను పరిశీలించారు. అక్కడికి వచ్చిన జనాలతో మాట్లాడుతూ బియ్యం ఎలా ఉన్నాయి? మంచిగానే ఉన్నాయని లబ్దిదారులు కలెక్టర్‌కు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ముందుగా పదవతరగతి ఇంగ్లీష్ మీడియం విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు ఏంటి ఇంత తక్కువ మంది ఉన్నారు. మొత్తం విద్యార్థులు హాజరు గురించి తెలుసుకున్నారు. 10వ తరగతిలో విద్యార్థుల సంఖ్య, ఉత్తీర్ణత శాతం ఫలితాలు గురించి అడిగారు. ఈ సంవత్సరం కూడా మంచి ఫలితాలు సాగించాలని, నూరుషాట్ ఉత్తీర్ణత సాధించాలని, అన్నారు. ఏఏ సబ్జెక్టులలో ఇబ్బందిగా ఉందని అడిగారు. గణితశాస్త్రం, భౌతికశాస్త్రం కొంత కఠినంగా ఉన్నాయని తెలిపారు. 10 తరగతి తెలుగు మీడియంలో హిందీ పాఠ్యాంశాలు చదివించారు. తర్వాత తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాహసీల్దార్ కార్యాలయంలో వివిధ పనుల నిమిత్తం ముఖ్యంగా ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలకు ఎక్కువ సంఖ్యలో ప్రజలు రావడం కలెక్టర్ గమనించారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల జారీకి మీరు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటే జారీ చేయడం జరుగుతుందని కార్యాలయం చుట్టు తిరగవలసిన అవసరం లేదని తెలిపారు. రిజిస్ట్రేషన్స్ గురించి తెలుసుకున్నారు. భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను త్వరగా భూ సమస్యలను పరిష్కరించి పెండింగు లేకుండా చూడాలని సూచించారు. తాహసీల్దార్ లాగిన్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆమె ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల అధికారులు ఉన్నారు.

# భవిష్యత్ వైద్యులు బాధ్యతతో నడుచుకోవాలి




మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కొత్తగా చేరిన యంబిబిఎస్ 1వ సంవత్సరం విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల కోసం ఓరియెంటేషన్ కార్యక్రమం అలాగే సీనియర్ విద్యార్థుల కోసం యాంటీ ర్యాగింగ్, మాదక ద్రవ్యాల అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి హాజరై విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు రేపటి సమాజానికి సేవ చేయబోయే వైద్యులు, మీరు ప్రజలకు ఆదర్శంగా ఉండాలి. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహ వాతావరణం, అలవాట్లపై ఎప్పటికప్పుడు దృష్టి ఉంచాలి. మగ విద్యార్థులు బైక్‌పై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించడం తప్పనిసరి.. యువతలో మాదకద్రవ్యాల వాడకం ప్రమాదకరం.. ఒక తప్పు నిర్ణయం జీవితాన్ని చీకటిలోకి నెడుతుంది. ర్యాగింగ్ లేదా డ్రగ్స్ వంటి నేరాలకు దూరంగా ఉండి, మీ లక్ష్యాల వైపు దృఢనిశ్చయంతో సాగండని సూచించారు. ఎస్పీ సీనియర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జూనియర్ విద్యార్థులతో ర్యాగింగ్ చేయడం ఒక తీవ్రమైన నేరం. ఇలాంటి చర్యలు మీ విద్యా భవిష్యత్తు మీద చెడు మచ్చ వేస్తాయి. అలాగే జూనియర్ విద్యార్థులకు సూచిస్తూ సీనియర్‌లతో మాట్లాడేటప్పుడు ఏదైనా డౌట్ ఉంటే కలిసిమెలిసి తెలుసుకోవాలి. ప్రతిదీ ర్యాగింగ్‌గా భావించకుండా స్పోర్టివ్‌గా తీసుకోవాలి. అయితే ఒక వేళ మితిమీరిన ప్రవర్తన ఎదురైనట్లయితే వెంటనే 100 నెంబర్‌కి లేదా కాలేజీ యాంటీ ర్యాగింగ్ కమిటీకి లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే ఎస్పీ విద్యార్థుల భద్రత కోసం పోలీస్ శాఖ, షీటీమ్, ఎహెచ్‌టియు (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్) ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.రమణ, అకాడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డా.కిరణ్మయి, మహబూబ్‌నగర్ రూరల్ సిఐ గాంధీ నాయక్, వుమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఐటీ సెల్ ఇంచార్జి రాఘవేందర్, కాలేజీ ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు, షీటీమ్ ఎహెచ్‌టియు, కళాబృందం సభ్యులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## డిపో మేనేజర్ తీరుపై ధర్నా

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి ఆర్‌టిసి డిపో ముందు ప్రజాసంఘాలు కులసంఘాల నాయకులు బిసిసబ్‌ప్లాన్ తాలుకా అధ్యక్షులు రాజేందర్, గోపాల్, దుర్గాప్రసాద్, నర్సింహ్మ, సిపిఐ పరుషరాం, సిపిఎం నాయకులు ఆంజనేయులు ధర్నా చేపట్టారు. గాయపడిన బాధితురాలికి న్యాయం చేయాలని మాట్లాడటానికి వెళ్లిన నాయకులపట్ల దురుసుగా ప్రవర్తించడంపట్ల నిరసన వ్యక్తం చేశారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన గండోజి సరస్వతి సెప్టెంబర్ 29వతేది సాయంత్రం సంతోష్‌నగర్‌నుండి కల్వకుర్తికి ఆర్‌టిసి బస్సులో ప్రయాణించింది. ఆబస్సు ఆమన్‌గల్ సమీపంలోరాగానే వెనకనుండి వేరే వాహనం ఢీకొనగా బస్సులోని సరస్వతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈవిషయం డిపో మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లగా డిపోలో ఫిర్యాదు చేశారు. కాని వారంరోజుల తర్వాత సోమవారం మాట్లాడటానికి రమ్మని చెప్పి అది ప్రైవేట్ బస్సు మాకు ఆర్‌టిసికి సంబంధం లేదని బుకాయిస్తూ, మీరు ఏమైనా మాట్లాడాలనుకుంటే బస్సు యజమానితో మాట్లాడుకోండి అని డిఎం సుభాషిని సమాధానం చెప్పడం జరిగిందన్నారు. బాధితురాలికి న్యాయం చేయాలని గంటసేపు డిపోముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. న్యాయం జరిగేవరకు కదిలేదిలేదని కూర్చున్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాసంఘాల నాయకులు, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని బిఎస్‌ఎఫ్ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చదువుకుంటున్నటువంటి ఎంతోమంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఈప్రభుత్వం ఫీజుబకాయిలు చెల్లించకపోవడంవలన విద్యకు దూరమై ప్రైవేట్ యాజమాన్యాలకు ఫీజులు కట్టలేక మధ్యలోనే విద్యను మానేసి లారీ డ్రైవర్, బైక్ రిపేర్ వివిధరంగాలలో పని చేస్తున్నారని అన్నారు. మరోవైపు బెస్ట్ అవెలబుల్ పాఠశాలలో కూడా రాష్ట్రప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంవలన ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లితండ్రులకు మాకు ప్రభుత్వం ఫీజులు చెల్లించడంలేదు మీరే కట్టడం లేకపోతే ప్రభుత్వం చెల్లించిన తర్వాత మీపిల్లలని బడికి పంపించడం అని లేఖలు పంపుతున్న పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా కొన్ని ప్రభుత్వ పాఠశాలలో కనీసం తాగునీరు, మూత్రశాలలు కూడా లేవన్నారు. మరికొన్ని ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులపైకప్పు పెచ్చులు ఊడిపోతున్న ఈప్రభుత్వం వాటిపైన చొరవ తీసుకో



వడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం ఈసమస్యలను పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. లేనియెడల అన్ని విద్యార్థిసంఘాలు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో బిఎస్‌ఎఫ్ డివిజన్ అధ్యక్షులు రాంచందర్, బహుజన కళావేదిక జిల్లా అధ్యక్షులు గుడిపల్లి శ్రీకాంత్, నాగరాజు, నాయకులు సురేష్, సిద్ధు, సాయికుమార్, చరణ్ పాల్గొన్నారు.

## రాధాకృష్ణను పరామర్శించిన జర్నలిస్టులు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు, దళిత నాయకుడు రాధాకృష్ణను నాగర్‌కర్నూల్ జర్నలిస్టులు సోమవారం పరామర్శించారు. రాధాకృష్ణతో ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల గుండె సంబంధిత ఆపరేషన్ జరిగింది. రాధాకృష్ణను నాగర్‌కర్నూల్‌లోని ఆయన నివాసంలో సీనియర్ జర్నలిస్టులు అబ్దుల్లాఖాన్, జెమిని సురేష్‌రావు, రాజేష్ గౌడ్, ఖానాపురం ప్రదీప్, మహ్మద్‌సాజిద్, బాలస్వామి, వెంకటేష్, మహ్మద్ సాదిక్, రాజేష్, శేఖర్, రాష్ట్రదళిత నాయకుడు జెట్టిధర్మరాజు ఉన్నారు.



# కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి రూ.25 వేల సహాయం


### రాజ్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన బాధితుడు

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ఆపదలో ఉన్న పేదలకు చేయూతనిచ్చేందుకు తమ ఫౌండేషన్ తినలేని కృషఇ చేస్తుందని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్.కె.రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన కరాటే మాస్టర్ తీగల శ్రీనివాస్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో ఉన్న శ్రీనివాస్ కు మెరుగైన వైద్యానికి గాను రూ. 25 వేలను చెక్కు రూపంలో హైదరాబాదులోని ఫౌండేషన్ కార్యాలయంలో రాజ్ కుమార్ రెడ్డి అందజేశారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం కారణంగా మెరుగైన వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న శ్రీనివాస్ కు రూ. 25 వేలను అందజేసినట్లు తెలిపారు. విద్యా, వైద్యం కారణంగా ఇబ్బందులు పడుతున్న ఎంతో మందికి తమ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తన వైద్యానికి భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్.కె.రాజ్ కుమార్ రెడ్డి, అడిగిన వెంటనే ఆర్థిక సహాయం చేయడం సంతోషంగా ఉందని బాధితుడు తీగల శ్రీనివాస్ తెలిపారు. తనకు ఆర్థిక సహాయం చేసిన రాజ్ కుమార్ రెడ్డికి, ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** మండలంలోని బెక్కరగ్రామానికి చెందిన భాషమోని చిన్నజంగయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. ఈవిషయాన్ని బెక్కర గ్రామ బిఆర్‌ఎస్ పార్టీ నాయకులద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్‌ట్రస్టుచైర్మన్, బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రనాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుడి కుటుంబానికి తక్షన ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్‌పార్టీ జిల్లా నాయకులు, బిఆర్‌ఎస్‌వి అధ్యక్షుడు దారమోని గణేష్, తాజా మాజీ సర్పంచ్ సుశీల ఈశ్వరయ్య, బిఆర్‌ఎస్‌పార్టీ గ్రామ కమిటి అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, బాలస్వామి, సాయిబాబు, బాలరాజు, మల్లేష్, జంగయ్య పాల్గొన్నారు.

## ముగిసిన 55వ తెలంగాణ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బషీర్‌బాగ్ ఎల్‌బి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 55వ తెలంగాణ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ విజయవంతంగా పూర్తయింది. ఈ టోర్నమెంట్‌లో అండర్–7, 9, 11, 13, 15 బాలురు, బాలికలు వేర్వేరుగా పోటీలు జరిగాయి.అండర్ 7 బాలుర పోటాలో ఛాంపియన్‌గా రేయాంశ్ సింఘాల్, రన్నర్ అప్‌గా ఓం ఏష్ గోట్టుముక్కల, 2వ రన్నర్ అప్‌గా బొద్దు రితీష్ నందన్‌లు నిలిచారు. ఇక అండర్ 7 బాలికల పోటీల్లో ఛాంపియన్‌గా రినయారా వర్మ, రన్నర్ అప్‌గా నగ్ర మహాయాణ, 2వ రన్నర్ అప్‌గా జోష్యికా పటేల్‌గా నిలిచారు. అండర్ 9, 11, 13, 15 బాలబాలికల పోటీల్లో జితిన్ యలవర్తి, అక్షజ్ కసమ్నేని, ఇషాన్ సతిరాజు, శారికా టుంకి ,రిషికా జంగా, మునిపల్లి ఆశ్రిత, పెంజర్ల పూజిత్ ఆయాన్ ,కిన్షుక్ వెచ్చ, సాయి సత్విక్ జయంపు ,స్వర దీపక్ ఫస్గే, రోహి శ్రీ మఘం, జొన్న శ్రీ తన్వి, ఆద్రిత్ పడ్డి, అథర్వ్ జాగ్లాన్, రితీష్, ఆసిరెడ్డి సహస్ర, చిద్విలాసిని, నిఖిత వడలి ,చరణ్‌తేజ కె,అనయ్ సారాఫ్, దీపక్ చెన్నుపాటి, యార్రోజు రమ్య, కప్పల ఇంద్ర, మనస్విని తిరువాయపేటలు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు, అడ్వకేట్ టీ.పుణ్యవతి, ఖజాంచి కె.నరసింగరావు, మరియు ఐ.మధుసూదన్ రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

## రెజ్లింగ్, బాక్సింగ్‌లో సత్తా చాటిన తెలంగాణ పోలీసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హర్యానలో జరిగిన 74వ ఆల్ ఇండియా పోలీసు రెజ్లింగ్, బాక్సింగ్ పోటీల్లో తెలంగాణ పోలీసులు సత్తా చాటారు. ఈ పోటీలు హర్యానలోని కర్నల్‌లోని మధుభవన్‌లో గత నెల 20 నుండి 24 వరకు జరిగాయి. ఈ పోటీల్లో తెలంగాణ పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ జట్టు పాల్గొంది. రెజ్లింగ్లో రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఎన్. జెశ్వంత్ కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా అడ్డకల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్మ్ రెజ్లింగ్ క్రీడాకారిణి జి.రాధిక కూడా కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. పతకాలను సాధించిన విజేతలతో పాటు స్పోర్ట్స్ ఐజి ఎం.రమేష్, కోచ్ డిప్యూటీ ఎస్‌పి డాక్టర్ ఆర్.వి .రామారావులను సోమవారం తన కార్యాలయంలో డిజిపి బి.శివధర్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్తులో కూడా జరిగే ఆయా పోటీల్లో తెలంగాణ పోలీసులు మరిన్ని విజయాలు సాధించాలని డిజిపి బి.శివధర్‌రెడ్డి సూచించారు.


## భారత న్యాయవ్యవస్థపై దాడి

### ఐఎఎల్ మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు పరమేశ్

**మహబూబ్‌నగర్ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై కోర్ట్ ఆవరణలో ఒక మతముష్కరుడు న్యాయవాద ముసుగులో సనాతన ధర్మానికి సంబంధించిన వ్యాఖ్యలు చేయడం, వారిపై దాడికి యత్నిచడం అత్యంత హేయమైన చర్య అని ఐఎఎల్ మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు పరమేశ్ గౌడ్ పేర్కొన్నారు. ఇది భారత న్యాయవస్థ పైన దాడిగా అభివర్ణించారు. ఇటువంటి చర్యలను భవిష్యత్తులో జరగకుండా అతనిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారత రాజ్యాంగ మూల సూత్రాల ఆధారంగా న్యాయవస్థ పని చేస్తుందని, కానీ ఆర్ఎస్ఎస్ ముసుగులో భారత న్యాయ వ్యవస్థ పని చేయాలని సంకల్పంతోనే ఈ దాడి జరిగిందని స్పష్టంగా కనబడుతుందని విమర్శించారు. కేంద్రంలో ఉన్న బిజెపి సర్కార్ ఈ దాడిపై ఎటువంటి చర్యలు తీసుకుంటుందని ప్రశ్నించారు. తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కోర్టులపై దాడికి సంబంధించి బిజెపి విధానం ఏమిటో చెప్పాలన్నారు. ఇలాంటి దాడులను దేశంలోని అన్ని వర్గాల ప్రజలు, మేధావులు ప్రొఫెసర్లు, న్యాయవాదులు ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## విజయవంతమైన ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం/మక్తల్ :** లయన్స్ క్లబ్ మక్తల్ బీమా ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యాంజనేయులు తెలిపారు. డిస్టిక్ విజన్ చైర్మన్ అనుగొండ శ్రీనివాసులు, పాలమూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రి సహకారంతో దాదాపు 60 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు అవసరమైన 30



మందిని పాలమూరు కంటి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ మక్తల్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు వేలాదిమంది కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించామని అన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరంతో పాటు ఇతర అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ అంజన్ ప్రసాద్, కోశాధికారి ఆడెం సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ మామిళ్ళ పృథ్వీరాజ్, సీనియర్ సభ్యులు డివి చారి, అంబాదాస్ రావు, కట్టా వెంకటేష్, మఠం వాదిరాజ్, కంటి వైద్య నిపుణులు జ్యోతి, సిబ్బంది ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచండి



**ప్రజాపక్షం/యాదాద్రి** : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం రాజాపేట మండలం రేణికుంట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని. అవి ఏఏ దశలలో ఇండ్ల పనులు పూర్తి కావచ్చాయని పరిశీలించారు. లబ్ధిదారులు అందరూ వేగంగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు.

## నేర నియంత్రణలో సిసి కెమెరాలు కీలకం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నేరాల నియంత్రణకు, ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతో ముఖ్యమని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి పేర్కొన్నారు.మండలోని నర్సింగ్ భట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను డిఎస్‌పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వందమందికి సమానం అని నేరాలను తగ్గించడంలో సీసీ కెమెరాలు చాలా కీలకం అన్నారు.నిందితుల గుర్తింపులో, దర్యాప్తులో సిసి కెమెరాల ప్రాముఖ్యత ఎంతో కీలకమైంది అన్నారు.ప్రతి ఇల్లు, దుకాణం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో సీఐ రాఘవరావు, ఎస్సై సైదా బాబు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్య, కానిస్టేబుల్ తిరుమలేష్, జెల్ల కోటిలింగం పాల్గొన్నారు.



## కార్మికురాలిని పరామర్శించిన ఎమ్మెల్సీ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి నల్లగొండ ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న హాస్పిటల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు పి. ఎల్లమ్మను సోమవారం ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పరామర్శించి ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకోవడం జరిగింది. బుధవారం డ్యూటీ కోసం తన ఇంటి కాడ నుంచి హాస్పిటల్ కి వస్తుండగా ప్రమాదం జరిగిందని ఆ ప్రమాదంలో గాయాలైనవి అని అన్నారు. హాస్పిటల్ సూపరిండెంట్ తో మాట్లాడి ఆమె యోగక్షేమాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ,హాస్పిటల్ సూపరెండెంట్ అరుణకుమారి డిప్యూటీ సూపరింటెండెంట్ నగేష్, బరిగల వెంకటేష్ పాల్గొన్నారు.

## ఉమ్మడి నల్లగొండ జిల్లా బాక్సింగ్ సెలక్షన్స్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఎస్‌జిఎఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా బాక్సింగ్ సెలక్షన్స్‌ను పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో గల బాక్సింగ్ కోచింగ్ సెంటర్‌లో అండర్14, 17 బాలబాలికల సెలక్షన్స్‌ను ఎంఈవో బాలునాయక్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని కోరారు. గెలుపు ఓటమిలు సహజమని సెలక్ట్ కాకపోతే కుంగిపోకుండా మళ్లీ మళ్లీ ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దగ్గుపాటి విమల, నియోజకవర్గ కన్వీనర్ శోభారాణి, సీనియర్ ఉపాధ్యాయులు నామిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పంగా సైదులు, బాల్తి వెంకటరత్నం, షమీమ్ అక్తర్, నాగలక్ష్మి , రవీందర్, సురేందర్‌రెడ్డి, సావిత్రి, జనార్ధన్‌రెడ్డి, అష్రఫ్ అహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఛీటింగ్ కేసులో కోర్టుకు హాజరుకాని నిందితుడు అరెస్టు..



**ప్రజాపక్షం/నందికొండ:** గత 2022లో ఆంధ్రాకు చెందిన ఐదుగురు సభ్యుల గల ముఠా నందికొండ మూనిసిపాలిటీలో ఇత్తడిని పుత్తడిగా చూపి స్థానికంగా ఉన్న అమాయకులను మోసం చేసి అమ్ముతుండగా వారిని స్థానిక పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరపరిచారు. వారు ఒకటి రెండు సందర్భాలు మినహా కొద్ది సంవత్సరాలుగా కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరగటం పట్ల నిడమనూరు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు వారికి నాన్ బైలబుల్ వారంటూ జారీ చేయడంతో స్థానిక ఎస్సై ముత్తయ్య ఆధ్వర్యంలో స్థానిక పోలీసు బృందం అందులో ముగ్గురిని గత వారం అరెస్టు చేయగా ఏ1 నిందితుడు తీర్ధాల నాగేశ్వరరావు రెంటచింతల గ్రామంలో ఉన్నాడన్న సమాచారంతో అతడిని సోమవారం అక్కడ చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేశారు. నిడమనూరు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ముందు హాజరపరచగా నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. మొత్తం ఐదుగురు నిందితులలో నలుగురిని అరెస్టు చేయడం జరిగిందని మరొక నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

## భగవాన్ రెడ్డి ఆశయాలను సాధించాలి



**ప్రజాపక్షం/మునుగోడు**: సిపిఐ మాజీ మండల కార్యదర్శి భగవాన్ రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ సీనియర్ నాయకులు బొమ్మరబోయిన లాలు బండమీది యాదయ్య లు అన్నారు. సిపిఐ మాజీ మండల కార్యదర్శి గంట్ల భగవాన్ రెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా మండలంలోని సిపిఐ చల్మెడ గ్రామ శాఖ ఆధ్వర్యంలో భగవాన్ రెడ్డి స్మారక స్థూపానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలోశాఖ కార్యదర్శి నందిపాటి అశోక్ కుమార్, సహాయ కార్యదర్శులు పగిళ్ల యాదయ్య, శ్రీపతి గాలయ్య, గంగాదేవి గాలయ్య, కార్యవర్గ సభ్యులు గంట్ల వెంకటరెడ్డి,నెల్లికంటి యాదయ్య,గుండెబోయిన వెంకటయ్య, బండమీది జాను,ఉప్పర బోయిన సూరిబాబు, కర్నాటి రాములు,గాదెపాక పెద్ద సైదులు,చాపల లింగయ్య,ఉప్పరబోయినా సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/నందికొండ:** ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నందికొండ మున్సిపాలిటీలోని స్థానిక హిల్ కాలనీలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం హిల్ కాలనీకి చెందిన వెంకట కృష్ణారెడ్డి (58) ఆదివారం రాత్రి భోజనం చేసి తన ఇంటి ముందు వాకింగ్ చేస్తూ ఉండగా హిల్కాలనీకే చెందిన షేక్ నాహీద్ తన ద్విచక్ర వాహనంపై బస్టాండ్ నుండి ఇంటికి వెళుతుండగా వాకింగ్ చేస్తున్న వెంకట కృష్ణారెడ్డిని బలంగా ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడని స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం హుటాహుటిన స్థానిక ఏరియా కమలానెహ్రు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన అన్నారు. కాలనీలో యువకుల రాష్ డ్రైవింగ్ ఎక్కువైపోయిందని ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితని స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు రాష్ డ్రైవింగ్ పట్ల పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పక్కదారి...

# 8 మంది నిందితుల అరెస్టు

### రూ.7లక్షల 30వేలు స్వాధీనం : జిల్లా ఎస్‌పి కె నరసింహా వెల్లడి





**ప్రజాపక్షం/సూర్యాపేట** : సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు కాకుండా కొంతమంది అక్రమార్కులు పక్కదారి పట్టించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరి చేసిన చెక్కులను వారికి చేరకుండా అదే ఇంటి పేరుతోపాటు అదే పేరు గల వ్యక్తుల ద్వారా అడ్డదారిలో నగదుగా మార్చిన 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం రూ. 34లక్షల 58వేల 400 విలువ గల 51 చెక్కులు కాగా 7 చెక్కుల ద్వారా రూ.7లక్షల 30వేల నగదును డ్రా చేయగా మిగతా 44 చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి కె నరసింహా సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. మేళ్ళచెర్వు మండలంలోని రామాపురానికి చెందిన బెల్లంకొండ వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పక్షవాతం బారినపడి వైద్యం చేయించుకోగా అయిన ఖర్చును సిఎం రిలీఫ్ ఫండ్ కోసం నాటి హుజూర్‌నగర్ శాసనసభ్యులు శానంపూడి సైదిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దానికి సంబంధించిన డబ్బులు కొన్ని నెలల వరకు రాకపోవడంతో వాటి కోసం ఎదురు చూస్తున్న సమయంలో అతని సెల్‌కు రూ. 2 లక్షల 25 వేలు మంజూరైనట్లు ప్రభుత్వం నుండి మెసెజ్ వచ్చింది. చెక్కు కోసం క్యాంప్ కార్యాలయం చుట్టూ తిరిగిన రాలేదంటూ అక్కడున్న వారు చెప్పడంతో చివరకు హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లోని సిఎం రిలీఫ్ ఫండ్ విభాగానికి వెళ్ళి ఆరా తీయగా చెక్కు మంజూరి కావడంతోపాటు బ్యాంక్‌లో డ్రా అయినట్లు కూడా అక్కడున్న అధికారులు చెప్పడంతో ఒక్కసారిగా కంగుతిన్నాడు. ఇటీవల కాలంలో కోదాడ నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వ్యక్తిగత పిఏ మధుతోపాటు మరికొంతమంది ముఠాగా కలిసి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పక్కదారి పట్టించి డ్రా చేసిన విషయం బయటపడింది. తన చెక్కు కూడా ఇలానే డ్రా చేసుకున్నారనే అనుమానంతో మేళ్ళచెర్వు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా అనేక అక్రమాలు వెలుగు చూశాయి. మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేసిన నేరేడుచర్ల మండలంలోని సోమారం గ్రామానికి చెందిన పెండెం వెంకటేశ్వర్లు, ప్రైవేట్ పిఏ గా పనిచేసిన హుజూర్‌నగర్ ఎన్‌జిఓ కాలనీకి చెందిన పులిదిండి ఓంకార్ సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులకు సంబంధించి పర్యవేక్షిస్తున్నారు. లబ్ధిదారులకు మంజూరైన డబ్బులను నేరపూరితంగా వాటిని కాజేయాలనే దురుద్దేశంతో కొన్ని చెక్కులను పక్కకు పెట్టి ఆ చెక్కులపై ఇంటి పేర్లు, పేర్లు ఉన్న వారిని చూసుకొని వారి ఖాతాలలో ఆ చెక్కులను జమచేసి డబ్బులు డ్రా చేసి సొమ్మును కాజేశారు. మొత్తం 7 చెక్కులను అనంతగిరి మండలం పాలారం గ్రామానికి చెందిన బెల్లంకొండ వెంకటేశ్వర్లు సహాయంతో చెక్కులపై ఉన్న పేర్లను చూసుకొని బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. మధ్యవర్తిగా ఉన్న వెంకటేశ్వర్లకు కొంత కమీషన్ ఇచ్చి డబ్బులు పంచుకున్నారు. ఇలా మొత్తం 7 చెక్కుల ద్వారా రూ. 7 లక్షల 30 వేలు కాజేశారు. పై ముగ్గురు కాకుండా ఈ కేసులో అనంతగిరి మండలం పాలారం గ్రామానికి చెందిన మాదాసు వెంకటేశ్వర్లు, మట్టపెల్లి సైదులు, బెల్లంకొండ సైదులు, బెల్లంకొండ పద్మ, చిలుకూరు మండలం కట్టుకొమ్ముగూడెంకు చెందిన గొట్టెముక్కుల వెంకటేశ్వర్లు ప్రమేయం ఉన్నట్లుగా పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. వీరి నుండి రూ. 7లక్షల 30వేల నగదుతో పాటు, లబ్ధిదారులకు చెందిన 44 చెక్కులు, 6 బ్యాంక్ పాస్‌బుక్కులు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నింధితులను కోర్టు రిమాండ్‌కు తరలించారు. ఈ చెక్కుల పక్కదారి కేసును త్వరితగతిన చేధించడంలో పర్యవేక్షించిన సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, కోదాడ సిఐ కె ప్రతాప్‌లను, మేళ్ళచెర్వు ఎస్ఐ పి పరమేష్, హెడ్‌కానిస్టేబుల్ జూకూరి నాగేశ్వర్‌రావు, లింగరాజు, కానిస్టేబుల్స్ మాదాసు రామారావు, దిలీప్ కుమార్, పోలోజు రామకృష్ణచారి, నర్సింహా రావులను ఎస్‌పి అభినందిస్తూ రివార్డులను అందించారు.

## త్వరితగతిన అదనపు తరగతి గదుల నిర్మాణం

### త్రిపురారంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/నల్లగొండ (త్రిపురారం):** త్రిపురారంలో ఉన్న తెలంగాణ గిరిజన బాలికల సంక్షేమ మినీ గురుకులాన్ని, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గిరిజన బాలికల సంక్షేమ మినీ గురుకులాన్ని తనిఖీ చేసి సెలవుల తర్వాత పాఠశాలకు వచ్చిన విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వారి పేర్లు, వివరాలు ,ఇష్టం ఉన్న సబ్జెక్టులు ,తదితర అంశాలను ముచ్చటించారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు చెప్పారు. విద్యార్థులు తరగతి గదిలో చదువుకోవడమే కాకుండా అక్కడే నెల పై పడుకుంటున్నారని తెలుసుకుని తక్షణమే 100 పరుపులను నల్లగొండ నుండి పంపిస్తానని కలెక్టర్ చెప్పారు. మినీ గురుకులంలో నిర్మాణంలో ఉన్న ఆదనపు తరగతి గదులను ఆమె తనిఖీ చేశారు. సాధ్యమైనంత త్వరగా అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. మినీ గురుకులం గ్రౌండ్ లోతుగా ఉందని, మట్టి కావాలని ప్రిన్సిపల్ భారతి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.అనంతరం జిల్లా కలెక్టర్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడారు. అంతేకాక ఫార్మసీలో స్టాక్ లో ఉన్న మందులు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వస్తున్న పేషెంట్లు, వారికి అందిస్తున్న చికిత్స, రిజిస్టర్లు, రిపోర్టులు తదితర వివరాలను పరిశీలించారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్ ,మినీ గురుకులం ప్రిన్సిపల్ భారతి, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్, తహసిల్దార్ ప్రమీల ,ఎంపీడీవో విజయలక్ష్మి, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



## దళితులంతా ఏకమవ్వాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** అంబేద్కర్ ఆశయా లను పరిపూర్ణం చేసేందుకు దళిత కులాల ఆత్మీయ సమ్మేళనాన్ని, అంబేద్కర్ వారసుల అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని త్వరలో నిర్వహిస్తున్నామని దళిత సంఘాల ప్రతినిధులు తెలిపారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ భవన్లో మహనీయుల ఆశయ సాధన సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పలు అంబేద్కర్ సంఘాల ప్రతినిధుల, దళిత ఉద్యమకారుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ ఉద్యమాలని దళిత సంక్షేమాన్ని కార్యక్రమాలను ముందుకు తీసుకుపోయేందుకు, దళిత కులాలకు జరుగుతున్న నష్టాలను నివారించేందుకు అందరూ ఏకం కావలసిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. దళితులంతా ఏకమైమన హక్కులను సాధించుకోవాలని అందుకు ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మాస్ రాష్ట్ర కన్వీనర్ పెరిక కరణ్ జయరాజ్, గౌరవ అధ్యక్షులు కత్తుల షణ్ముఖ కుమార్, సీనియర్ అడ్వకేట్ సలహాదారుడు ఎండి నజీర్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, మాల మహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ మెంబర్ గోలి సైదులు, మాస్ జిల్లా అధ్యక్షులు కత్తుల జగన్ కుమార్ పాల్గొన్నారు

## ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎలక్షన్

### యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** రాష్ట్రంలో త్వరలో జరిగే జడ్పీటిసి, యంపిటిసి, 2025, రెండవ సాధారణ ఎన్నికలపై తుర్కపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నీ పర్యవేక్షించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎలక్షన్ నిర్వహించాలని ఆయన అధికారులకు తగు సూచనలు చేశారు.మండల ప్రత్యేక అధికారి పి.జానయ్య, ఎంపీడీఓ లెంకల గీతా రెడ్డి, తహశీల్దార్ గుగులోత్ దేశ్య, ఎంపీవో డి. వెంకటేశ్వర్లు, మండలం ఎలక్షన్ ట్రైనర్స్, అశోక్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

**అధికారులు సమర్ధవంతంగా ఎన్నికలు పూర్తి చేయాలి : అదనపు కలెక్టర్**




**ప్రజాపక్షం/ భూదాన్ పోచంపల్లి :** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు అధికారులు కీలకంగా పనిచేసే సమర్థవంతంగా బాధ్యతతో ఎన్నికలు పూర్తి చేయాలని భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం, ఎంపీడీవో భాస్కర్ ఆధ్వర్యంలో రెండవ సాధారణ ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమం జరిగే విధానము పరిశీలించి సూచనలు సలహాలతో పాటు ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి భాస్కర్, తహసిల్దారు శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.



## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని మోటకొండూర్ ఎంపిడిఓ ఇందిర అన్నారు. ఆమే సోమవారం మోటకొండూర్ మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంటిసి, జడ్పిటిసి ఎన్నికల నిర్వహణపై ఏర్పాటు చేసిన ప్రోగ్రాం అధికారుల శిక్షణ కార్యక్రమంలో పాల్గోని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రిసైడింగ్ అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలలో జరుగుతున్న పరిస్థితులపై ఉన్నతాధికారులకు సమాచారం అందివ్వాలని అన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు సలహాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు హేమంత్ కుమార్, శ్రావణ్, ఎంపిఓ చంద్రశేఖర్, పోలింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## చీఫ్ జస్టిస్‌పై దాడి పట్ల ఖండన

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరద్‌నాయక్ అన్నారు. సోమవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేకపోతే న్యాయం ఎక్కడ ఉంటుందని చెప్పారు. న్యాయం చెప్పే న్యాయమూర్తిపైనే దాడికి పాల్పడితే చట్టాలను ఎవరు రక్షిస్తారని, న్యాయం ఎవరు చెప్పాలని ప్రశ్నించారు. అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో దాడికి యత్నించడాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. సమావేశంలో గోపి, సైదా, మక్లా, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులు ఎన్నికల నియమావళి పాటించాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** రాచకొండ పోలీస్ కమిషనర్ సూచనల మేరకు, రానున్న స్థానిక సంస్థల, గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పిటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి కమాన్ గజ్వేల్, భువనగిరి ప్రధాన రహదారి వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని స్థానిక ఎస్సై తక్యుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ఎవరైనా సరైన పత్రాలు లేకుండా 50వేల రూపాయల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లడం అనుమతించబడదని అన్నారు. వాహనాల్లో అక్రమ మద్యం కలిగి ఉండటం, ఉచిత వస్తువులను పంపిణీ చేయడం లాంటి వాటిని అనుమతించబోమని తెలిపారు.ఏదైనా ఎన్నికల నియమ నిబంధనలు ఉల్లంఘనలు జరిగినట్లైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## బెస్ట్ అవైలబుల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎస్‌సి,ఎస్‌టివిద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదు ట విద్యార్థులు, తల్లిదండ్రులు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేసి, విద్యార్థులను తిరిగి ప్రైవేట్ స్కూల్స్‌లో చేర్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 20,038 స్కూల్స్‌లో 23 వేలమంది ఎస్‌సి విద్యార్థులు, 7 వేలమంది ఎస్‌టి విద్యార్థులు బకాయిలు చెల్లించకపోవడంతో స్కూల్ యాజమా న్యం వారిని బయటకు పంపిందని తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ కి వినతిపత్రం సమర్పించగా, ఆయన ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంతో మీటింగ్ ఏర్పా టు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ నాయకులు కార్తీక్, మామిడి జగన్, స్వామి, గాదె నర్సింహ, శోభన్, పేరుమల్ల సాహితి, అరుణ, రాజేశ్వరి, లక్ష్మి, సోమని, శ్యామ్, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# క్రీడ

## మిథాలీ రాజ్, రవి కల్పనలకు ఏసిఏ ప్రత్యేక గౌరవం

వీరి పేర్లతో వైజాగ్ స్టేడియంలో స్టాండ్!



భారత మహిళల క్రికెట్‌కు వన్నె తెచ్చిన మిథాలీ రాజ్‌కు అరుదైన గౌరవం లభించింది. క్రికెట్‌గా చెరగని ముద్రవేసిన ఈ వెటరన్ ప్లేయర్ పేరును స్టాండ్‌కు పెట్టాలని ఆంధ్ర క్రికెట్ సంఘం నిర్ణయించింది. విశాఖపట్టణం స్టేడియంలో అక్టోబర్ 12 భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్ సమయంలోనే మిథాలీ స్టాండ్ ప్రారంభించాలని ఏసీఏ తీర్మానించింది. ఆమెతో పాటు దిగ్గజ క్రికెటర్ రవి కల్పన పేరుతో కూడా ఒక స్టాండ్‌ను ఓపెన్ చేయనున్నట్టు ఏసీఏ తెలిపింది. 'భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన మిథాలీ రాజ్, రవి కల్పనలకు గౌరవం కల్పిస్తోంది. తమ ఆటతో భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచిన ఈ ఇద్దరి పేర్లతో స్టాండ్లను ప్రారంభించాలనుకుంటున్నాం' అని ఏసీఏ ఒక ప్రకటనలో పేర్కొంది. మహిళల క్రికెట్‌లో మిథాలీ ఒక లెజెండ్ బ్యాటర్‌గా, సారథిగా టీమిండియాపై చెరగని ముద్ర వేసింది తను. చెక్కుచెదరని ముద్ర వేసింది తను. 1999లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మిథాలీ.. 6 వేల పరుగులు సాధించిన తొలి బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పింది. రన్ మెషీన్‌గా పలు రికార్డులు బద్దలు కొట్టి 23 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు 2022 జూన్ 8న తెరదీస్ వీడ్కోలు పలికింది వెటరన్. కల్పన విషయానికొస్తే.. ఆంధ్రప్రదేశ్ నుంచి వికెట్ కీపర్‌గా 2015లో తొలి మ్యాచ్ ఆడింది. తను కూడా 2022లోనే రిటైర్మెంట్ ప్రకటించింది. మహిళల ప్రపంచ కప్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తున్న సందర్భాన్ని ప్రత్యేకంగా మలచాలనుకున్న ఏసీఏ ఈ ఇద్దరి పేర్లను వైజాగ్ స్టేడియం పెవిలియన్‌కు పెట్టాలనే కీలక నిర్ణయం తీసుకుంది.



## శతకంతో రెచ్చిపోయిన బ్రిట్స్..

## న్యూజిలాండ్‌పై సఫారీల గెలుపు

మహిళల వన్డే వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికా ఘనంగా బోణీ కొట్టింది. తొలిపోరులో ఇంగ్లాండ్‌పై 69కే ఆలౌట్ అయిన ఆ జట్టు న్యూజిలాండ్‌ను చిత్తుగా ఓడించింది. తంజిమ్ బ్రిట్స్ (101) విధ్వంసక సెంచరీతో చెలరేగగా.. సునే లస్(83 నాటౌట్) విలువైన ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించారు. బ్రిట్స్ జెట్ బ్యాట్స్ స్వల్ప వ్యవధిలోనే రెండు వికెట్లు పడినా.. ప్రత్యర్థికి లస్ అవకాశం ఇవ్వలేదు. సినాలో జఫ్తా(6 నాటౌట్) అండగా సునే చివరిదాకా పోరాడటంతో 6 వికెట్ల తేడాతో విజయ దుందుభి మోగించింది. అన్ని విభాగాల్లోనూ తేలి పోయిన వైట్ ఫెరన్స్ వరుసగా రెండో ఓటమి మూటగట్టుకుంది. వరల్డ్ కప్‌ను ఓటమితో మొదలెట్టిన దక్షిణాఫ్రికా ఫీనిక్స్ పక్షిలా దూసుకొచ్చింది. తొలి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ బౌలర్ల ధాటికి 69కే కుప్పకూలిన ఆ జట్టు సంచలన ఆటతో న్యూజిలాండ్‌ను బెంబేలెత్తించింది. మొదట కివీస్‌ను భారీ స్కోర్ చేయకుండా బౌలర్లు అడ్డుకుంటే.. తన విధ్వంసక ఆటతో లక్ష్యాన్ని కరిగించింది తంజిమ్ బ్రిట్స్(101). వైట్ ఫెరన్స్ నిర్దేశించిన 232 పరుగుల ఛేదనలో ఈ ఓపెనర్ రెచ్చిపోయి ఆడింది. ఓపెనర్ లారా వొల్వార్ట్ (14) నిరాశపరిచినా.. తంజిమ్ మాత్రం అపరకాళిలా చెలరేగిపోయింది. కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగిన తను బౌండరీల మోతతో అలరిస్తూ స్కోర్ బోర్డును ఉరికించింది. సునే లస్(83 నాటౌట్)తో సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పింది.. న్యూజిలాండ్ ఆశలపై నీళ్లు చల్లింది. ఈ క్రమంలో తన కెరీర్‌లో ఉత్తమ ఇన్నింగ్స్ ఆడిన తంజిమ్ 87 బంతుల్లోనే సెంచరీ చేసేసింది. అంతే.. వన్డేల్లో ఆమె మూడంకెల స్కోర్ సాధించడం ఇది ఏడవసారి. కాగా ఈ క్యాలెండర్ ఇయర్‌లో ఐదోసారి.

శతకంతో సఫారీల గెలుపు వాకిట నిలిపిన తంజిమ్ చివరకు తహుహు బౌలింగ్‌లో ఔట్ అయింది. అప్పటికి స్కోర్.. 185/2. విజయానికి 47 రన్స్ కావాల్సిన దశలో రెండు వికెట్లు పడ్డాయి. మరిజేన్ కాప్, బాష్ వెనుదిరిగినా.. సునే మాత్రం పట్టువదల్లేదు. కెర్ వేసిన 39వ ఓవర్లో రెండు ఫోర్లు బాదింది. ఆ తర్వాత సినాలో జఫ్తా(6 నాటౌట్) దూకుడుగా ఆడింది. కార్సన్ వేసిన 41వ ఓవర్లో డబుల్స్ తీసిన సునే జట్టుకు 6 వికెట్ల విజయాన్ని కట్టబెట్టింది.

### రెండో వికెట్‌కు 44 రన్స్

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్‌కు మొదటి ఓవర్లోనే పెద్ద షాక్ తగిలింది. మరిజేన్ కాప్, ఓపెనర్ సుజీ బేట్స్ (0)ను గోల్డెన్ డక్‌గా వికెట్ల ముందు దొరకబుచ్చుకుంది. ఆ తర్వాత జార్జియా ప్లిమ్మర్(31), ఆల్‌రౌండర్ అమేలియా కేర్(23)లు ఆచితూచి ఆడి.. రెండో వికెట్‌కు 44 రన్స్ జోడించారు. కానీ..పవర్ ప్లే తర్వాత చోలే ట్రయాన్ బౌలింగ్‌లో అమేలియా ఔట్ అయింది. అనంతరం ప్లిమ్మర్, కెప్టెన్ సోఫీ డివైన్(85) దూకుడుగా ఆడి జట్టు స్కోర్ సెంచరీ దాటించారు. కాసేపటికే ప్లిమ్మర్ వెనుదిరిగిన బ్రూక్ హల్లిడే(45) సాయంతో డివైన్ చెలరేగింది. బౌండరీలతో విరుచుకుపడిన ఈ ద్వయం స్కోర్ బోర్డును పరుగులు పెట్టించింది. దాంతో.. 35 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 164 చేసిన వైట్ ఫెరన్స్ అలవోకగా 270 మార్క్ అందుకుంటుందనిపించింది.

### మలబ మ్యాజిక్..



డివైన్, హల్లిడేల మెరుపులతో భారీ స్కోర్ దిశగా సాగుతున్న న్యూజిలాండ్‌ను మలబ దెబ్బకొట్టింది. మరిజేన్ కాప్ ఓవర్లో ఆమె సూపర్ త్రోతో హల్లిడేను రనౌట్ చేసింది. అప్పటివరకూ 187/3తో పటిష్ట స్థితిలో ఉన్న న్యూజిలాండ్ పతనం మొదలైంది. ఆ తర్వాతి ఓవర్లో డేంజరస్ డివైన్‌ను క్లీన్ బౌల్డ్ చేసింది. అంతే.. అక్కడి నుంచి సఫారీల జోరు కొనసాగగా కివీస్ బ్యాటర్లు తడబడ్డారు. వచ్చినవాళ్లు వచ్చినట్టు డగౌట్ చేరారు. దాంతో.. పూర్తి ఓవర్లు ఆడకుండానే 47.5 ఓవర్లకే వైట్ ఫెరన్స్ ఇన్నింగ్స్ ముగిసింది. డివైన్ వికెట్‌తో పుంజుకున్న దక్షిణాఫ్రికా ప్రత్యర్థిని 231కే ఆలౌట్ చేసింది.

# షోకేస్ | యువతరంగం




అమెరికాలో చదువు... ఉద్యోగం ఇకపై ప్రపంచ దేశాలకు ఎండమావులుగానే మారనున్నాయి. ప్రత్యేకించి భారతీయులే ఎక్కువగా నష్టపోతారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల మేరకు, అమెరికన్ యూనివర్సిటీల్లో విద్యార్థుల ప్రవేశాలు, ప్రత్యేకించి అంతర్జాతీయ విద్యార్థుల ప్రవేశాలను పరిమితం చేస్తారు. ఈ ఉత్తర్వులు, 10 పాయింట్ల మెమో రూపంలో మంత్రిత్వ శాఖల ద్వారా దేశవ్యాప్తంగా ప్రధాన విద్యాసంస్థలకు ఇప్పటికే చేరాయి. యూనివర్సిటీల్లో అంతర్జాతీయ అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులు మొత్తం ప్రవేశాలను గరిష్ఠంగా 15 శాతానికి పరిమితం చేయాలని ఈ ఉత్తర్వులలో కోరారు. ఒకే దేశానికి చెందిన విద్యార్థులు 5 శాతంకంటే ఎక్కువగా ఉండకూడదు. అమెరికన్ లేదా పాశ్చాత్య విలువలను గౌరవించే విద్యార్థులను మాత్రమే ఎంపిక చేయాలి. అమెరికా లేదా మిత్రదేశాలకు వ్యతిరేకత లేదా వ్యతిరేక భావాన్నిచూపే వారి ప్రవేశాలను నిరోధించాలి. విద్యార్థుల ఎంపిక లింగం, జాతి ఆధారంగా జరగకూడదు. మినహాయింపు లేకుండా అందరికీ ఒకే నియమం వర్తించాలి. ట్యూషన్ ఫీజును ఐదేళ్లపాటు స్థిరంగా ఉంచాలి. స్టాండడైజ్డ్ టెస్టులు తప్పనిసరి చేయాలి. వడిపోత క్రమంలో విదేశీ విద్యార్థుల వివరాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీకి తప్పనిసరిగా నివేదించాలి. ఈ ఉత్తర్వుల ద్వారా ఇప్పటికే 2025 ఫాల్ సెమిస్టర్‌లో ప్రవేశించే విదేశీ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయింది. ఇండియాకు చెందిన విద్యార్థుల సంఖ్యలో 50 శాతానికి మించిన తగ్గుదల నమోదైంది. కొన్ని విశ్వవిద్యాలయాలు ఖర్చులు తగ్గించుకోవాల్సి వస్తుందని ప్రకటించాయి. హార్వర్డ్, కొలంబియా, బ్రౌన్ వంటి విశ్వవిద్యాలయాలు హైప్రొఫైల్ కేసుల నేపథ్యంలో భారీగా చెల్లింపులు చేయాల్సి వచ్చింది. కాగా, అమెరికాకు వచ్చే విదేశీ టాలెంట్ ప్రవాహాన్ని ఈ నిర్ణయం తీవ్రంగా ప్రభావితం చేస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యా రంగంలో అంతర్జాతీయ భావజాలానికి, ప్రజాస్వామ్య విలువలకు తీవ్ర విఘాతంగా ఈ నిర్ణయాన్ని పలువురు అభివర్ణిస్తున్నారు. అందుకే, హక్కుల కార్యకర్తలు, విద్యావేత్తలు ఈ నిర్ణయానికి తీవ్ర ఆక్షేపణలు వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల విద్యా స్వేచ్ఛ, అకడమిక్ స్వేచ్ఛకు భంగం కలుగుతుందని భావిస్తున్నారు. ట్రంప్ పరిపాలన మాత్రం అమెరికన్ విద్యార్థులకు చాన్స్ ఇవ్వాలనే సంకల్పంతో, ప్రాధాన్యతా మార్పుల్ని అమెరికా ప్రభుత్వం స్పష్టంగా చెప్పింది. ఈ ఉత్తర్వులు ఇంకా పూర్తిగా అమల్లోకి రానవసరముంటే, కొన్ని విశ్వవిద్యాలయాలు ఫెడరల్ ఫండ్‌ను కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. కొన్ని మార్గాల్లో ఐదేళ్లలో అమెరికన్ విశ్వ విద్యా నికేతనాల్లో విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

## టీనేజ్ సంచలనం శివ!

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేకించి డిజిటల్ విప్లవం అనేగానే అమెరికా లేదా చైనా లేదా ఐరోపా దేశాలు గుర్తుకురావడం సహజం. కానీ, ఇప్పుడు కోట్లాది మంది ఉపయోగిస్తున్న ఇ–మెయిల్‌ను ఓ టీనేజ్ బాలుడు సృష్టించాడనే విషయం చాలా మందికి తెలియకపోవచ్చు. ఎందుకంటే, అతని ప్రతిభకు దక్కా



ల్సిన గుర్తింపు రాలేదు. 1978లో, భారతదేశానికి చెందిన 14 సంవత్సరాల బాలుడు శివ అయ్యదురై ఇ–మెయిల్ వ్యవస్థను సృష్టించాడు. సాధారణంగా పిల్లలు పాఠశాలల్లో లేదాఆటల్లో మునిగిపోయే వయస్సులో, శివ మాత్రం ప్రపంచ సంభాషణను శాశ్వతంగా మార్చే ఆవిష్కరణను రూపొందించడంలో దృష్టి కేంద్రీకరించాడు. అతని ప్రోగ్రామ్ సాదా సందేశాలు పంపడానికే కాకుండా, ఇన్‌బాక్స్, అవుట్‌బాక్స్, డ్రాఫ్ట్, అడ్రస్ బుక్, అటాచ్‌మెంట్స్ వంటి అనేక చారిత్రక ఫీచర్లతో కూడుకొని ఉండేది. మనం ఈ రోజుకు కూడా వీటినే వాడుతున్నాం. ఇంతటి అద్భుత ఆవిష్కరణ చేసినప్పటికీ, భారతదేశంలోనే అతనిని గురించి తెలుసుకున్న వారు చాలా తక్కువ. అతని కృషి చరిత్రలో నీడలో మిగిలిపోగా, ఇతర పేర్లు మాత్రం వెలుగులో నిలుస్తూనే ఉన్నాయి. ఒక జాతిగా మనం ప్రపంచానికి ఇంత గొప్ప సృష్టిని ఇచ్చిన మన సొంత ఆవిష్కర్తలను మెచ్చుకోవడం మరిచిపోతున్నాం. శివ కథ కేవలం సాంకేతికత మాత్రమే కాదు.. భారత మేధావుల ప్రతిభను, వారి కృషిని గుర్తించాల్సిన అవసరాన్ని కూడా చాలా బలంగా ప్రతిఫలిస్తుంది. వయస్సు లేదా భౌగోళికత మేధస్సుకి అవరోధం కాదని శివ నిరూపించాడు. భారతదేశం ఎప్పుడూ భవిష్యత్తును మలిచే కలలు కంటున్నవారికి నిలయంగా ఉండేదీ అని అతని కథ మనకు గుర్తుచేస్తుంది. శివ వంటి మరిచిపోయిన వీరుని కథను గౌరవించాల్సిన, పంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే, అలాంటి వారే యూత్ ఐకాన్స్. యువతకు స్ఫూర్తిదాయకులు.

### ఈ వార్తలో నిజమెంత?

శివ ఇ–మెయిల్ సాంకేతికతను కనుగొన్నాడన్న వార్తలో నిజమెంత? అనే ప్రశ్న చాలా మందిలో వచ్చింది. ఫ్యాక్ట్ చెక్ ప్రకారం, 1974లో, 14 ఏళ్ల వయసు ఉన్న శివ ఇ–మెయిల్ ప్రోగ్రామ్‌ను అభివృద్ధి చేయకముందే, 1971లో రే టామ్లిన్సన్ మెసేజ్‌లు పంపే విధానాన్ని కనుగొన్నాడు. అంతకంటే ముందు, 1960 దశకం చివరిలో అమెరికా పోస్టల్ డిపార్ట్‌మెంట్ మెసేజీలు పంపే విధానాన్ని అమలు చేసింది. కాంపాటిబుల్ టైమ్ షేరింగ్ సిస్టమ్ (సిటిఎస్ఎస్) పేరుతో మాసచూసెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి) ఈ విధానాన్ని అభివృద్ధి చేసింది. అయితే, ఇది కేవలం శాఖాపరమైన సమాచారానికే పరిమితమయ్యేది. కాబట్టి మెసేజీలను పంపే విధానాన్ని అనుగొన్న ఘనత శివకు దక్కదు. అయితే, 'ఇ–మెయిల్' ప్రోగ్రామ్‌ను రాయడమేగాక, దానిపై కాపీరైట్‌ను శివ పొందాడన్నది నిజం. అతను అభివృద్ధి చేసిన విధానంలోనే ఇప్పటికీ ఇ–మెయిల్ విధానం కొనసాగుతున్నదన్నది కూడా వాస్తవమే. కాబట్టి, శివను తక్కువ అంచనా వేయడం తగదు.

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష లను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయాం


సత్యనారాయణ మృతి బాధాకరం

నివాళులర్పించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** సిపిఐ సీనియర్ నాయకులు వల్లపిన్ని సత్యనారాయణ మరణం బాధాకరమని, పార్టీ అభివృదికి అహర్నిశలు శ్రమించే నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయామని వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం కొత్తూరు గ్రామంలో జరిగిన సత్యనారాయణ దశదిన కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేశాడని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడని పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించే నిజాయితీ గల నాయకుడిని వారి ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, సిపిఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్‌కె నాగుల్ మీరా, యలంకి మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, యాస రోశయ్య, గుండెపిన్ని మధు, గార్లపాటి వీరభద్రం, గుడిమెట్ల సీతయ్య, కొండ వీరయ్య, పాలెపు ప్రభాకర్, నిమ్మటూని లచ్చయ్య, పత్తిపాటి మహేష్, రోశారావు, రమణయ్య, సొసైటీ మాజీ ఛైర్మన్ పోలదాసు కృష్ణమూర్తి, కాంగ్రెస్ నాయకులు నున్న కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

## గాలయ్యకు పల్లా, నెల్లికంటి పరామర్శ



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య మాతృమూర్తి బచ్చనగోని శంకరమ్మ(90) సోమవారం అనారోగ్యంతో సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మృతిచెందారు. ఆమె మరణవార్త తెలిసి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంలు గాలయ్యను పరామర్శించారు. శంకరమ్మ పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంకరమ్మ మానవతా విలువలకు ప్రతీకగా, సాదా సీదా జీవనశైలితో జీవనాన్ని గడిపారన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పల్లె శేఖర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, వీర మల్ల యాదయ్య, పొట్ట శంకరయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి పల్లె మల్లారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ముత్యాల అంజయ్య, ఎర్రోళ్ల లింగయ్య, ఎమ్మెల్యే గాలయ్య, శనగల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎస్‌ఎస్ నూరేళ్ళ ఉత్సవాలు హాస్యాస్పదం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శ

**ప్రజాపక్షం/హనుమకొండ :** మత విద్వేష పునాదుల మీద నడుస్తూ హిందూ మతోన్మాదంతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్, ఆర్‌ఎస్‌ఎస్ అధికార కాంక్ష అని వందేళ్ల చరిత్రలో ప్రజల గురించి ఏనాడు పనిచేసిన దాఖలాలు లేవని ఆర్‌ఎస్‌ఎస్ అంటే విభజన, విధ్వంసం, మతోన్మాదం మాత్రమేనని, అలాంటి సంస్థ నూరేళ్ళ ఉత్సవాలు జరుపుకోవడం హాస్యాస్పదమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో హనుమకొండ జిల్లా సిపిఐ సమితి సమావేశం సిరబోయిన కరుణాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ మత విద్వేష పునాదుల మీద నడుస్తూ దేశభక్తి అని చెప్పుకునే ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రధాన మంత్రి కీర్తించడం ఆయన విజ్ఞతకు నిదర్శనమని, 1948లో అప్పటి హోంమంత్రి సర్దార్ వల్లభాయి పటేల్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)ను ఎందుకు నిషేధించడం జరిగిందో ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు చెప్పాలన్నారు. గాంధీని హత్య చేసిన నాథూరాం గాడ్సే ఆర్‌ఎస్‌ఎస్‌లో పనిచేశాడని, హిందు మతోన్మాదంతో ఆర్‌ఎస్‌ఎస్ ముందుకు వెళుతుందని, ఆర్‌ఎస్‌ఎస్ అసలు చరిత్రను ప్రజల ముందు ఉంచాలని, ఆర్‌ఎస్‌ఎస్ అధికారకాంక్ష అని వందేళ్ల చరిత్రలో ప్రజల గురించి ఏనాడు పనిచేసిన దాఖలాలు లేవని ఆర్‌ఎస్‌ఎస్ అంటే విభజన, విధ్వంసం మాత్రమేనని దుయ్యబట్టారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఆనవాళ్లు లేని ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ, ఇప్పుడు దేశభక్తి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. త్యాగాల చరిత్రతో కమ్యూనిస్టులు ముందుకు సాగుతుంటే స్వార్థ చింతనతో ఆర్‌ఎస్‌ఎస్ అధికారమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. కమ్యూనిస్టులు ప్రజలను ఐక్యం చేస్తుంటే ఆర్‌ఎస్‌ఎస్ ప్రజలను విచ్ఛిన్నం చేసే దిశగా ముందుకు సాగుతుందన్నారు. మానవతా సిద్ధాంతం కమ్యూనిజానికి మరణం లేదన్నారు. కమ్యూనిస్టులు ఒక సైద్ధాంతిక నిర్మాణంతో రాజకీయ లక్ష్యం కోసం పనిచేస్తున్నారని కమ్యూనిస్టులు ఉంటేనే ఈ సమాజానికి, ఈ దేశానికి రక్ష అన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, మండ సదాలక్ష్మి, ఎన్ఎ స్టాలిన్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, నకీర్త ఓదేలు, బత్తిని సదానందం, ఏదునూరి వెంకట్రాజం, యేశబోయిన శ్రీనివాస్, జక్కు రాజు గౌడ్, మంచాల రమాదేవి, భాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి, వేల్పుల సారంగపాణి, మాలోత్ శంకర్‌నాయక్, కొట్టే వెంకటేష్, మర్రి శ్రీనివాస్, దీనా, స్వరూప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు

సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి

**ప్రజాపక్షం/రామన్నపేట:** మండల కేంద్రంలో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం సోమవారం రచ్చ యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తులు అవగాహన కార్యక్రమం ఉంటాయన్నారు. సిపిఐ ఎల్లప్పుడు ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక త్యాగాలు చేసిందని, పదవులు కూడా త్యాగం చేసిందన్నారు. ప్రజలు గమనించి సిపిఐ అభ్యర్థులను ఎంపీటీసీలుగా, సర్పంచ్, వార్డు మెంబర్లుగా గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహా, నాయకులు ఎర్ర రమేష్‌గౌడ్, సహాయకార్యదర్శి కల్లెం రామచంద్రం, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, వీరమళ్ల ముత్తయ్య, భగవంతం, గంగాపురం వెంకటయ్య, గాలయ్య, ఉట్కూరి కృష్ణ, కల్లెం జగన్నాధం, శివరాత్రి సమ్మయ్య, పెండెం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## భూ సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ఆలేరు :** అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆలేరు సిపిఐ కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధరణి పోయి భూభారతి వచ్చినప్పటికీ భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు రెవిన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమైందని ఆరోపించారు. రైతులు తమ భూముల సమస్య పరిష్కరించాలని మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. భూసమస్యలను పరిష్కరించి రైతులకు బ్యాంకుల రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు యూరియా కొరత తీర్చడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఆరోపించారు. సమావేశంలో మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, పోతు ప్రవీణ్, తెడ్డు ఆంజనేయులు, దారవోదయ నర్సయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



## పోరాటాలతోనే హక్కుల సాధన

ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ఎల్లా గౌడ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సంఘం బలోపేతానికి సభ్యత్వం కీలకమని, సింగరేణిలో చరిత్ర కలిగిన యూనియన్ ఎఐటియుసి యూనియన్‌కు మెంబర్ షిప్‌ను అధిక సంఖ్యలో చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ కార్మికులను కోరారు. సోమవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికె వన్ ఇంక్లైన్ లో ఏఐటియుసి యూనియన్‌కు మెంబర్‌షిప్‌ను చేసేందుకు ఆయన కార్మికులతో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కార్మికుల హక్కుల సాధన కోసం, సంస్థ పరిరక్షణ కోసం గత ఎనిమిది దశాబ్దాలుగా అనేక మంది యూనియన్ నాయకులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా అనేక పోరాటాలు చేసి కార్మికులకు హక్కులు సాధించి పెట్టడం జరిగిందన్నారు. ఎలాంటి అధికారిక పదవులు లేకున్నా, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న కార్మికుల అండతో పోరాటాలు, సమ్మె లు చేసి హక్కులు సాధించిన చరిత్ర ఎఐటియుసికి ఉందని ఆయన తెలిపారు. సింగరేణిలో ఎఐటియుసి గుర్తింపు సంఘంగా ఏడవ సారి గెలిచిన తరువాత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం యాజమాన్యం తో నిరంతరం చర్చలు జరిపి పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మానాల శ్రీనివాస్, కలవేణి రాజేష్, కొరిమి శ్రావణ్ కుమార్, సమ్మయ్య,నగేష్, వెంకటేష్, ఎర్రగొల్ల చేరాలు, తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ బలోపేతానికి కృషిచేయాలి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా హైదరాబాద్ వచ్చిన సందర్భంగా శనివారం సిపిఐ మెదక్ జిల్లా కార్యదర్శి ఖాలేక్, జాతీయ కార్యదర్శి డి.రాజా, జాతీయ సహాయ కార్యదర్శి నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఖాలేక్ మెదక్ జిల్లా సిపిఐ కార్యదర్శిగా మూడుసార్లు ఎన్నికైనందునా డి.రాజా, నారాయణలు ఖాలేక్‌ను అభినందించారు. మెదక్ జిల్లాలో సిపిఐని బలోపితం చేయాలని జాతీయ నాయకులు సూచించినట్టు ఖాలేక్ తెలిపారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



**ప్రజాపక్షం/తాండూరు:** విశ్వనాథ్‌పూర్ వాగులో గల్లంతైన వ్యక్తి శవం లభ్యమైందని యాలాల ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపారు. యాలాల మండల పరిధి విశ్వనాథ్‌పూర్ గ్రామ శివారులోని కాగ్రవేణి నదిలో ఆదివారం రాత్రి ఒక వ్యక్తి గల్లంతయ్యాడని తెలిపారు. ఇట్టి సమాచారాన్ని అందుకున్న యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి తమ సిబ్బందితో సోమవారం తెల్లవారు జామున గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చేస్తుండగా శవం లభ్యమైనట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి యాలాల మండల కేంద్రానికి చెందిన వ్యక్తిగా తెలుస్తుందని తెలిపారు. అయితే శవాన్ని శవ పరీక్ష నిమిత్తం తాండూరులోని జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు యాలాల పోలీసులు తెలిపారు.



## ఉమ్మడి శామీర్‌పేట మండలానికి కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్నిక

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని మూడుచింతలపల్లి మున్సిపాలిటి, అలియాబాద్ మున్సిపాలిటి, తూంకుంట మున్సిపాలిటిలకు కాంగ్రెస్ అధ్యక్షులను డిసిసి హరివర్ధన్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీకి ఉద్దెమర్రి మాజి సర్పంచ్ దోసకాయల వెంకటేష్, అలియాబాద్ మున్సిపాలిటికి తుంకి రమేష్, తూంకుంట మున్సిపాలిటికి జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డిలను కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమిస్తు డిసిసి ప్రసిడెంట్ హరివర్ధన్‌రెడ్డి నియామక పత్రాలను అధ్యక్షులకు అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియిమితులైన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, తుంకి రమేష్, బీమిడి జైపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ మాపై నమ్మకంతో అధ్యక్ష పదవులు ప్రకటించిన డిసిసి అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుదీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## రైతుల అక్రమ అరెస్ట్‌లు సరికాదు...

### బిఆర్‌ఎస్ అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్

**ప్రజాపక్షం/నవాబుపేట్:** భూమిని నమ్ముకుని బతుకుతున్న రైతులను ఇంటికెళ్లి అరెస్ట్ చేసి తీసుకురావడం సరైంది కాదని వికారాబాద్ జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం నవాబుపేట్ మండల పరిధిలోని చించల్ పేట్, చిట్టిగిద్ద గ్రామాలకు చెందిన రైతులు రీజనల్ రింగ్ రోడ్ పాత అలైన్మెంట్ కాకుండా కొత్త అలైన్మెంట్ మార్పు వల్ల భూమినీ నమ్ముకొని బతుకుతున్న తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని హైదరాబాద్ లోని హెచ్‌ఎండిఏ కార్యాలయం ఎదుట ధర్నాకు సిద్ధమైన మమ్మల్ని నవాబుపేట పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారనీ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వికారాబాద్ జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఘటన స్థలానికి చేరుకొని రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాల నుండి ఎండగట్టి రైతులను కాపాడుకునే దిశగా బిఆర్‌ఎస్ పార్టీ అన్నివిధాలుగా రైతులకు అండగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూమినే నమ్ముకొని బతుకుతున్న రైతులు ఏం నేరం చేశారని వారి ఇండ్లలోకి ఉదయం నాలుగు గంటలకే వెళ్లి అరెస్ట్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే సొంత మండల రైతులను అరెస్ట్ చేస్తే ఆయన ఏం చేస్తున్నారు.? వికారాబాద్ జిల్లా అని చెప్పుకునే స్పీకర్ ప్రసాద్ కుమార్, సీఎం రేవంత్ రెడ్డి రైతులను అరెస్ట్ చేస్తూ మరో లగచర్ల మాదిరిగా మార్చడమేనా అన్నారు. ప్రజాపాలన అంటూనే రైతుల భూములు గుంజుకొని రీజినల్ రింగ్ రోడ్డు తీసుకుపోవడం వలన రైతులకు తీరని అన్యాయం జరుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం చట్టప్రకారం వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ నాగేందర్ గౌడ్, టిఆర్‌ఎస్ పార్టీ గౌరవ అధ్యక్షులు భరత్ రెడ్డి, ముఖ్య సలహాదారులు, వర్కింగ్ ప్రెసిడెంట్, బాధిత రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మూడుచింతలపల్లి మున్సిపాలిటి జగ్గంగూడ గ్రామంలో సోమవారం రేషన్ బియ్యం పట్టుకున్నారు. లింగాపూర్ తండాకు చెందిన దానవత్ రవి ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వం ప్రజలకు రూపాయికి కిలో బియ్యం అందిస్తుండగా అక్రమంగా కొనుగోలుచేసి వాటిని అధిక ధరలకు అమ్ముతుండటంతో శామీర్‌పేట పోలీసులు దానవత్ రవిని పట్టుకుని సుమారు 10 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని పౌరసరఫరాల శాఖకు అప్పగించామని తెలిపారు.

## జిలుకర విష్ణు గుండెపోటుతో మృతి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘం డైరక్టర్ జిలుకర విష్ణు సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. మూడుచింతలపల్లి మున్సిపాలిటి నారాయణపూర్ గ్రామానికి చెందిన జిలుకర విష్ణు సోమవారం తెల్లవారుజామున గుండెనొప్పితో బాధపడుతుండగా గమనించిన కుటుంబీకులు నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు బందువులు తెలిపారు. ఆదివారం తన కూతురు నిశ్చితార్థం జరిగింది. మరుసటి రోజున జిలుకర విష్ణు మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే విష్ణు మృతి చెందడం పట్ల గ్రామస్థులు కన్నీరు మున్నీరుగా విలపించారు. డిసిఎంఎస్ వైస్ చైర్మన్, సొసైటి చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి, ఇతర డైరక్టర్‌లు, గ్రామస్థులు జిలుకర విష్ణు భౌతికకాయానికి ఘనంగా నివాళులర్పించారు.

## ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

### కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు సంతోష రాజు



**ప్రజాపక్షం/బంట్వారం :** ఓట్ చోరికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి అండగా నిలవాలని, వికారాబాద్ జిల్లా మహిళ కాంగ్రెస్ మరియు బంట్వారం మాజీ జెడ్పిటిసి సంతోషరాజు సోమవారం అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఓట్ల చోరికి వ్యతిరేఖంగా వందకు పైగా సంతకాలు సేకరించాలని ప్రతి మహిళ నాయకురాలు తప్పనిసరిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. 18 యేళ్ళు , ఆపై బడిన ప్రతి ఓటరు తమ ఓటు హక్కు పొందిన వారి మా ఓట్లు దొంగతనాన్ని అపండి అని పొందుపరచిన ఫారంలో ఓటు హక్కు కల్గిన వారి పేరు, మొబైల్ నంబర్‌లతో పాటుగా సంతకాన్ని నేరుగా ఓటర్ల నుంచే సేకరించాలన్నారు.

# విద్యార్థి వ్యతిరేక విధానాలు విడనాడాలి

### పరిశోధక విద్యార్థులు, విద్యార్థి సంఘాలు డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగురం విద్యార్థి వ్యతిరేక విధానాలను విడనాడాలని లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని పరిశోధక విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఒయు వైస్ ఛాన్సలర్ తమ సమస్యలు పట్టించుకోకుండా, తమను కలవకుండా నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఒయు పరిశోధక విద్యార్థులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ నరేష్ రెడ్డి, ఒఎస్‌డి జితేంద్ర నాయక్, ఆర్ట్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఖాసింను కలిసి తమ సమస్యలను వినతిపత్రం రూపంలో సమర్పించారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థులు ఎఐఎస్‌ఎఫ్ ఒయు కార్యదర్శి నెల్లి సత్య, ఎస్‌ఎఫ్ఐ ఒయు అధ్యక్షులు కలకోటి ఉదయ్ కుమార్, పిజి విద్యార్థి పాపట్ల నరేష్ మాట్లాడుతూ... తమ సమస్యలపై మందకృష్ణ మాదిగ సానుకూలంగా స్పందించారని చెప్పారు. యూనివర్సిటీ సమస్యలపై విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. 2023 లో 2025 పిహెచ్‌డి అడ్మిషన్ సమస్యలు ముఖ్యంగా రిజర్వేషన్ల, మెరిట్ విషయంలో జరిగిన లోపాలను సరిదిద్దాలని ఉస్మానియా యూనివర్సిటీలో 2023 అకాడమిక్ సంవత్సరంలో కొన్ని పిహెచ్‌డి కోర్సులకు ఫీజులు రూ. 2000 నుంచి 20,000 మరికొన్ని కోర్సులకు రూ.2500 నుంచి రూ.25000 పెంచిన క్రమంలో సంబంధిత విద్యార్థులు నాలుగు నెలలు పాటు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనను తెలిపారన్నారు. ఆ సందర్భంలో పోరాటం చేసిన విద్యార్థులకు మద్దతుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, ప్రస్తుత విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి, ప్రొఫెసర్ కోదండరాం ప్రొఫెసర్ హరగోపాల్, ఎంపి ఈటల రాజేందర్ సైతం స్పందించారని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి గతంలో కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష నేత భట్టి విక్రమార్క ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించారన్నారు. అయినా కూడా ప్రస్తుత విసి ప్రొఫెసర్ కుమార్ మొలగారం గత ఆరు నెలలుగా విద్యార్థులను, విద్యార్థి సంఘాలను కలవకుండా నియంతృతంగా వ్యవహరిస్తూ విద్యార్థులను, విద్యార్థి సంఘాలను కలవకుండా వారి సమస్యలు పరిష్కరించకుండా ఒంటెద్దు పోకడలకు పోతున్నారని వారు వాపోయారు. తక్షణమే విసి తన వైఖరి మార్చుకోకపోతే విసి నియంతృత్వ విధానాల పైన పోరాటం కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. అదేవిధంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ కూడా ఫీజులు తగ్గించకపోవడం పేద విద్యార్థులను పిహెచ్‌డి విద్యకు దూరం చేసే కుట్రే అని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

తక్షణమే పిహెచ్‌డి కోర్స్ ఫీజులు తగ్గించి అదే విధంగా 2025 విద్యా సంవత్సరానికి పిహెచ్‌డి అడ్మిషన్లలో రిజర్వేషన్ల, మెరిట్ విషయంలో జరిగిన లోపాలను సరిదిద్ది విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు.

## పోలీసులు తప్పుచేస్తే శిక్షలు తప్పవు

### ఆకస్మిక పర్యటనలో విసి సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీసు అధికారులు, సిబ్బంది తప్పు చేస్తే చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ స్పష్టం చేశారు. వి.సి. సజ్జనర్ పాతబస్తీలోని మాదన్నపేట పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత, మాదన్నపేట పోలీస్ స్టేషన్ సందర్శించడం ఇదే మొదటిసారి. ఈ సందర్శన సందర్భంగా వివిధ కేసుల పురోగతి, పోలీసింగ్ విధానాలు, సామాజిక మత పరిస్థితులు, ఇతర అంశాలను ఆయన సమీక్షించారు. కమిషనర్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై, వారి రోజువారీ విధులు, హాజరు, క్రమశిక్షణ గురించి ఆరా తీశారు. అలాగే పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలో పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాము. ఈ నూతన విధానం నగర ప్రజల భద్రతకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్‌లో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్‌రోడ్డు భద్రత, మహిళాచిన్నారుల రక్షణ, టెక్నాలజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, సైబర్ క్రైమ్స్, ఆర్థిక నేరాల నియంత్రణ, 24/7 సిటిజన్ సర్వీసెస్ మరియు సిబ్బంది సంక్షేమం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారిస్తాం అని అన్నారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంచడం మనందరి ప్రధాన బాధ్యత. విధుల్లో క్రమశిక్షణగా, అంకిత భావంతో వ్యవహరించాలి. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచే సిబ్బందిని గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. వారికి తగిన న్యాయం జరగేలా చూడాలని, కేసుల నమోదులో ఎటువంటి నిర్లక్ష్యం అంగీకారయోగ్యం కాదన్నారు. మహిళలకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే కేసు నమోదు చేసి, ఆలస్యం చేయకుండా విచారణ చేపట్టి చార్జ్‌షీట్ త్వరగా దాఖలు చేయాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుదారుడు సంతృప్తిగా స్టేషన్ నుంచి వెళ్లేలా చూడాలన్నారు. ఇటీవల సుమయ్య హత్య కేసులో నిర్వహించిన చురుకైన విచారణ, త్వరితగతిన నిందితుల గుర్తింపు, అరెస్టులు కారణంగా బాధితురాలి తండ్రి అజీమ్‌ఉద్దీన్ ఫారూక్ కమిషనర్‌ని వ్యక్తిగతంగా కలసి ధన్యవాదాలు తెలిపారు. తరువాత కమిషనర్ మదన్నపేట పరిధిలోని సున్నిత ప్రాంతాలను పరిశీలించి, పికెట్లు, సిసి కెమెరాలు, పోలీసుల సిద్ధస్థితిని సమీక్షించారు. ఆయన స్థానికులతో మాట్లాడి, వారి సమస్యలు, శ్రేయస్సు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సిపి తఫ్సీర్ ఇక్బాల్, ఎస్‌బి డిసిపి అపూర్వ రావు, సౌత్‌ఈస్ట్‌జోన్ డిసిపి చైతన్య కుమార్, అదనపు డిసిపి కె. శ్రీకాంత్, ఎసిపి వెంకట్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అంజనేయులు, శ్రీను నాయిక్, తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీని తరలించొద్దు

### సిపిఐ నాయకులు గంటి సురేష్

**ప్రజాపక్షం /కొడంగల్ :** కొడంగల్‌కు మంజూరు అయిన మెడికల్ కాలేజ్, ఇంటిగ్రేటెడ్ హస్టల్‌ను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే పుకార్లు కొడంగల్‌లో చక్కర్లు కొడుతున్నాయని దీంతో ప్రజలలో తీవ్ర ఆందోళన నెలకొందని సిపిఐ జిల్లా నాయకులు గంటి సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం అయిన కొడంగల్ మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామ శివారులో మెడికల్ కాలేజ్, పాత కొడంగల్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ హస్టల్‌ను మంజురు చేసి పనులను కూడా ప్రారంబించారు. కాని గత 45 రోజులుగా ఎలాంటి పనులు జరుగకపోగ అక్కడ నుంచి కాంట్రాక్టర్ తన సామాగ్రిలను తరలిస్తుండటంపై పట్టణ ప్రజలలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇక్కడి నుంచి మెడికల్ కాలేజ్ మరియు ఇంటిగ్రేటెడ్ హస్టల్‌లు ఇతర ప్రాంతాలను తరలిపోతున్నాయని అందుకే సామాగ్రి తరలిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కార్ణటక సరిహద్దులో ఉన్న కొడంగల్ నియోజకవర్గం అత్యంత వెనుకబడిన నియోజకవర్గంగా పేరుగాంచింది. రేవంత్‌రెడ్డి వచ్చిన తరువాత వెనుకబడిన నియోజకవర్గాన్ని కాస్తా అభివృద్దిలో దూసుకుపోతుందనుకుంటే మళ్లి మనకు పాత కష్టాలు తప్పడం లేదు. ఉపాధి లేదు. ఉద్యోగ అవకాశాలు లేకపోగ రోడ్లపై అడుక్కునే పరిస్థితి దాపురిస్తుందని వలసలు వేళ్లె పరిస్థితులు మళ్లి రాబోతున్నాయని వాపోయారు. అందుకు ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కొడంగల్ నుంచి ఎలాంటి అభివృద్ధి పనులు తరలిపోవడం లేదనే హామీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరితో పాటు ఆ పార్టీ నాయకులు తదితరులున్నారు.

## ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ అమలు

### కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ,ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ డిపిఓలతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్టంలో ఎంపిటిసి, జెడ్‌పిటిసి, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడుతలుగా జిల్లాలోని 20మండలాల్లోని 594 గ్రామపంచాయతీలకు 5058 వార్డుల్లో పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, అదే విధంగా 20జెడ్‌పిటిసి, 227 యంపిటిసి స్థానాల ఎన్నికలను రెండు విడుతలలో నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లును సిద్ధం చేయడం జరిగిందని అన్నారు.

ఎన్నికల నోటిపికేషన్ వెలువబడిన నాటి నుండి ఎలక్షన్ కమిషన్ అదేశాల మేరకు జిల్లాలో పటిష్టమైన చర్యలు తీసుకున్నామని, జిల్లాలో మొత్తం ఓటర్లు 6,98,472 మంది పురుషులు ,3,43,668 మహిళలు 3,54,788 ఇతరులు 16 మొత్తం పోలింగ్ స్టేషన్‌లు 1289 పోలింగ్ లోకేషన్లు 614, మొత్తం 227 ఎంపిటిసి, జెడ్పిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు 4,రిసిప్సన్ సెంటర్లు 4, స్ట్రాంగ్ రూమ్స్ 3, కౌంటింగ్ సెంటర్స్ 3 ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎన్నికల షెడ్యూల్ విడుదల జరిగిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే ఎన్నికలు జరిగే గ్రామీణ ప్రాంతాలలో అమలులోకి రావడం జరుగుతుందని అన్నారు. నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్ ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్‌చౌదరి, డిపిఓ జయసుధ, తదితరులు పాల్గొన్నారు.

**నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం :** ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల, రిటర్నింగ్ అధికారులు, సహాయ, రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని అధికారులు సమన్వయంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలకు సంబంధించిన,రిటర్నింగ్ అధికారులు ,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల విదులు , బాధ్యతలు నియమ నిబంధనలపైన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ ,అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్‌చౌదరి లతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన నియమనిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని , ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అధికారులు తమకు ఇచ్చిన బుక్‌ను క్షణంగా చదివి ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ,స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో నామినేషన్ల ప్రక్రియ కీలకమైనదని అన్నారు. అదనపు కలెక్టర్ నామిషన్లపై రిటర్నింగ్ అధికారులకు,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు సూచనలు చేశారు.

మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని, నిర్వహణ ప్రక్రియలో ఏమైనా సందేహాలు, అపోహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో తాండూర్ సబ్‌కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, డిఆర్‌డిఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డిఆర్‌ఓ మంగీలాల్ , ఆర్డిఓ వాసుచంద్ర, ఆర్ అండ్‌బి ఇఇ శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు అరికట్టాలి

### సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పి.శ్రీనివాస్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ప్రగతినగర్ ప్రాంతంలో యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను అరికట్టాలని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పి. శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన పార్టీ నేత దస్తగిరితో కల్సి బుద్ధభవన్‌లో జరిగిన ప్రజావాణిలో హైడ్రా అధికారులకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సంతోష్ నాయక్ అనే వ్యక్తి నిజాంపేట సర్వే నంబర్ 191లో 200 గజాల భూమిని కబ్జాచేసి నిర్మాణం చేసుకొన్నా దాన్ని తొలగించామంటూ కాగితాలకే పరిమితం చేసిన మున్సిపల్, రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు తప్పుడు నివేదిక సమర్పించారని ఆరోపిస్తూ దీనిపై విచారణ జరిపించాలన్నారు. ఇదే విధంగా ఎక్కడ పడితే అక్కడ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. అలాగే వైకుంఠధామాన్ని అభివృద్ధి చేయాలన్నారు.



## ఓయో లాడ్జిని సీజ్ చేసిన అధికారులు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** అసాంఘిక కార్యకలాపాలతో కొనసాగుతున్న ఓయో లాడ్జిని మున్సిపల్ అధికారులు సోమవారం సీజ్ చేసారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ ప్రాంతం భగత్‌నగర్ కాలనీలోని నివాస గృహాల మధ్య ఈ లాడ్జిపై స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఫలితంగా ఆయన ఆదేశాలతో ఎట్టకేలకు ఈ చర్యలు తీసుకొన్నారు. లాడ్జి నిర్వాహకులకు నోటీసులు ఇచ్చినా ఎలాంటి స్పందనలేకపోవటంతో మున్సిపల్ ఆర్ఐ కోటా వెంకటేశ్వర్లు తన బృందంతో చేరుకొని తాళాలు వేసి సీజ్ చేసారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన గణేష్‌కు రంజిత్ కుమార్ ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** తల్లిదండ్రులు లేని ఆర్థిక ఇబ్బందులతో ఎంబిబిఎస్ ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్న వరంగల్ ఎనుమాముల గ్రామానికి చెందిన గణేష్‌కు పోచారం మున్సిపాలిటీ యంనంపేట్ గ్రామానికి చెందిన పత్తేపు రంజిత్ కుమార్ తోచిన సహాయాన్ని అతనికి 10 వేల రూపాయలు గూగుల్ పే ద్వారా పంపించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పత్తేపు రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి పేద కుటుంబంలో నుంచి ఎంతో కష్టపడి చదివి ఎంబిబిఎస్ సీటు సాదించాలంటే ఎంతో కృషి పట్టుదల ఉండాలి అలాంటి వ్యక్తి మట్టిలో మాణిక్యమైన గణేష్‌కు ఎంబిబిఎస్ సాధించడంలో ఎంతో కృషి చేశారని ఇలాంటి పేద వారికి ఆర్థికపరమైన సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నామన్నారు.



## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయిన ఓ నిరుపేద కుటుంబానికి తానున్నానంటూ వినాయకనగర్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నేత పిట్టల నాగరాజు తన వంతుగా రూ.10వేలతో పాటు నిత్యావసర వస్తువులను అందించారు. సోమవారం ఆయన వినాయకనగర్‌లో నివసించే లలిత కుటుంబాన్ని పోషించే ఆమె కుమారుడు మృతి వల్ల కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న విషయం తెల్సుకొన్న తాను సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆమెకు ఆర్థిక సాయం అందించారు.



## కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలకు నిదర్శనమే ఈ బాకీ కార్డు

### బిఆర్‌ఎస్ పార్టీ శాసనసభ విప్ కెపి వివేకానంద

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలు, మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన రాష్ట్ర ప్రభుత్వ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికే ఈ బాకీ కార్డు అని బిఆర్‌ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద, బిఆర్‌ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజులు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం చింతల్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి బిఆర్‌ఎస్ ఎల్పీ విప్ కెపి వివేక్, బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, మల్కాజ్‌గిరి పార్లమెంటరీ బిఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డిలు పాల్గొని బాకీ కార్డుల పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆచరణకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేస్తూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో పూర్తి చేస్తామన్న ఆరు గ్యారంటీలను ఏడు వందల రోజులైనా పూర్తి చేయకుండా మళ్లీ మోసం చేసిన విధానాన్ని ప్రజలకు వివరించాలని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసి, పాలన చేతకాక, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించలేక బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను కట్టడానికే డబ్బులు లేవని నమ్మబలకడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## పెంచిన బస్సు చార్జీలు విరమించుకోవాలి : సిపిఐ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ పరిధిలో నడిచే బస్సుల్లో ఐదు, 10 రూపాయల చొప్పున చార్జీలను పెంచుతూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పేద, మధ్య తరగతి ప్రయాణికులపై పెనుభారమే అని సిపిఐ హైదరాబాద్ జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ అన్నారు. ఇప్పటికే అదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర ధరలతో కొట్టుమిట్టాడుతున్నారని, ఈ క్రమంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చదంగా ప్రజల పరిస్థితి మారిందని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. నిన్న విద్యార్థుల బస్సు పాస్ చార్జీలు, నేడు బస్సు చార్జీలను పెంచుతూ సామాన్య ప్రయాణికుల నడ్డి విరుచడమే అని విమర్శించారు. మౌలిక సదుపాయాల సాకుతో ప్రయాణికులపై భారం వేయడం సరికాదన్నారు. ఆర్‌టిసి కార్గో సేవలను ప్రైవేటీకరించే ఆలోచనను విరమించుకోవాలని చంద్రమోహన్ గౌడ్ డిమాండ్ చేశారు.

## పార్కు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** పార్కు స్థలాన్ని కొంతమంది అక్రమంగా కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిని నుంచి పార్కు స్థలాన్ని రక్షించాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. సోమవారం జిహెచ్‌ఎంసి రిజిస్ట్రేషన్ శాఖ, వనస్థలిపురం సబ్ రిజిస్టర్ అధికారులను కాలనీ వాసులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని శ్రీపురం కాలనీలో వినియోగంలో ఉన్న చత్రపతి శివాజీ పార్కును అక్రమంగా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. సుమారు రూ.50 కోట్ల విలువ చేసే విలువైన పార్కు స్థలం ఎట్టి పరిస్థితిలో కాపాడుకుంటామని హెచ్చరించారు. దీనిపై ఉన్నత అధికారులు పూర్తిస్థాయిలో విచారించి బాధితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీపురం కాలనీ వాసులు ముత్యం రావు, నారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, విట్టల్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాల పర్యవేక్షణలో ఎన్నికల నిర్వహణ : సిఐ నర్సయ్య



**ప్రజాపక్షం/కొత్తూరు:** సిసి కెమెరాల పర్యవేక్షణలోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కొత్తూరు సిఐ నర్సయ్య వివరించారు. సోమవారం కొత్తూరు మండల పరిధిలోని మల్లాపూర్, మల్లాపూర్ తండా, గుడూరు, తీగాపూర్, మక్తగూడ, వైఎం తండా, చింతగుట్ట తండాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ నర్సయ్య మాట్లాడుతూ ప్రశాంతంగా శాంతియుతంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు అన్నివిధాల చర్యలు తీసుకుంటామని వివరించారు. పోలింగ్ కేంద్రాల స్థితి,గతులను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

## ఇంటి నిర్మాణానికి సహాయం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పేద ముస్లిం మహిళ ఇంటి నిర్మాణానికి సిమెంట్‌ను బహుకరించారు. సోమవారం పట్టణంలోని 27వ వార్డుకు చెందిన ఖాదర్ యునిసాభేగం నిర్మించుకుంటున్న ఇంటి నిర్మాణానికి బికె ఛాంబర్స్ అధినేత, న్యాయవాది మోముల బసప్ప సిమెంట్ సంచులను అందజేశారు. స్థానిక మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ సీనియర్ నేత మురళీమోహన్ ద్వారా తెలుసుకొని మాజీ మున్సిపల్ చైర్మెన్ అగ్గనూరి విశ్వం సమక్షంలో అందజేశారు. నిరుపేద కుటుంబానికి తమవంతు సహాయ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని, సేవ చేసేందుకు బికె ఛాంబర్స్ ఎల్లప్పుడు ముందు ఉంటుందని అన్నారు. బికె ఛాంబర్స్ ద్వారా ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, మున్ముందు మరెన్నో పేదలకు సేవ చేసేందుకు ముందుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ విశ్వం, మాజీ కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి, మురళిమోహన్, జాంగారి రవి, బర్మలి జంగయ్య, వీరేశ్, అబ్దుల్ జలిల్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/గండిపేట :** 34 సంవత్సరాల తర్వాత వారు కలుసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నార్సింగి మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91వ సంవత్సరంలో చదువుకున్న అప్పటి విద్యార్థులు ఆదివారం నార్సింగిలోని కెవిఎంఆర్ గార్డెన్‌లో సమావేశమయ్యారు. వారంతా ఒక చోట కలిసి తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, సీతాబాయిలను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు వేణుకుమార్, వెంకటేశ్, వెంకట్ రాంరెడ్డి, గిరిధర్రెడ్డి, సురేష్, సుమతి, భారతీబాయి, అనిత, లక్ష్మిలతో పాటు అప్పటి విద్యార్థులంతా పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర డిజిపిని కలిసిన కరాటే మాస్టర్ చెన్నయ్య



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపిగా బాధ్యతలు చేపట్టిన శశిధర్‌రెడ్డిని తెలంగాణ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాస్టన్ చెన్నయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైద్రాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో డిజిపి శశిధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడంతోపాటు దసరా శుభాకాంక్ష లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు నేర్పిస్తున్న కరాటే క్లాసులపై డిజిపికి వివరించారు. రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ పోటీలకు వచ్చేందుకు కృషి చేయాలని డిజిపిని కోరినట్లు కరాటే మాస్టర్ చెన్నయ్య తెలిపారు.

# హైడ్రా ప్రజావాణికి 41 ఫిర్యాదులు

### అనుమతులు లేని లేఔట్లు, రహదారుల ఆక్రమణలపై ఫిర్యాదులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అనుమతులు లేని లే ఔట్లలో రహదారులు, పార్కులు ఆక్రమణకు గురౌతున్నాయి. 60 అడుగుల వెడల్పుతో ఉండాల్సిన రహదారులను ఇరువైపులా ఆక్రమణలు జరుగుతున్నాయి. డబ్బాలు పెట్టి వ్యాపారాలు చేసుకుంటున్నారని, ఖాళీ చేయమంటే దాడి చేస్తున్నారంటూ పలువురు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనుమతి లేని లేఔట్లలో ప్లాట్లు కొని సరైన రహదారులు, పార్కులు లేక ఇబ్బందులు పడొద్దని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సూచించారు. హెచ్‌ఎండిఏ, డిటిసిపి అనుమతి పొందిన లే ఔట్లలో ప్లాట్లు కొంటే రహదారులు, పార్కులు నిర్దేశిత లెక్కల ప్రకారం ఉంటాయన్నారు. బొల్లారం మున్సిపాలిటీలోని ఎన్‌రిచ్ ప్రాంతంలో సర్వే నెంబరు 83లో వరకుంట చెరువు కబ్జాలను నివారించాలని, బాచుపల్లి మండలంలోని నిజాంపేట సర్వే నంబరు 233/15లో ప్రభుత్వ భూమి కబ్జా అవుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ జిల్లా కాప్రా మండలం జవహార్‌నగర్ విలేజ్‌లో తన తండ్రి ఆర్మీ ఉద్యోగి కావడంతో అప్పట్లో ఇచ్చిన భూమిని స్థానికంగా ఉన్నవారు కబ్జా చేసేశారని అతని కుమారుడు ఫిర్యాదు చేశారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 41 ఫిర్యాదులందాయి. ఇందులో ఎక్కువగా రహదారులు, పార్కుల ఆక్రమణలే ఉన్నాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించి వాటి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

## జలమండలిలో ఏడుగురు ఉద్యోగులు పదవీ విరమణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 7 మంది ఉద్యోగులు పదవీవిరమణ పొందారు. వీరిలో పలు స్థాయిల్లో పనిచేసే ఉద్యోగులు ఉన్నారు. వీరందరిని ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యుటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పి అండ ఏ సిజిఎం సురేష్, జిఎం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



## పలుచోట్ల మంచినీటి సరఫరాకు అంతరాయం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరానికి మంచినీటిని సరఫరా చేస్తున్న సింగూరు సంబంధించి సింగాపూర్ నుంచి ఖానాపూర్ వరకు ఉన్న 1200 ఎంఎం డయా పిఎస్‌సి గ్రావిటీ మెయిన్ కు మణికొండ కల్వర్టు వద్ద పిఎస్‌సి పైపు లైన్ దెబ్బతినడంతో భారీ లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీని అరికట్టడానికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పనులు చేపట్టారు. ఈ లీకేజీలను అరికట్టేందుకు ఈనెల 6 రాత్రి 10 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. కావున ఈ 10 గంటలు కింద పేర్కొన్న కొన్ని ప్రాంతాల్లో ప్రెజర్‌తో నీటిసరఫరా, మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని జలమండలి అధికారులు తెలిపారు.

### అంతరాయం ఏర్పడే ప్రాంతాలు..

మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు, షేక్‌పేట్, హకీంపేట్, టోలిచౌకి, కాకతీయ నగర్ లోని కొన్ని ప్రాంతాలు, మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, కార్వాన్, ప్రాంతాల్లో మంచి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. కావున పైన పేర్కొన్న ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచించారు.

# దరఖాస్తుదారులు అడిగిన సమాచారం ఇవ్వండి





### ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఒలతో డిప్యూటీ కమిషనర్ అనిల్‌కుమార్ రెడ్డి సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్, సికింద్రాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలో ఉన్న 179 మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు చేసుకునే వారికి అవసరమైన సమాచారాన్ని వెంటనే సంబంధిత ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వారు ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని 11 ఎక్సైజ్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, ఎస్‌ఐలు, ఎన్‌ఫోర్స్‌మెంట్, డిటిఎఫ్‌టీమ్‌లతో అనిల్‌కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. మద్యం దకాణాలకు సంబంధించిన రిజర్వేషన్లు, రెండేళ్లలో మద్యం సెల్స్ వివరాలను దరఖాస్తుదారులకు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. దరఖాస్తులు చేసుకునేవారికి దరఖాస్తుల సమూనాలో ఏ రకమైన తప్పిదాలు లేకుండా ఎక్సైజ్ సిబ్బంది సహకారం అందించాలన్నారు. దరఖాస్తులు నింపడం పూర్తి చేసిన అనంతరం అబ్కారీ భవన్ లోని మూడు, నాలుగు అంతస్తుల్లో ఉన్న కౌంటర్‌లో దాఖలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు రిసీట్, ఎంట్రిపాసులు అందాయా లేదా అనే విషయాన్ని కూడ పరిశీలించాలని, కొత్త వారు దరఖాస్తులు చేసుకోవడానికి వచ్చినపుడు వారికి తగిన సూచనలు అందించాలన్నారు. ఏ షాపుకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని రోజువారిగా డిస్ప్లే చేయాలని ఎక్సైజ్ సూపర్డెంట్ పంచాక్షరి సూచించారు. వీటితోపాటు అప్‌టేక్‌లు, ఎన్‌డీపీఎల్ అమ్మకాలు జరుపుతున్న కేంద్రాలపై నిఘా పెట్టాలని, క్రైమ్‌కు పాల్పడే వారిపై దృష్టి పెట్టాలని అన్నారు. సమావేశంలో హైదరాబాద్, సికింద్రాబాద్ ఎక్సైజ్ సూపరింటెండ్ పంక్షారీ, ఏఈఎస్ శ్రీనివాసరావులతో పాటు 11 స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, ఎస్‌ఐలు పాల్గన్నారు.

# జిహెచ్‌ఎంసి ఉద్యోగులకు తక్కువ ధరకే ఇళ్ల స్థలాలు

### జిహెచ్‌ఎంఇయు అధ్యక్షుడు ఊదరి గోపాల్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉద్యోగులకు జిహెచ్‌ఎంసి కాలనీ ఏర్పాటు చేయబోతున్నామని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్(జిహెచ్‌ఎంఇయు) అధ్యక్షుడు ఊదరి గోపాల్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ద్వారా పర్మినెంట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ప్లాట్లు అందిచనున్నట్లు గోపాల్ వెల్లడించారు. ఈ మేరకు జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. యాదగిరిగుట్ట సమీపంలోని చల్లూరులో 220 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు, ఇప్పటికే ఇందుకు సంబంధించిన అగ్రిమెంట్ పూర్తయినట్లు తెలిపారు. ఇందులో కేవలం రూ. 3,999 కే చదరపు గజాన్ని ఇవ్వబోతున్నామని తెలిపారు. బయటి మార్కెట్‌తో పోలిస్తే ఇది సగం ధరకే తక్కువలో వస్తుందన్నారు. ఈ లేఔట్‌కి డిటిసిపి అనుమతులు తీసుకుంటున్నామన్నారు. ముందుగా జిహెచ్‌ఎంసి రెగ్యులర్ ఉద్యోగులు కేవలం ఒక్క రూపాయి ఇచ్చి సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. త్వనలో అందరికి భూమి దగ్గరికి తీసుకెళ్లి చూపిస్తామని, అన్ని శాఖల ఉద్యోగులకు కాలనీలు ఉన్నాయని, ఒక్క జిహెచ్‌ఎంసి ఉద్యోగులకు కాలనీ లేదని, ఇప్పుడు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. గతంలో కూడా ఘట్‌కేసర్‌లో ఇదే విధంగా ప్లాట్లు అందించామని గోపాల్ గుర్తు చేశారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డి. నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు

## ట్రిపుల్ ఆర్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలంటే అరెస్టులా..

### రైతులకు న్యాయం చేయకుంటే ఆందోళనలు చేస్తాం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ట్రిపుల్‌ఆర్ రోడ్డు అలాన్మెంట్‌ను మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ సీనియర్ నేత వీరేశం గుప్తా, మాజీ సర్పంచ్ సుమిత చందునాయక్‌లు డిమాండ్ చేశారు. సోమవారం ఛలో హెచ్‌ఎండిఏ ముట్టడికి పిలుపు ఇవ్వడంతో స్థానిక పోలీసులు కొంతమంది రైతులతోపాటు నేతలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చని పంటలు పండే వ్యవసాయ పోలాల నుండి ట్రిపుల్‌ఆర్ రోడ్డు వెళ్తుందని, దాంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని, రోడ్డు అలాన్మెంట్‌ను మార్చేందుకు కృషి చేయాలని కోరితే పోలీసుల చేత అక్రమంగా అరెస్టులు చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అన్నదాతలకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వమే అరెస్టులు చేయిస్తే తమ బాదలు ఎవరికి చెప్పాలో తెలియడం లేదని అన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం అక్రమ అరెస్టులు ఇబ్బందులకు గురి చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. ట్రిపుల్ ఆర్ రోడ్డుకు సంబంధించిన రూట్ మ్యాప్‌తోపాటు సర్వే నంబర్లు సైతం ప్రభుత్వం ప్రకటించడం, క్రయా విక్రయాలు లేకుండా చేయడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రోడ్డు వెళ్తున్న ప్రాంతాలు మొత్తం పేద రైతులే ఎక్కువగా ఉన్నారని, రెండు, మూడు, నాలుగు ఎకరాల రైతులే ఎక్కువగా ఉన్నారని, వారకి న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫరూక్‌నగర్ మండల పరిధిలోని భీమారం, ఉప్పరిగడ్డ, అయ్యవారిపల్లి గ్రామాల్లో 90శాతం అన్నదాతలు సన్న, చిన్నకారు రైతులు భూములు కోల్పోతున్నారని, పాత అలైన్మెంట్ ప్రకారమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# పట్టపగలే వృద్ధురాలిని బురిడి కొట్టించిన దొంగలు

### దేహశుద్ధి చేసిన గ్రామస్తులు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పట్ట పగలు అందరూ చూస్తుండగా ఓ వృద్ధురాలిని దొంగలు బురిడి కొట్టించిన సంఘటన ఫరూఖ్‌నగనర్ మండలం వెల్‌జర్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు ఆ దొంగలను పట్టుకొని దేహశుద్ధి చేసి షాద్‌నగర్ పోలీసులకు అప్పగించారు. గ్రామస్తుల కథనం ప్రకారం వెల్‌జర్ల గ్రామానికి చెందిన భ్యాగరి చిన్నమ్మ అనే వృద్ధురాలి ఇంటి వద్దకు సోమవారం ఉదయం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చినట్లు తెలిపారు. బంగారు నగలకు మెరులు పెడుతామంటూ గుర్తు తెలియని వ్యక్తులు చెప్పడంతో ఆ వృద్ధురాలు నమ్మి వెండి కడియాలు ఇచ్చిందని వివరించారు. వాటిని శుభ్రం చేసి ఇవ్వడంతోపాటు ఆమె మెడలో ఉన్న బంగారు గుండ్ల హారం ఇస్తే మెరిసేలా చేస్తామని చెప్పారు. అంతలోనే ఇంట్లో ఉన్న గ్యాస్ స్టవ్‌పై నీళ్లు పోసి పసుపు వేసి నగలు వేసినట్లు నటించడంతోపాటు తెల్లగా మెరుస్తున్నాయని, వాటిని టిఫిన్ బాక్స్‌లో పెట్టామని వృద్ధురాలికి చెప్పారు. దాంతో వృద్ధురాలికి మైకం వచ్చే విధంగా చేసి అక్కడి పరారైనట్లు గ్రామస్తులు తెలిపారు. వృద్ధురాలు మైకం నుండి బయటకు వచ్చిన తరువాత స్థానికులకు ఈ విషయం చెప్పారు. దాంతో అప్రమత్తమైన గ్రామస్తులు గ్రామంలో వేతుకగా టీ పాయింట్ వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కనిపించారు. దాంతో అనుమనం వచ్చిన గ్రామస్తులు ఇద్దరి వ్యక్తులు గ్రామ పంచాయతీ వద్దకు తీసుకువెళ్ళి దేహశుద్ధి చేయగా అసలు విషయం బయటకు వచ్చింది. తామే వృద్ధురాలి నుండి దొంగతనం చేశామని, ఓ ప్రాంతంలో పెట్టామని ఒప్పుకున్నారు. దొంగతనం చేసిన బంగారాన్ని తీసుకున్న గ్రామస్తులు షాద్‌నగర్ పోలీసులకు అప్పగించారు. దాంతో పోలీసులు ఇద్దరు దొంగలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు

### రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి






**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎన్నికల నియమావళిని ప్రకడ్బందీగా అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలీస్ అధికారులు,ఎంపిడిఒలు, ఎన్నికల నోడల్ అధికారులు, అడిషనల్ కలెక్టర్‌లతో కలిసి జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికలను నోడల్ అధికారులు, పోలింగ్ అధికారులు తమ విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని కోరారు. నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ ప్రక్రియ, నామినేషన్‌ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులకు కేటాయించిన విధులలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. మండలస్థాయి ఎన్నికల అధికారులు ఒక టీంగా ఏర్పడి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సభలు, ర్యాలీలు సమావేశాల కొరకు అనుమతి పొందాల్సి ఉంటుందని తెలిపారు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. ఫ్లయింగ్ సర్వేలెన్స్‌టీం, స్టాటిస్టిక్ సర్వేలెన్స్ టీంలు, ఆయా టీంలలో పోలీసు శాఖ సిబ్బంది తప్పని సరిగా ఉండాలని ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు ప్రొసైడింగ్, సహాయ ప్రొసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్, బ్యాలెట్ బాక్స్, బ్యాలెట్ పేపర్ ఇతర ఎన్నికల సంబంధిత ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై ప్రత్యేకదృష్టి సారించి ఎన్నిక ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. పోలీసుశాఖ అన్నిశాఖలతో సమన్వయంగా పని చేస్తూ, ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించడం జరుగుతుందని డిసిపి సునీతారెడ్డి తెలిపారు. అడిషనల్ డిసిపిలు సమస్యాత్మక గ్రామాలను త్వరలో గుర్తించి తగిన విధంగా బందోబస్తు ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె చంద్రారెడ్డి, జడ్‌పి సిఇఒ కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, ఎక్సైజ్ శాఖ సుపరిడెంట్లు కృష్ణప్రియ, సైబరాబాద్ పోలీస్ శాఖ అడిషనల్ డిసిపి లు, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, రెవెన్యూ డివిజినల్ అధికారులు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

# రీల్



## 'కింగ్ బుద్ధ' మూవీ పోస్టర్ రిలీజ్

ప్రపంచ శాంతి సందేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో వ్యాప్తి చేయాలనే లక్ష్యంతో హాలీవుడ్‌లో డైరెక్టర్‌గా నిర్మిస్తున్న 'కింగ్ బుద్ధ' సినిమా పోస్టర్ లాంచ్ ఈవెంట్ అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో జరిగింది. ఈ సినిమాకు సత్యా రెడ్డి స్వీయ దర్శకత్వం వహిస్తున్నారు.మూడుసార్లు కిడర్ పార్క్ మేయర్‌గా పనిచేసిన మ్యాట్ పోవెల్ చీఫ్ గెస్ట్‌గా హాజరై, 'కింగ్ బుద్ధ' పోస్టర్‌ను ఆవిష్కరించారు.చిత్ర నిర్మాతల్లో ఒకరైన శైలర్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం హాలీవుడ్‌లో డైరెక్టర్ సత్యారెడ్డి నిర్మించే 'కింగ్ బుద్ధ' సినిమాను ఎక్కడా కాంప్రమైజ్ చేయకుండా అన్ని హైలెవెల్ టెక్నికల్ అసెట్స్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తాము అని సత్యారెడ్డి తెలిపారు. నటుడుగా, నిర్మాతగా, దర్శకుడుగా, రచయితగా, గాయకుడుగా 30 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న నేను, ప్రపంచ శాంతి కోసం 'కింగ్ బుద్ధ' కాన్సెప్ట్‌ను తీసుకున్నానని చెప్పారు.



మిరాయ్ సినిమా విజయాన్ని పురస్కరించుకొని తేజసజ్జా కోసం తమ ఇంట్లో ఆత్మీయంగా ఒక వేడుక ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తేజసజ్జాతో పాటు డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని పాల్గొ

## మిరాయ్ టీమ్‌ను అభినందించిన దిల్ రాజు

తేజ సజ్జా నటించిన తాజా తాజా చిత్రం మిరాయ్ ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్లతో దూసుకెళ్తోంది. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా హిట్‌గా నిలిచింది.తాజాగా ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్ డీ సి ఛైర్మన్ దిల్ రాజు మిరాయ్ టీంని అభినందించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్నారు. మిరాయ్ ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో 150 కోట్లు పైగా వసూలు చేసింది. నార్త్ అమెరికాలో 3 మిలియన్ డాలర్ల మార్క్ ని దాటింది.రితికా నాయక్ హీరోయిన్‌గా, మనోజ్ మంచు, శ్రీయా శరణ్ ముఖ్యపాత్రల్లో నటించిన ఈ చిత్రం, యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ప్రెజెంటేషన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది.

## 'రాజా సాబ్' ట్రైలర్‌కు భారీ స్పందన




రెబల్ స్టార్ ప్రభాస్ భారీ పాన్ ఇండియా మూవీ 'రాజా సాబ్' ట్రైలర్ రీసెంట్‌గా రిలీజ్ బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉండగా.. ట్రైలర్ రిలీజ్ తర్వాత ఆ అంచనాలు మరింతగా పెరుగుతున్నాయి. ట్రైలర్‌లో రెండు డిఫరెంట్ షేడ్స్‌లో ప్రభాస్ కనిపించిన తీరు రెబల్ ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది.. టెర్రిఫిక్ రాజా సాబ్ క్యారెక్టర్ తో పాటు వింటేజ్ లుక్‌లో ప్రభాస్ వెర్సటైల్‌గా కనిపించారు. రాజా సాబ్ ట్రైలర్‌లో కనిపించిన వరల్డ్ క్లాస్ మేకింగ్ క్వాలిటీ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రొడక్షన్ స్టాండర్డ్స్‌ను చూపించింది. దర్శకుడు మారుతి ప్రభాస్ ని వన్స్ ఇన్ ఎ లైఫ్ టైమ్ అనిపించే సినిమాగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. తనకు ఇష్టమైన రొమాంటిక్ హారర్ కామెడీ జానర్‌లో తన ఫేవరేట్ హీరో ప్రభాస్ ను మారుతి వెర్సటైల్ గా చూపించారు. తమన్ సంగీతంలోని వేరియేషన్స్ రాజా సాబ్ ట్రైలర్ కు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. ముగ్గురు హీరోయిన్స్ మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ రాజా సాబ్ సినిమాలో గ్లామర్‌ను యాడ్ చేస్తున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న థియేటర్స్ లోకి రాబోతోంది.

# నాగ్ @100



నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు వారసుడిగా సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టి, తనదైన స్టైల్‌తో అక్కినేని వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు యువ సామ్రాట్ నాగార్జున. రొమాంటిక్ హీరోగా, యాక్షన్ స్టార్‌గా, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ హీరోగా అన్ని రకాల జానర్లలోనూ తన ప్రతిభను నిరూపించుకున్న నాగ్, ఇప్పుడు తన కెరీర్‌లో 100వ చిత్రం కోసం రెడీ అవుతున్నాడు.ఇటీవల 'కుబేర' , 'కూలీ' చిత్రాల్లో నటించి నటన పరంగా మళ్లీ తన రేంజ్ చూపించిన నాగ్, ఈ మైలురాయి ప్రాజెక్టును ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్లాన్ చేస్తున్నాడు. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి కోలీవుడ్ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వం వహించనున్నాడు. మొదట దసరాకి షూటింగ్ ప్రారంభం అవుతుందని ప్రచారం జరిగినా, అది కుదరలేదు. కానీ, తాజా సమాచారం ప్రకారం అక్టోబర్‌లోనే పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సినిమాలో నాగార్జునతో పాటు ముగ్గురు హీరోయిన్లు నటించనున్నారని టాక్. రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా, ఈ ప్రాజెక్టును స్వయంగా నాగార్జున తన అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ కూడా హాట్ టాపిక్‌గా మారింది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, 'లాటరీ కింగ్' అనే టైటిల్ పరిశీలిస్తున్నారట. నాగార్జునని అభిమానులు కింగ్ అని పిలుస్తుంటారు కాబట్టి, ఈ టైటిల్ క్యాచీగా, అర్థవంతంగా ఉంటుందని టీమ్ భావిస్తోందట. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకునే ఈ సినిమాలో నాగచైతన్య, అఖిల్ కూడా కనిపించనున్నారని సమాచారం. వారు కీలక పాత్రల్లో నటిస్తారా, లేక ప్రత్యేక క్యామియోల్లోనే కన్పిస్తారా అన్నది మాత్రం క్లారిటీ రావాల్సి ఉంది. అక్కినేని ఫ్యాన్స్ మాత్రం ఈ అప్‌డేట్స్‌తో ఉత్సాహంగా ఉన్నారు. నాగ్ 100వ సినిమా అంటే అక్కినేని కుటుంబానికి, అభిమానులకు ప్రత్యేకమైన మైలురాయి. అందుకే, వీలైనంత త్వరగా షూటింగ్ ప్రారంభించి, ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్ రిలీజ్ చేయాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు.

## రెగ్యులర్ షూటింగ్‌లో 'మహానాగ'



భీమవరం టాకీస్ పతాకంపై నిర్మిస్తున్న 'మహానాగ' రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. సీనియర్ హీరో సుమన్, హీరో రమాకాంత్, హీరోయిన్ శ్రావణి ముప్పిరాల (తొలి పరిచయం)పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి తెలుగు ఫిలిం ఛాంబర్ కార్యదర్శి కె.ఎల్.దామోదర ప్రసాద్ క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు గౌరవ దర్శకత్వం వహించారు. భీమవరం టాకీస్ పతాకంపై తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఉదయ భాస్కర వాగ్దేవి దర్శకుడు. శ్రీకావ్య, టంగుటూరు రామకృష్ణ, బస్ స్టాప్ కోటేశ్వరరావు, జబర్దస్త్ అప్పారావు, సుబ్బలక్ష్మి , టి.ఆర్.ఎస్., ధీరజ అప్పాజీ, సంధ్య వర్షిణి ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం మొదటి షెడ్యూల్ హైదరాబాద్‌లో పూర్తి చేసుకుని, రెండో షెడ్యూల్ తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో జరుపుకోనుంది.



## అమెజాన్ ప్రైమ్‌లో 'అది ఒక ఇదిలే'

తెలుగు కామెడీ మూవీ 'అది ఒక ఇదిలే' అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఫ్రీ స్ట్రీమింగ్ కాకుండా రెంటల్ విధానంలో ఈ తెలుగు మూవీ ఓటీటీ ప్రేక్షకుల ముందుకొచ్చింది. రొమాంటిక్ కామెడీ లవ్ డ్రామాగా తెరకెక్కిన ఈ మూవీలో సబ్యసాచి మిశ్రా, రాధిక ప్రీతి, శ్యామ్, మహి, తేజో వికాస్ హీరోహీరోయిన్లుగా నటించారు. టాలీవుడ్ కొరియోగ్రాఫర్ స్వర్ణ మాస్టర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, కొరియోగ్రఫీ కూడా స్వర్ణ మాస్టర్ అందించడం విశేషం.



## నందు, అవికా గోర్ జంటగా 'అగ్లీ స్టోరీ'

నందు, అవికా గోర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'అగ్లీ స్టోరీ'. రియా జియా ప్రొడక్షన్స్ పతాకం మీద సీహెచ్ సుభాషిణి, కొండా లక్ష్మణ్ నిర్మిస్తున్నారు. ప్రణవ స్వరూప్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్, 'హే ప్రియతమా' లిరికల్ సాంగ్ విడుదల చేశారు. మంటల మీదుగా సిగరెట్ కాలుస్తున్న నందును 'అగ్లీ స్టోరీ' టీజర్‌లో ముందుగా పరిచయం చేశారు. ఈ సినిమాలో శివాజీ రాజా, రవితేజ మహదాస్యం, ప్రజ్ఞ నటిస్తున్నారు. సినిమాటోగ్రఫీ శ్రీ సాయికుమార్ దారా, కొరియోగ్రఫీ ఈశ్వర్ పెంటి, ఎడిటింగ్ శ్రీకాంత్ పట్నాయక్. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: ప్రణవ స్వరూప్.

## 'డ్యూడ్' నుంచి సింగారి పాట రిలీజ్



వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో దూసుకుపోతున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ పాన్ ఇండియా మూవీ డ్యూడ్‌తో అలరించడానికి రెడీ అవుతున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. 'ప్రేమలు'అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. రీసెంట్‌గా విడుదలైన బూమ్ బూమ్, బాగుండు పో సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. 'డ్యూడ్' ఈ నెల 17న దీపావళి సందర్భంగా, తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల కానుంది.

---

## ఎందుకొచ్చారు?

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులను నిలిపివేసేందుకు తిరస్కరించిన తర్వాత మీరు ఇక్కడికి వచ్చారా?'' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఉత్తర్వును నిలిపివేసేందుకు వీలుగా పిటిషన్‌ను అనుమతించాలని సదరు న్యాయవాది విజ్ఞప్తి చేయగా ధర్మాసనం పైవిధంగా స్పందించింది. పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టును ఆశ్రయించి ఉపశమనం పొందడానికి వీలుగా స్వేచ్ఛ ఇవ్వాలని ఆ తర్వాత పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. పిటిషనర్ కోరిన విధంగానే వ్యాజ్యాన్ని కొట్టేసినట్లు ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వం ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ల ఉత్తర్వు అన్యాయం, యాభైశాతం పరిమితి విధించిన సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధం అని హైకోర్టు ముందు పిటిషనర్లు పేర్కొన్నారు. సెప్టెంబరు 30వ తేదీ నాటికి గ్రామ పంచాయతీ ఎన్నికలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఇంతకుముందు మార్గదర్శనం చేసింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చుకోవడంకోసం స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటిస్తూ గతనెలాఖరున ఉత్తర్వులు జారీ చేసింది. రాజ్యాంగంలోని 243 డి (6) ప్రకారం ఏ పంచాయతీలోనైనా లేదా పంచాయతీల అధ్యక్షుల కార్యాలయాలోనైనా వెనుకబడిన తరగతుల పౌరులకు మేలు చేయడం కోసం రిజర్వేషన్ సీట్లు ఇవ్వడానికి ఎలాం టి నిబంధనలనైనా పొందుపరచేందుకు రాష్ట్రాల ప్రభుత్వాలకు అధికారాలు ఉన్నాయి.

రాష్ట్రంలో ప్రభుత్వం సామాజిక-ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులపరమైన సర్వే (ఎస్ఇఇఇపిసి) నిర్వహించిందని జిఓ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఎస్ఇఇఇపిసి సర్వేలో లభించిన గణాంకాలను సమగ్రంగా విశ్లేషించింది. సంబంధిత న్యాయబద్ధమైన గణాంకాలను కూడా పరిగణనలోకి తీసుకుంది. వెనుకబడిన తరగతులవారికి స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచడానికి ఉద్దేశించిన సిఫార్సులను కూడా పరిశీలించి పరిగణనలోకి తీసుకుందని ప్రభుత్వం గతనెల జారీ చేసిన ఉత్తర్వు స్పష్టం చేసింది. ఏకసభ్య కమిషన్ సిఫార్సులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చాలా జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతనే ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వెనుకబడిన తరగతులవారికి జనాభాకు అనుగుణంగా తగిన రాజకీయ ప్రాతినిధ్యం లేదని పరిశీలించిన తర్వాతనే ఈ నిర్ణయం తీసుకుంది.

## రైల్ల భద్రతపై జిఎం సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వే ట్రాక్ నిర్వహణ పనులు, షంటింగ్ కార్యకలాపాలు మొదలైన వాటిలో క్షేత్రస్థాయి సిబ్బంది భద్రతా విధానాలను పాటించడం ద్వారా పెద్దపెద్ద ప్రమాదాలను నివారించవచ్చని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో సోమవారం ఆయన అధికారులతో రైళ్ల భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షాసమావేశంలో విజయవాడ, గుంతకల్లు, గుంటూరు,సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. అన్ని భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. సూపర్వైజర్లు అందరు క్షేత్రస్థాయి కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని, ఏదైనా సమస్యను తక్షణమే పరిష్కరించి వీలైనంత త్వరగా సరిదిద్దాలని పేర్కొన్నారు. జనరల్ మేనేజర్ రైల్వే కార్యకలాపాలను మెరుగుపరచడానికి భద్రతపై మరింత అవగాహనను పెంచడానికి జోన్‌లోని ఆరు విభాగాలలో చేపట్టిన వివిధ భద్రతా డ్రైవ్‌ల స్థితిని సమీక్షించారు. ట్రాక్‌ల భద్రత, కార్యాచరణ సామర్థ్యం, షంటింగ్ ఆపరేషన్‌లు, సిగ్నల్ భద్రత మొదలైన భద్రతా డ్రైవ్‌లు ప్రాధాన్యత ఇవ్వబడిన ముఖ్యమైన రంగాలలో ఉన్నాయి. జనరల్ మేనేజర్ తనిఖీల సమయంలో ఏవైనా లోపాలను గుర్తించినట్లైతే సజావుగా రైలు కార్యకలాపాలను నడుపడానికి వెంటనే సరిదిద్దాలని చెప్పారు.



## మాజీ కేంద్ర సల్మాన్ ఖుర్షీద్‌కు సద్భావన అవార్డు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ కేంద్ర విదేశాంగశాఖా మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ కు సద్భావనా అవార్డుకు ఎంపికయ్యారు. 35వ రాజీవ్ గాంధీ సద్భావనా యాత్రా స్మారక దినోత్సవం సందర్భంగా ఈ నెల 19న చార్మినార్ వద్ద జరిగే కార్యక్రమంలో సల్మాన్ ఖుర్షీద్ కు సద్భావనా అవార్డు ప్రధానము చేస్తారు. మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ, 1990వ సంవత్సరం అక్టోబర్ 19న చారిత్రాత్మక చార్మినార్ వద్ద కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, హైదరాబాద్ జంట నగరాల్లో సద్భావనా యాత్ర చేశారు. రాజీవగాంధీ సద్భావనా యాత్రా స్మారక సమితి ఆధ్వర్యంలో ఈ రోజును 'రాజీవ్ గాంధీ సద్భావనా యాత్రా స్మారక దినము'గా పాటిస్తూ గత 35 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం చార్మినార్ వద్ద ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం, వివిధ రంగాల్లో సేవలు అందించిన ఒక ప్రముఖ వ్యక్తిని సద్భావనా అవార్డుతో సత్కరించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎఐసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ, మాజీ ఎంపి వి.హనుమంతరావులు పాల్గొంటారు. మాజీ ఎంఎల్‌సి బి.కమలాకర్ రావు, టిపిసిసి ఛైర్మన్ ఎ.శ్యామ్ మోహన్, ఇంటలెక్చువల్ సెల్‌తో కూడిన ఎంపిక కమిటీ ఈ సంవత్సరం సద్భావన అవార్డుకు సల్మాన్ కుర్షిద్ పేరును ఎంపిక చేసింది.

---

# వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

శరీరంలో ఉండే మన రోగనిరోధక వ్యవస్థే దారితప్పి పొరపాటు చేసి మనకు శ త్రువుగా మారి శరీర కణాలపైన, అంతర్గత అవయవాలపైన దాడిచేసి నష్టం కలిగిస్తుంది, ఈ విధమైన నష్టం ప్రతి మనిషికీ ఎందుకు జరగదు, కొందరిలో ఎందుకు జరుగుతుందనే విషయాలు తెలుసుకోవడానికి, పరిష్కార మార్గాలు సాధించడానికి ఈ ముగ్గురి పరిశోధనలు ఉపయోగపడతాయి'' అని నోబెల్ కమిటీ అధ్యక్షులు ఒల్లే కాంపే,సెక్రటరీ జనరల్ థామస్ పెర్ల్‌మాన్ చెప్పారు. ఈ ఏడాది వరుసగా వివిధ రంగాల ప్రముఖులకు ప్రకటించే నోబెల్ బహుమతులు వైద్యరంగంతో ప్రారంభించారు. ఈ వైద్యరంగ ప్రముఖులను నోబెల్ బహుమతికి ఎంపిక చేసినట్లు స్టాక్ హోంలోని కరోలిన్‌స్కా ఇనిస్టిట్యూట్ కమిటీ ప్రకటించింది. ఇక వరుసగా భౌతికశాస్త్రం, రసాయనికశాస్త్రం, సాహిత్య రంగాలలో ప్రముఖ కృషి చేసిన వారికి కూడా మంగళ,బుధ,గురువారాలలో నోబెల్ బహుమతులు ప్రకటిస్తారు. ప్రపంచశాంతికోసం కృషి చేసిన వారికి శుక్రవారంనాడు (10వ తేదీ) నోబెల్ శాంతి బహుమతి ప్రకటిస్తారు. ఆర్థికశాస్త్రంలో నోబెల్ స్మారక బహుమతిని ఈనెల 13న ప్రకటిస్తారు. ఈ బహుమతుల ప్రదానోత్సవం ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి సందర్భంగా డిసెంబరు 10వ తేదీన జరుగుతుంది. విజేతలకు 1.20 మిలియన్ డాలర్లు (10.20 లక్షల డాలర్లు) వంతున నగదు బహుమతిగా ఇస్తారు. జపాన్‌కు చెందిన సకగుచి శాస్త్రవేత్తలకు 1995కు ముందు తెలియని మానవశరీరంలో ఉన్న టి-సెల్స్ ఉప విభాగం గురించి వైద్య ప్రపంచానికి తెలియజేశారు.శరీరంలో ప్రవేశించే హానికారకమైన క్రిములను అంటే బాక్టీరియా,వైరస్, ఇతర కారకాలను కనిపెట్టే కీలకమైన శక్తులే ఈ టి-సెల్స్. శరీరానికి హానిచేసే శక్తులను కనిపెట్టడంలో టి-సెల్స్ ఎంతో నైపుణ్యం కలగి ఉంటాయి. కీశరీరంలో ప్రవేశించే ఇలాంటి రోగకారక శత్రువులపై పోరాటం చేయగలవు. కానీ ఇవే టి-సెల్స్ దారితప్పితే మన శరీరంపైనే దాడిచేసి హానిచేసి వ్యాధులకు గురిచేస్తాయి కూడా. ఆయన పరిశోధనలను అమెరికన్ శాస్త్రవేత్తలు బ్రంకో, రామ్స్‌డెల్ 2001 నుండీ ఇంకా ముందుకుతీసుకువెళ్ళి కొత్త ఆవిష్కరణలు చేశారు. మానవశరీరంలో ఉన్న రోగనిరోధకశక్తి నియంత్రణ వ్యవస్థ గురించి ఎంతో లోతుగా ఈ ముగ్గురూ పరిశోధనలు చేశారు. దీనిఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఈనాడు పరిశోధనారంగంలో ఉన్న శాస్త్రవేత్తలు టి-సెల్స్ నియంత్రణ వ్యవస్థ పనితీరును సంపూర్ణంగా అధ్యయనం చేస్తున్నారు. వివిధ రోగాల బారిన పడిన రకరకాల మనుషులలో పనిచేసే రోగనిరోధక వ్యవస్థలు బలహీన పడినప్పుడు తమంతట తాముగా ఈ వ్యవస్థలు తిరిగి పుంజుకునేందుకు వీలుగా టి-సెల్స్ వ్యవస్థ పనితీరును మెరుగుపరచేందుకు అనేక మార్గాలను అన్వేషిస్తూ, పరిశోధనలను మరింత ముందుకు తీసుకువెళుతున్నారు. ఈ టి-సెల్స్ ఉనికి గురించి 1995లో శాస్త్రవేత్త సకగుచి (జపాన్) మొదటిసారి ప్రపంచానికి తెలియజేశారు.

సకగుచి పరిశోధనా ఫలితాలు ప్రపంచానికి తెలిసిన తర్వాత 2001లో ఇ.బ్రంకో, రామ్స్‌డెల్ ఇద్దరూ ఫాక్స్‌పి3 పేరుగల జన్యువులో శరీరానికి తీవ్రమైన హాని చేసేవిధంగా డిఎన్ఎలో శాశ్వత మార్పులు తీసుకువచ్చే మ్యుటేషన్‌ను గుర్తించారు. ఈ ఫాక్స్ పి 3 జన్యువు శరీరంలో రోగనిరోధకశక్తి కారకాల ద్వారా వ్యాధులను పుట్టించగలదు. అంటే ఈ జన్యువు పనితీరువల్ల మన రోగ నిరోధక వ్యవస్థ మన శరీరంపైన దాడిచేసి వ్యాధులు కలిగిస్తుందని బ్రంకో, రామ్స్‌డెల్ గుర్తించారు. వీరిద్దరూ దీనిని గుర్తించిన రెండు సంవత్సరాలకు మళ్ళీ జపాన్ శాస్త్రవేత్త సకగుచి రంగంలోకి దిగి, దారితప్పి శరీరానికి హాని తలపెట్టగల టి-నియంత్రణ కణాలు లేదా టి-రెగ్స్ అభివృద్ధి చెందకుండా ఫాక్స్ పి 3 జన్యువును నియంత్రించగలదని చెబుతూ అనుబంధ పరిశోధనలు చేశారు. వాస్తవానికి ఈ టి-రెగ్స్ కణాలు శరీరంలో కీలకమైన రోగనిరోధక సైన్యంగా సెక్యూరిటీ గార్డులాగా పనిచేస్తుంది. వీరు చేసిన కృషి మానవ రోగనిరోధకశాస్త్రంలో సరికొత్త ద్వారాలు తెరచిందని, ప్రపంచవ్యాప్తంగా అనేక మంది దీనిపై పరిశోధనలు చేసి కేన్సర్ వంటి వ్యాధుల చికిత్సకు మార్గాలపై అన్వేషణలకు దారితీసిందని కరోలిన్‌స్కా రుమటాలజీ ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్ మేరీ వాహ్రెన్-హెర్లెనియస్ చెప్పారు.

# దాడికి యత్నం

(మొదటి పేజీ తరువాయి)

అంటూ అతడు పెద్దపెట్టున నినాదాలు చేస్తుండగా అతడి వద్దకు వేగంగా చేరుకున్న పోలీసులు ఆ న్యాయవాదిని అదుపులోకి తీసుకున్నారు. 'ఇవన్నీ చూసి మీరెవ్వరూ పరధ్యానం చెందకండి. మనం పరధ్యానంలో లేము. ఏవీ నన్ను ప్రభావితం చేయలేవు. ఇలాంటి వారి వల్ల ప్రభావితమైన చివరి వ్యక్తిని నేనే' అని ఈ సంఘటన వల్ల నిర్లిప్తతకు గురైన ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ న్యాయవాదులను ఉద్దేశించి చెబుతూ తన విచారణను కొనసాగించారు. న్యాయవాదులు తెలిపిన ప్రకారం... సిజెఐ బి.ఆర్.గవాయ్ జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం న్యాయవాదుల కేసుల ప్రస్తావనను విచారిస్తున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. అనంతరం డయాస్ వద్దకు వెళ్లి తన బూటును తొలగించి జడ్జిలవైపునకు విసిరేందుకు ప్రయత్నించిన న్యాయవాదిని ఢిల్లీలోని మయూర్ విహార్ నివాసి రాకేష్‌కుమార్ (71)గా గుర్తించారు. అయితే శరవేగంగా అక్కడకు చేరుకున్న పోలీసులు అతడి దాడి ప్రయత్నాన్ని నిరోధించగలిగారు. పోలీసులు ఆ న్యాయవాదిని కోర్టు ప్రాంగణం బయటకు తీసుకువెళ్లారు. కోర్టు బయటకు తీసుకువెళ్తుండగా కూడా అతడు పెద్దపెట్టున 'సనాతన్ కా అవమాన్ నహీ సహేంగే' నినాదాలు 'సనాతన ధర్మానికి అవమానాలు జరిగితే ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోం' అని చేయసాగాడు. పోలీస్ వర్గాల ప్రకారం... సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌తో సమన్వయం చేసుకుని ఈ విషయమై తదుపరి విచారణను నిర్వహిస్తామని, న్యాయవాది చర్య వెనక ఉన్న ఖచ్చితమైన ఉద్దేశం ఏమిటన్న వివరాలను త్వరలోనే రాబడతామని చెప్పారు. ఈ ఘటనపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ ఈ చర్య 'దురదృష్టకరమైనది', 'ఖండించదగినది' అని అన్నారు. ఇది తప్పుడు సమాచారం, చౌకబారు ప్రచారం మూలంగా జరిగిందన్నారు. సీనియర్ అడ్వకేట్ ఇందిరా జైసింగ్ ఈ ఉదంతం గురించి మాట్లాడుతూ ఈ దాడి మొత్తం న్యాయవ్యవస్థ మీద జరిగిన దాడిగా వ్యాఖ్యానించారు. 'ఈ సంఘటనకు సంబంధించి నేను ప్రత్యక్షసాక్షిగా లేను. మీడియా నుంచి అందిన సమాచారం ప్రకారం నాకు తెలిసింది. విచారణ జరగాల్సిందే. ఇది కేవలం ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి యత్నమే కాదు. న్యాయవ్యవస్థ మొత్తం మీద జరిగిన దాడి' అని ఆమె అన్నారు. 'నేను ఈ దాడిని ప్రధాన న్యాయమూర్తిపై చేసిన కులతత్వ వ్యాఖ్యగా భావిస్తున్నాను. దీనిపై సుప్రీంకోర్టు నుంచి చట్టపరమైన ప్రతిస్పందన అవసరం' అని ఇందిరా జైసింగ్ పేర్కొన్నారు. గత నెలలో ఖజురహోలో విష్ణు విగ్రహాన్ని పునరుద్ధరించడం గురించి జరిగిన విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ చేసిన వ్యాఖ్యలపై న్యాయవాది అసంతృప్తి వ్యక్తం చేయడానికి సంబంధించి ఈ సంఘటన ముడిపడి ఉండవచ్చు. మధ్యప్రదేశ్‌లోని యునెస్కో వారసత్వ ఖజురహో సముదాయంలో భాగమైన జవారీ టెంపుల్ వద్ద ఏడు అడుగుల విగ్రహాన్ని పునర్ నిర్మించి తిరిగి ప్రతిష్ఠించాలని ఆదేశాలు కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను సిజెఐ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తోసిపుచ్చింది. ఇది 'పబ్లిసిటీ ప్రయోజనాల వ్యాజ్యం'... మీరు లార్డ్ విష్ణుకు బలమైన భక్తుడిని అని ఒక వేళ చెప్పుకుంటున్నట్లయితే వెళ్లి మీ దైవాన్ని ఏదైనా చేయమని అడగండి. దాని కోసం మీరు ప్రార్థన, కొంత ధ్యానం చేసుకోండి అంటూ సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో వచ్చిన విమర్శనాత్మక వ్యాఖ్యలను పరిగణనలోనికి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ తాను అన్ని మతాలను సమానంగా గౌరవిస్తాను అని చెప్పారు. సోషల్ మీడియాలో మీ వ్యాఖ్యలు తప్పుడుగా ప్రచారం అవుతోందని ఒకరు చెబితే తనకు తెలిసిందని, తాను అన్ని మతాలను గౌరవిస్తాను అని సిజెఐ బి.ఆర్. గవాయ్ సెప్టెంబర్ 18న చెప్పారు.

### సిజెఐపై దాడిలో ద్వేషం ఎంత లోతుగా పెరిగిందనేది అర్థమవుతోంది : కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే

భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడిని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే సోమవారం ఖండించారు.ఈ దాడి అవమానకరమైన, బుద్ధిహీనమైన చర్య అని, మతోన్మాదం సమాజాన్ని ఎలా ముంచెత్తిందనేది ఈ ఘటన వెల్లడిస్తోందని మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యానించారు. కోర్టు విచారణ సందర్భంగా 71 ఏళ్ల న్యాయవాది ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరేస్థాయికి చురుకున్నారని, కానీ భద్రతా సిబ్బంది వెంటనే ఆ న్యాయవాదిని అడ్డుకున్నారని, ఈ ఘటన దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఇది మర్యాదను ఉల్లంఘించడమేనని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. గౌరవనీయ భారత ప్రధాన న్యాయమూర్తిపై సోమవారం కోర్టు విచారణ సందర్భంగా జరిగిన దాడి ప్రయత్నం అనేది ఊహించని అవమానకర, అసహ్యకర ఘటన అని, ఇది మన న్యాయవ్యవస్థ గౌరవంపై జరిగిన దాడి అని మల్లికార్జున్ ఖర్గే తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. మెరిట్, సమగ్రత, పట్టుదల ద్వారా దేశంలోనే అత్యున్నత న్యాయపదవికి ఎంపికైన సిట్టింగ్ ప్రధాన నాయమూర్తిని ఈ విధంగా లక్ష్యంగా చేసుకోవడం బాధాకరం అని మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని నిలబెట్టడానికి సామాజిక అడ్డంకులను బద్దలు కొట్టిన వ్యక్తిని బెదిరించడానికి, అవమానించడానికి జరిగిన ప్రయత్నాన్ని ఈ దాడి యత్నం సంఘటన ప్రతిబింబిస్తుంది అన్నారు. గత దశాబ్దంలో దేశంలో మతోన్మాదం, మతతత్వం మన సమాజాన్ని ఎలా ముంచెత్తాయనేది ఇలాంటి బుద్ధిహీనమైన చర్య చూపిస్తోంది అని ఖర్గే వెల్లడించారు. 'భారత జాతీయ కాంగ్రెస్ తరపున నేను ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాను. మన న్యాయవ్యవస్థ సురక్షితం, భద్రత అత్యంత ప్రధానమైనది. బెదిరింపులకు కాదు. న్యాయం, హేతబద్ధతకు ప్రాముఖ్యతను ఇవ్వండి' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే నొక్కిచెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com